నవంబరు 1934

ఆంధ్రభూమి.


1. కవివిశ్వేదము – శ్రీ తాంత్రిక విరుగ కేశవులు — 393
2. విచిత్ర వివాహం – శ్రీ కనపర్తి గంటి సుబ్బయ్యగారు – 394-396
3. పరిశ్రమ, మృతునప్పు, నాగరం – టాల్‌స్టాయ్ — 396-398
4. కోర్కెల పుత్తూరులు – కవి శ్రీ రంగ వెంకయ్యగారు — 399-401
5. బుచ్చ మేతృకుండు — కనకదండి గోపాలకృష్ణశాస్త్రి – 401-404
6. గాంధీయము – ఆచంట సత్యనారాయణ — 405-411
7. చిన్న చిన్న వ్యాసాలు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు — 412-415
8. ఆరాధన – శ్రీ ఎలకూచి సత్యనారాయణగారు – 415.
9. వరకట్నం – పురాణం సూర్యనారాయణ శాస్త్రి — 416-421
10. వార్తావళి – — 422-424
11. భూత్లోస్ ఆండ్ మీ సార్వభౌ — 425-430
12. కృష్ణ విద్య – కందుకూరి రామభద్రరావుగారు – 430
13. కవి సమ్మేళన పద్యములు – నండూరి బంగారయ్య – 43-434
14. ఇల్లు విద్యావతాన్ని గుర్తించు – వి. శివాచలపతి — 435-438
15. ఆర్యభాష వర్ధనం – పి. వెంకట్రావు గోపాలరావు – 438-439
16. వృత్తాంతములు – బాగు గోపాలరావు — 440-441
17. పూర్వమర్మ – అడివి బాపిరాజు — 442
18. విధి నిర్ణయం – కె. సాంబమూర్తి — 443-447
19. ఆంధ్రసాహిత్యము – దక్షులూరి వేంకటరత్నము — 448-450
20. ముచ్చటలు — 451-452
21. ప్రశ్న – సమాధానం — 453-454
22. ఆరోగ్య విజ్ఞానము – — 457-459
23. ఆంధ్రభూమి పుస్తక ప్రపంచము — 460-462
24. సంపాదకీయ సమాలోచన — 463-464

ఆంధ్రభూమి నవంబరు 1934

# కవి నిర్వేదము

✣

శారదాదేవి చరణ మంజీరమధుర
నాదబంధురమైన పుణ్యస్థలములు
కవిజనమనోజ్ఞ సుకవితా గానసుధలు
జిందఁ బ్రఖ్యాతిగాంచినమందిరములు.
వీరసైనిక గళరక్తధారలోరసి
నేల నెల్లెడఁ బారిన నిర్ఝరములు
మాతృదేశాభిమానులౌ మనుజవిభుల
క్రొత్తనెత్తుటఁ దడిసిన కుధరతటులు,
కానన వ్రాతములలోనఁ గలసిపోయె
కాలవశమునఁ బాతాళగతములయ్యె
శిథిలనగరప్రదేశ సుస్థిరపరాగ
పటలముననుండి ప్రాచీన భారతీయ
దివ్యతేజంబు పైకినేతెంచు టెపుడొ
యపుడె గాఢాంధకార మగ్నాంధ్రజాతి
కభ్యుదయ సూచకంబగు నంతరంగ
దృష్టి విశ్వమహస్సు దర్శింపగలదు,
ఆశుభావహ పశ్చాత్కాలముకుదెంచు
దనుకఁ బ్రశిథిలదేహంబు నరుగనీకఁ
గావ్యగీతామృతంబుచేఁ గ్లాంతయువక
జీవితోజ్జీవనంబును జేయుసిమ్ము
చాలుపరమాత్మ నాజన్మ సఫలమగును.

—శేషాద్రి రమణకవులు.



# విచిత్రవివాహం

నా అంతట నేను మా అబ్బాయి కటువంటి పెళ్ళిచేసి ఉండను. ఆ పెటకం మీ రామమూర్తే పెట్టాడు. వాడు తప్ప మరెవ్వడుచెప్పినా అటువంటి ఆలోచనను అంగీకరించిఉండేవాణ్ణి కాను కూడాను.

ఈఉత్తరం తిలకించండి.

'నాగపూరు, ౯ జూలై 1924.

'ప్రియమిత్రమా, (ఉత్తరం ఇంగ్లీషులో) 3 వ తేదీన నువ్వురాసిన ఉత్తరం నన్ను చాలా ఆందోళన పెట్టింది. మీఅబ్బాయి పెళ్ళివిషయం ఆలోచిస్తున్నా నన్నువాడవు మా అమ్మాయివిషయం ఎందుకు అడిగావు కావు? నేను నిన్నెందుకు క్షమించను—ఒక షరతుమీద తప్ప. అదేమిటంటే నువ్వు మీ అబ్బాయికీ మా అమ్మాయికీ వివాహంచెయ్యాలి. అదికూడా నేను చెప్పే తీరుగా. మా పెద్దదానిపెళ్ళితో నాకు పెళ్ళంటే హడలిపోయింది. నీకుకూడా అటువంటిభయమే కలిగి ఉండేది నా పెద్దపిల్లమీద నీకు తగినంత కటాక్షం ఉండి ఉంటే.

'మనిద్దరికీ భగవంతుడు కొంతబుద్ధి ప్రసాదించాడు. బుద్ధిగలమనిషి కొక్క అనుభవం. నా అనుభవం నీది కాదా? నువ్వుకూడా నేనుపడ్డగోతులో పడాలా? మంత్రాలబలిమియందు నాకు నమ్మకంచచ్చింది. నీకింకా చావలేదా? భార్యాభర్తల ఇష్టాయిష్టాలతో ఏమీ సంబంధంలేకుండా ఆజన్మాంతం ఇద్దర్నీ ఒకరికొకర్ని అంటగట్టటం పాపంగా తోచటంలేదా నీకింకా? ఊరికే తోచి ఏంప్రయోజనం? ఆచరణలోకి ఎప్పుడొస్తుంది? కీకారణ్యంగాఉన్న ఈ సంఘచట్టాన్ని ఒక ఛెంగనించి బాగుచేసుకుంటూ ఎందుకు రాగూడదు మనం? ఎప్పటికైనా నందనవనం అవుతుందేమో.

'మనపిల్లలకు కొత్తరకం వివాహంచేద్దాం. ఎందుకు చెయ్యకూడదు? ఆ వివాహాన్నిగురించి వివరాలు తరవాతరాస్తాను. ముందు ప్రస్తుతవివాహచట్టంలోఉన్న లోపాలేమిటో గమనించి వాటిని మనం సరిచేసుకుందాం.

'నీకూ నాకూ ఇప్పుడు ప్రేమలో నమ్మకంలేదు. మనకు చిన్నతనంలో లేదా? అప్పుడు మనమనస్సుకు తృప్తిజరిగిందా? లేదు. ఎందువల్ల? మనం చేసుకోవలసినపనులన్నీ ఎవరోచేశారు. మనమూ మనభార్యలూ ఇంకోరి సహాయంలేకుండా కలుసుకుంటే ఎంత ఆనందంగాఉండేది? ఊహించుకో.

'తరవాత మనసంసారాలు చూడు. భార్యాభర్తలకు మొదట్లో పరస్పరాకర్షణఉన్నా, అది సాంతంగా పొయ్యేదాకా, ఒకరిమీద ఒకరికి అసహ్యంపుట్టేదాకా, చక్కగా సుఖమయంగా ఉండవలసినసంసారం కుళ్లుగుంట అయేదాకా భార్యాభర్తలు ఒకర్నిగురించొకరు తెలుసుకోగూడని విషయాలన్నీ తెలుసుకుంటారు. ఆపైనేముంది? కొంచెం రసికల ఆడదిగాని మగవాడుకాని అయితే సంఘచట్టాలన్నిటికీ తిరగబడటం, అతిక్రమించటం, అపఖ్యాతి, లేకపోతే ఈ మురికిగుంటలోనే మునగానాం తేలానాం.

'ఆమీద మగవాడు ఆడదానికందకుండా వృద్ధి కావటం. పిల్లలు ఈ ఇద్దరిమధ్యా ఊగుతూండటం. ఎవరోచెప్పినట్లు ఆడవాళ్ళు సంఘంలో చీట్లపేకలో పాడిముక్కలల్లేఉన్నారు. వాళ్ళేవిధంగా అభివృద్ధి పొందటానికీ అవకాశంలేదు. ఇంకోసంగతిచూడు. అన్ని

శక్తులూ ఉన్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి? అసలు మగవాడికన్న ఆడదానికి అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరికైనా నాకననీ కాక ఏ ఆడదానిపిల్లలు ఆ ఆడదాని పోషణలోనే ఉండటంసహజం. నా పెద్దమ్మాయి కొద్దికాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్దచదువు చదివిస్తాను. అది నెలకు నూరూ నూటయాభై సంపాదిస్తే కాని నాకు తృప్తిఉండదు. నా స్వార్జితం ఇద్దరికీ పంచేస్తాను.

'మరోవిషయం. మనిద్దరం ఒకరిమాటలు ఒకరు ఎట్లా అర్థంచేసుకుంటామో, నాపిల్ల మీ అబ్బాయిని అట్లా అర్థంచేసుకుంటుందని గ్యారంటీ ఇస్తున్నాను. నాపిల్ల మీవాడి నెత్తిన బరువల్లేఉండదు. దాని నైతిక బాధ్యతలూ ఆర్థికబాధ్యతలూ మీ వాడి నెత్తిన వెయ్యదు. ఇద్దరికీ ఎప్పుడభ్యంతరమైతే అప్పుడు విడిపోవచ్చును. ఒకర్నిగురించి ఒకరు అవసరమైనదానికన్న ఎక్కువ తెలుసుకోనక్కర్లేదు. నిజంగా మన అనుభవంలోకి ఎన్నడూరాని ప్రేమే వాళ్ళకు కలగటమే జరిగి, సామాన్యమానవుల్లేకాక, వాళ్ళు ఒకరి దౌర్బల్యమందు ఒకళ్ళు సానుభూతి చూపగలిగితే వాళ్ళిద్దర్నీ భగవంతుడుకూడా ఎడబాపలేడు కదా. ఆలోచించు.

'ముఖ్యమైనవిషయం. ఇది చట్టంగాచేసి లోకానికి ఇవ్వకుమా. ఎంతమంచి చట్టమయినాసరే, అది వెధవల చేతుల్లో విషంగామారుతుంది. లేకపోతే ఇప్పుడమల్లో ఉన్న చట్టాలన్నీ సంఘానికి కీడకలిగించాలని ఉద్దేశించబడ్డవా?

'ప్రత్యక్షంగా అంతా మాట్లాడతాను. నీక్షేమం...'

రామమూర్తిమీద నాకు గురేననండి, నాకు వాడి వాదన సమంజసంగా తోచటంచేతనే కానివ్వండి నేను వాడి ఏర్పాట్లన్నీ అంగీకరించాను. అప్పటికి మా అబ్బాయికి పదిహేడేళ్ళు, రామమూర్తికూతురు పదమూడేళ్ళది. మరి మూడుసంవత్సరాలదాకా చేసేదేమీ చెయ్యదలచలేదు.

1927 మార్చిలో రామమూర్తి మా ఇంటిపక్కస్థలం వెయ్యిగజాలుకొని ఇల్లుకట్టాడు, అది తన చిన్న కూతురి కోసమే.

నేను మా అబ్బాయితో కాని రామమూర్తి తన పిల్లతో కాని ఏమీ చెప్పలేదు.

ఆ డిశంబరులో రామమూర్తి ఇద్దరు పిల్లలనూ తీసుకుని (భార్య రెండోపిల్ల పుటకల్లో పోయింది.) కొత్త ఇంట్లో ప్రవేశించాడు. 'మూడు నెలలు శలవమీద వచ్చాను. అంతదాకా ఉండిపోతాను. ఈలోపుగా ఏం కానుందో చూదాం.' అన్నాడు రామమూర్తి. నేను సరేనన్నాను. మావాడప్పటికి బి. ఏ పూర్తిచేసి ఇంటి దగ్గిరే ఉంటున్నాడు.

రామమూర్తి రెండోకూతురు అందమైన పిల్ల. చాలా చొరవగలది కూడాను. పేరు అలివేణి. మావాడికీ దానికీ స్నేహమయిందంటే ఏకుకాదు కారణం. రామమూర్తి పెద్దకుమార్తె సామాన్యంగా ఇల్లుకదిలేది కాదు.

రామమూర్తి తనతెలివంతా వినియోగించి మాపిల్లలిద్దరికీ బాగా పరిచయంకలిగే అవకాశాలన్నీ ఇచ్చాడు. సినిమాలకూ నాటకాలకూ మావాడివెంట అలివేణిని పంపిస్తూండేవాడు. మావాడు వాళ్ళింటికి సామాన్యంగా వాళ్ళింటికొచ్చే వేళప్పుడు తను ఇంట్లో ఉండేవాడుకాదు. పెద్దపిల్ల ఇంట్లో ఉన్నా లేనట్టే.

వీళ్ళకింతటి స్వేచ్ఛఇవ్వటం అపాయకరమేమో అనిపించేది మధ్యమధ్య నాకు. సాంప్రదాయం ఎక్కడికిపోతుంది?

కాలంగడిచినకొద్దీ ఈస్నేహం వేగం చూస్తుండగానే పెరిగిపోయింది. అలివేణి అస్తమానం మావాడితో ఏదో రహస్యాలోచన చేస్తున్నట్టు గ్రహించాను. నా కర్థంకాలేదు. రామమూర్తితో చెబితే తన కర్థమైనట్టు సూచించాడు.

ఎందువల్లో నాకు రోజులుగడుస్తున్నకొద్దీ ధైర్యం తగ్గటం మొదలుపెట్టింది. ముఖ్యానికి రామమూర్తి మొండిఘటం.

ఒకరోజు నేను దీపాలుపెట్టినతరవాత ఇంటికొస్తూ బజారులో ఒకబండీలో మావాడు అలివేణితో బండీ ఎక్కిపోతూండటం చూశాను. బండిలో ఇద్దరూ కాక

పెట్టెకూడా ఒకటుంది. నా కనుమానం కలిగింది. ఏ ఊరైనా లేచిపోతున్నారా? ఎందుకు?

ఈ విషయమేమిటో కనుక్కుందామని నేనుకూడా స్టేషనువైపున నడవటం మొదలుపెట్టాను. ఆ ఇద్దరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. వాళ్ళెక్కే బండి స్టేషనుదగ్గిర కనిపించింది. నేను మెల్లిగా లోపలికిపోయి అటూ ఇటూ చూడటం మొదలుపెట్టాను వీళ్ళకోసం. ఆ గుంపులో ఇద్దరూ కనపడ్డారు. మావాడిచేతులో పెట్టెఉంది. అలివేణిచేతులో రెండు టిక్కెట్లున్నై. ఇద్దరూ బయటికిపోతున్నారు ప్లాటుఫారంమీదికి. ఇంతలో బండికూడావచ్చింది.

నేనుకూడా ప్లాటుఫారం టిక్కెట్టుకోసం కిటికీ దగ్గిరికిపోతే అప్పుడే బుకింగాఫీసరుగారూ ఎక్కడికో నిష్క్రమించాడు. ఆయనకోసం కేకలుపెట్టి ఎట్లాగైతేఏం ఆయనతో ఘర్షణచేసి టిక్కెట్టుతీసుకుని నేనుకూడా ప్లాటుఫారంమీదికి పొయ్యేటప్పటికి రైలు సాగింది. నేనొక్క అరనిమిషంసేపు దానివంకచూసి నిట్టూర్పువిడిచి వెనక్కుతిరిగేటప్పటికి 'నాన్నా!' అని పిలుపు వినబడ్డది. మావాడు. నాకేమీ అర్థంకాలేదు.

'నువ్వుకూడా పోలేదేంరా?' అన్నాను.

మావాడాశ్చర్యంతో 'ఎక్కడికి?' అన్నాడు.

నాకుమాత్రం ఏంతెలుసు?

'అలివేణి ఏది!' అన్నాను.

మావాడునవ్వి 'నీకెట్లా తెలిసింది?' అన్నాడు.

'ఏది అలివేణి?'

'నాగపూరు పోయింది.'

నా కిపలర్థంకాలేదు.

'ఎందుకు.'

పెళ్ళిచేసుకోటానికి. అక్కడ ఎవడో ఉన్నాట్ట. వాడిదగ్గిర్నించి ఉత్తరాలొచ్చేవి ఆ అమ్మాయికి. అంతా నాకుచెప్పింది. వాళ్ళనాన్నకు చెప్పటానికి భయంట. సరే నా చాతయిన సహాయం చేశాను.'

నేనేమీ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి.

—కొడవటిగంటి కుటుంబరావు.

# పరిశ్రమ, మృత్యువు, రోగం.

[టాల్‌స్టాయి కథకు అనువాదము.]

ఈకథ దక్షిణ అమెరికా ఇండియనులలో చెప్పుకొనటం వాడుక.

వారేమంటారంటే — దేవుడు మానవ జాతిని సృష్టించేటప్పుడు యెవ్వడూ కష్టించి పనిచేయవలసిన అగత్యంలేకుండా చేశాడట. ఉండటాని కిళ్లుగాని, కట్టగుడ్డగాని, తినటానికి తిండిగాని యేదీ అవసరంలేకుండానే, ప్రతివాడూ నిండా నూరేళ్ళు బ్రతికేవాడు. ఆకాలంలో రోగమన్నమాటే యెరుగరు ప్రజలు.

తరువాత కొంతకాలానికి ప్రజ లేవిధంగా బ్రతుకుతున్నారో చూదామనివచ్చాడు భగవంతుడు. వాళ్ళలో నఖ్యత, సుఖము నశించిపోయి పరస్పరకలహాలు ప్రబలిపోయినవి. ఎవనిస్వార్థం వాడే చూచుకుంటూ, సుఖానికి బదులుగా అందరూ దుఃఖమే అనుభవిస్తూవుండటం చూచాడు.

దేవు డీ దురవస్థచూచి ఎవడికి వాడే విడిబడి స్వార్థపరుడై బ్రతికటంచేతనే ఈస్థితి సంభవించిందని తనలో తాననుకున్నాడు. ఈ స్థితంతా మార్పుచెందించే తలంపుతో, ప్రతివాడూ కష్టపడి యేదోయొకపని చేసుకోవలసిన అగత్యం కల్పించినాడు. పని లేకపోతే బ్రతకడమే అసంభవమనుకునేటట్లు చేశాడు. చలిబాధ పోగొట్టుకొనటానికి మనుష్యు లిళ్లుకట్టుకోవలసి వచ్చింది. ఆకలి తీర్చుకొనటానికి భూమిమీదున్న పంటలు పండించటం, ఫలవృక్షాలు నాటడం అవసరమయింది

కష్టించి పనిచేసుకొనే అభ్యాసమే తిరిగి అందరిని ఒక్కటిగా చేయగలిగిన సాధన

మనుకున్నాడు భగవంతుడు. 'పనిముట్లు తయారుచేయటం, కలపకొట్టి, చెక్కి ఎగుమతిచేయటం, ఇళ్లుకట్టటం, భూమిదున్ని పంటలు పండించటం, నూలువడికి బట్టలు నేయటం—ఈ పనులన్నీ సంఘీభావంమీదగాని నెరవేరవు. ఒక్కడివల్ల యేపనీకాదు. అందరూ కలిసి యెంతపని చేయగలిగితే అంత లబ్ధికలుగుతుందనిన్నీ, కష్టపడినకొలదీ జీవితంలో సుఖమూ ఆనందమూ యెక్కువౌతాయనిన్నీ అనుభవంద్వారా మనుష్యులు తెలుసుకుంటారు. ఈ జ్ఞానమే అందరినీకలిపి ఒకటిగాచేస్తుంది' అని అభిప్రాయపడ్డాడు దేవుడు.

ఇట్లా కొంతకాలం జరిగింది. ప్రజలిప్పుడెట్లా బ్రతుకుతున్నారో, యెంతసౌఖ్యమనుభవిస్తున్నారో మరొకసారి చూదామనుకున్నాడు భగవంతుడు. వచ్చిచూచాడు.

కాని మునుపటికంటెనూ ప్రజలిప్పుడెక్కువదుస్థితిలో పడివున్నారు. అవసరాన్నిబట్టి ఎవడిపని వాడికి తప్పిందికాదు. పనులుచేసుకుంటూనేవున్నారు. కావలసిన సంఘీభావం మాత్రం కుదరలేదు. అనేక చిన్నచిన్న తెగలుగా, శత్రుపక్షాలుగా చీలి, ఒకరిపని యొకరు పాడుచేయటం మొదలుపెట్టినారు. కృత్రిమపుపోటీలు పెంచుకొని తమకాలం, శక్తి, సమస్తం వృథాపుచ్చుతూ, అంతులేని కష్టాలనుభవిస్తున్నారు.

దేవు డిదిచూచి మరొక యేర్పాటు చేశాడు. ఏ మనుష్యుడుగాని తానెప్పుడు చనిపోతాడో తెలియకుండచేశాడు. ఏక్షణాని కాక్షణమే మృత్యువు ప్రాప్తించటాని కవకాశం కల్పించి, యీసంగతే అందరికీ తెలియపరచాడు.

ఏ సమయంలో చావు తటస్థిస్తుందో ఎవడికీ తెలియకపోవటంచేత, మనుష్యులు అశాశ్వత లాభాలకోసం పాకులాడటంమాని, తమకీయబడ్డ జీవితకాలాన్ని సద్వినియోగానికి తెస్తారనే యుద్దేశంతోనే భగవంతుడిట్లా శాసించాడు.

కాని దీనికికూడ విఘాతంకలిగింది. మరికొంతకాలంపోనిచ్చి తిరిగి ప్రజలెట్లా బ్రతుకుతున్నారో యని దేవుడువచ్చి చూచేసరికి మానవులింకా మితిలేని బాధ లనుభవిస్తూ పూర్వపుస్థితిలోనే వున్నారు.

ఏ క్షణంలోనైనా ఆకస్మికంగా మృత్యువువచ్చేటట్లు భగవంతుడుచేసిన యేర్పాటే కొందరిలో మరింత స్వార్థపరత్వాన్ని యెక్కువచేసింది. ఈ యవకాశాన్ని తీసుకొని బలాఢ్యులు బలహీనులమీదికి చెలరేగి, కొందరినిచంపి, మరికొందర్ని చంపుతామని బెదరించి, వాళ్ళను తమ బానిసలుగా చేసుకొని హింసించటం ప్రారంభించారు. క్రమంగా బలవంతుల కుటుంబాలన్నీ పనిపాటలు పూర్తిగామాని, సోమరితనంద్వారా కలిగే రోగాలవల్ల పడరానిబాధ లనుభవిస్తున్నారు. బలహీనులందరూ బలవంతులకు లోబడి, శక్తికిమించిన బానిసపనులుచేస్తూ రవంతైనా విశ్రాంతిదొరకక బాధలుపడుతున్నారు. బలవంతులయెడల దుర్బలులకు ఒకవైపున చెప్పరానిభయమూ అసహ్యతా యేర్పడ్డవి. ఈవిధంగా ఒక్కడికీ సుఖంలేకపోయింది. అంతకంతకు దుఃఖమే యెక్కువౌతూ వచ్చింది.

తిరిగి యీ దుస్థితి గమనించాడు దేవుడు. మానవునిజీవితం చక్కబడడానికి మరొక్క సాధనం మాత్రం మిగిలివున్నదనుకొని దానినికూడా ప్రయోగించాడు. అనేక రోగాలుకల్పించి వాటిని ప్రపంచంలో ప్రవేశపెట్టినాడు. రోగులుపడే బాధలను చూచైనా, ఆరోగ్యవంతులకు జాలిపుట్టి

దిక్కులేని రోగులకు ఉపచారం చేస్తారని వూహించే భగవంతుడిల్లా చేశాడు. తమకు రోగంవచ్చినప్పుడు యితరులువచ్చి తమకు సహాయపడవలసివుంటారనే జ్ఞానమైనా కలిగించుకొని, పరస్పర సానుభూతియొక్క ఆవశ్యకతను ప్రజలందరూ గుర్తిస్తారని భగవంతుని వుద్దేశం.

ఇట్లా కొంతకాలం జరుగనిచ్చి మనుష్యులస్థితి యెట్లావున్నదోనని దేవుడు తిరిగి వచ్చిచూచాడు. కాని యిప్పటిస్థితి పూర్వపుస్థితినికూడా మించిపోయింది. జబ్బులద్వారా కలుగవలసిన ఐకమత్యానికి బదులుగా మరింత పరస్పరవైషమ్యం ప్రబలింది. బలాఢ్యులు బలహీనులను నిర్బంధించి పనులు చేయించుకొనడమేకాకుండ, తమకు జబ్బు చేసినపుడుకూడ వాళ్ళనే బాధించి సమస్తోపచారాలూ చేయించుకొనటం మొదలుపెట్టినారు. బీదవాళ్ళకి అస్వస్థతకలిగినప్పుడు తామేమాత్రమూ జోక్యంకలిగించుకొనక ధనికులు తమ సుఖంమాత్రం తాము చూచుకొనేవారు. ఈరీతిగా బానిసలకష్టాలు చెప్పటాని కలవిగాకుండా పెరిగిపోయినవి. బీదలు తమయిండ్లలో రోగులను దిక్కులేకుండా యిండ్లలోనే విడిచిపెట్టి, దినమంతా ధనికుల యిండ్లవద్దనే పడివుండి చాకిరీచేయవలసివచ్చింది. రోగంతో మూలబడిన బీదల రొద ధనికుల సుఖానికీ, మనశ్శాంతికీ అడ్డువస్తాయని చెప్పి బీదరోగులకోసం కొన్ని స్థలాలు ప్రత్యేకించి వారినక్కడ వుంచేవారు. తగిన యుపచారంలేక, చివరకు పలుకరించే వాళ్ళయినా లేక, బాధలు పడిపడి రోగులు యెక్కడివాళ్ళక్కడనే పడి చనిపోతున్నారు. బీదల రోగాలన్నీ అంటువ్యాధులనిచెప్పి ధనికులు రోగులవద్దకు చేరకపోవటమేకాక రోగులవద్దకు పోయివచ్చిన వాళ్లకుకూడ దూరంగా తొలగిపోతున్నారు.

అప్పుడు దేవుడనుకున్నాడు: 'తమకు నిజమైన సుఖమెక్కడవున్నదో మానవులిప్పటికీ తెలుసుకోలేకపోతే, యింకా లెక్కలేనన్ని బాధలనుభవించి, తద్వారానే యెప్పటికైనా వివేకం తెచ్చుకోవలసివుంటారు.' ఇట్లనుకుంటూ ఎవరిదుర్గతికి వారినే విడిచిపెట్టి వూరకున్నాడు.

ఇట్లా చాలకాలం మనుష్యులు పడరాని బాధలనుభవిస్తూ బ్రతికినారు. అందరూ ఐకమత్యం సంపాదిస్తేనే సుఖం పొందగలము గాని, ఐకమత్యమే లేకపోతే అసలు బ్రతుకేలేదని యిటీవలనే అక్కడక్కడ కొద్దిమంది తెలిసికొనడం ప్రారంభిస్తున్నారు. ఒళ్ళువంచి పనిచేసుకొని బ్రతకటం గౌరవహీనంకాదని, పనిపేరుచెపితేనే భయంతో బెదర నక్కరలేదని, అందరూకలిసి అందరి క్షేమంకొరకు పాటుపడటం ప్రతివానికీ విధికృత్యమని, ఇప్పుడిప్పుడే కొందరు బుద్ధిమంతులు తెలుసుకుంటున్నారు. అనుక్షణమూ మృత్యువు మనుష్యునికి దాపుననే వుండటంచేత, ప్రతివాడూ తన కీయబడిన జీవితకాలంలో సంవత్సరాలు, నెలలు, దినాలు, నిమిషాలుకూడా వృథాపుచ్చకుండా, ఐకమత్యం, ప్రేమ సాధించడమే ముఖ్య కర్తవ్యమని తెలుసుకుంటున్నారు. ఈ ప్రపంచంలోవచ్చే రోగాలు మనుష్యలను విడదీసి ఒకరినుండి యొకరిని దూరం చేయటానికి బదులుగా, ఐకమత్యాన్నీ, పరస్పరప్రేమనూ సమకూర్చి పెంపొందించే పరమసాధనమని మానవకోటికి నేటి కాలానికి కొంతకొంత తెలియవస్తున్నది

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, ఎం.ఏ.

# ఊర్వశీపురూరవము

[భావరూపకము.]

ప్రథమాంకము }
ప్రథమరంగము } దృశ్యము—హర్మ్యపరిభాగము. { పురూరవుఁడు
{ ప్రియవయస్యుఁడు.

పురూరవుఁడు :

ప్రియవయస్యా! కేవల మసంభవము. భూలోకమున స్వర్గము వంటి మనోహర ప్రదేశముండునా? ఉండుఁబో ఊర్వశివంటి యపూర్వ రూపవతి యుండునా? ఆరక్కసుల నుక్కడచి.

మ. చెలినిం బూవులఁ బెట్టి తెచ్చినటు నా
చేదోయిపైఁ దెచ్చు లో
మెలపుం గన్నులువిచ్చి క్రన్నణనచే
మెల్లన్ దుదృవ్రాల్చుచున్
లలితానంగ శరప్రకాండముల గా
డన్ నేసెఁ దానొంటిమైఁ [క్రో య
జలమో మోహమొ తీయమోయెఱు
జ్ఞానమ్మొ సంసర్గమో?

ప్రియవయస్యుఁడు :

ఎందులకో యను సందియ మింకను నున్నది కదా?

పురూరవుఁడు :

ఇంకను నున్నదా? సందియ మెల్ల యయ్యింద్రసభనే తీఱినది. అయ్యువిద తానై

క. చూపునకుఁ జూపు చూచుచు [లిన్.
లో ప్రియమును నుబ్బ: నేనెలుబ్ధుఁడనై
ఏపుణ్య పూర్వఫలమో [మ్నా.
నీప్రియుఁడికఁ గనులఁగాంచ నేరఁడు ను

ప్రియవయస్యుఁడు :

నేనుండఁగ నాప్రియుఁడు గాంచ లేక పోవుటేమి? ఇవ్వగమాని నాకన్నులతో నొక్కమాఱు చూడుము. అదిగో స్వర్గము ఇదిగో యూర్వశియనఁ జేతును.

పురూరవుఁడు :

వృథా! వృథా! నీవా క్కసాధ్యము.

ప్రియవయస్యుఁడు :

నావాక్కసాధ్యమనకు. నీవగమానుటె యసాధ్యమును.

పురూరవుఁడు :

అదియు నిజమే - మిత్రమా!

చ మనుజుఁడు స్వర్గలోక మొక
మాఱురుజూడకె తానుభూమిపై
జననమునొందుగోలె మఱి
జ్ఞానము వచ్చుకొలంది దాని పొం
టెను వగఁబెంచుగా - ఒడలి
తేవను స్వర్గము చూడఁగల్గి యం
దునఁగల యచ్చుఱన్ మరులు
నూల్కొని వచ్చిన నాకుఁ జెల్లదే?
అయిన నేవీనీకన్నులు? [అని కన్నులు గొనుట నభినయించు.]

ప్రియవయస్యుఁడు :

ఆహాహా! [అని నవ్వి] నాకన్నులతోఁ జూడుమన్న నాకన్నుల నూడఁబెఱికికొని

నన్ను గ్రుడ్డివానిగఁ జేయుటోయి? ఎట్టి మత్సరము నీ పేరులిూదుగ నన్నుఁ గన్నులు లేని వానిగఁ జేసిన నీవలె నేనును స్వర్గముఁ జూడ లేననియా నీయూహ? అంధుడనైనఁ జూతు.

పురూరవుఁడు :

ఎట్లు?

ప్రియవయస్యుఁడు :

ప్రతివిషయమును గామవికారి కెక్కెట్టూ యను సంశయమే? వినుము.

ఉ. గారెలు బూరెలున్ జవికిఁ
గమ్మనఁ దిన్నవు, డింటియాబిడెం
తేరహాఁ గాగిలిచ్చి తమిఁ
దేల్చినయప్పుడు : నిప్పుడెప్పుడున్
సారెకు సారెకుఁ ద్రుటిని
స్వర్గము నామదిఁ దోఁచుచుండుఁ బైఁ
దోరవునింగి స్వర్గమని
దొడ్డగఁ జూపుడు వేలు చూపదో?

అదిగో! చూడు! చూడు! ఆకసమందు ఏమవి?

పురూరవుఁడు :

[పైకిఁజూచుచు] ఓహోహో! ఏమి మనోహరసందర్శన విభవము!

ఉ. ఆదిశనుండి యాదిశకు
నంబరమందున బార్లుదీఱి, స
మ్మోదమొనంగఁగారున స
మూహముసేగు బలాకపాళి చొ
ప్పాదటఁ దోఁచునట్టుగను,
నప్సరశోభిత పక్షమాలికా
చ్ఛాదన మందగించెడిని
సైర్వవిలాస విలోలచిత్రమై.

అందునవా ప్రణయంపు బెన్నిధియుండవచ్చు.

ప్రియవయస్యుఁడు :

ఏరీ? ఎవరూ?

పురూరవుఁడు :

అరుగో! అరుగో! మన యంతిపురంబు చూపున కడ్డమువచ్చుచున్నది. ఇటురా! రమ్ము. వారినిఁ జూచుచునే పోదము.

ప్రియవయస్యుఁడు :

ఏమి? పై కెగిరిపోదుమా? నాకగపడుట లేదు. మనుష్యులే? ఏరీ?

పురూరవుఁడు :

కనఁబడని స్వర్గము చూడఁగల్గుదు కాని కనఁబడువారి నరయఁనేరవు. మడమల మీాద నిలిచిచూడుము. అరుగో! అరుగో!

ప్రియవయస్యుఁడు :

మనవైపు వచ్చుచున్నారా!

పాట. కొంగా కొంగా గోల్లు
కొంగకు నెత్తని వ్రేళ్లు
చేరికనున్నవి నోళ్లు
దూరాననున్నవి నీళ్లు

అదుగో దగ్గఱగా వచ్చుచున్నారు.

పాట. కొంగా కొంగా గోల్లు
కొండపై నెవరు మావాళ్లు
మీచేతనున్నవి వీళ్లు
నాచేతనున్నవి రాళ్లు

దూరముగాఁ బోవుచున్నారు.

పాట. కొంగా కొంగా గోల్లు
కొండపైఁ గోర్కెల చాళ్లు
ఎందాఁకబోవును కాళ్లు
క్రిందనేయుండంగ దార్లు.

పురూరవుడు :

ఉష్ : ఉత్తపిల్లవానివలె నఱచి పాట దోలినావు.

ప్రియవయస్యుఁడు :

నాచిన్నప్పటి కొంగపాట జ్ఞాపకమువచ్చి

పాడినాను. నేనెవరినీ పాఱదోలలేదు.

పురూరవుఁడు :

పాఱదోలలేదు? ఊఱుకో ఇప్పుడైన నూఱుకో.

శా. అబ్దంబట్టుల నింతతాఁబొడమి యుం
తాచిట్టు లేతేంచెదుర్.

ప్రియవయస్యుఁడు :

లేదిట్లు వచ్చుటలేదు. పాడకపోయినప్పటికిని వచ్చుటలేదు.

పురూరవుఁడు :

నీపాటతో సంబంధము లేకుండనే—
అవును—

శా. ముగ్ధాపాంగ విలాసరేఖబలె ది
ఙ్మాలావకాశాంతమై
స్నిగ్ధావృత్తిని నచ్చరల్ వరుసతా
క్షీణించెడిఁ దృష్టినే

అదిగో : ఆపైని నడవిలోఁ వ్రాలుచున్నారు. నేను వారినరసి కలిసికొందును గాక. [అని సోపానములు వేవేగ దిగును.]

ప్రియవయస్యుఁడు :

శా. ఆస్నృమోహన దర్శనాయతము ల
న్యోన్యంబు దూరంబయున్.

వడివడి రాజప్పుడే యతిప్రాసల విడివడ్డ కవివోలె రెండింటిని మూడింటిని దప్పించి సోపానంబులుదిగి కక్ష్యాంతరంబులు కడచుచుండెనే? తొందరలో నరదంబు గొనక నడచిపోవుసేమో? కేవలము మృగతృష్ణ పారతంత్ర్యము. నేనును వెంటఁజని యరసెదఁగాక. [నిష్క్రమింతురు.]

[సశేషము.]

—కవికొండల వేంకటరావు.



# 'బిచ్చమెత్తుకుంటా!'

౧

శ్రావణమాసం వెళ్ళిపోవొచ్చింది. నడివర్షాకాలం. హోరున జోడీపాతం వానకురుస్తోంది ఈయింటిమీద కాక ఆయింటిమీద వాలడంలేదు. ఈదరగాలి. కారుమబ్బులు ఉరుములు మెరుపులు తూరుపువైపున కిటికీలోంచి పచ్చని చెట్లతో కప్పుకుపోయిన కొండలు చక్కగా కనబడుతున్నాయి.

కోర్టువేళకి తెరుపిస్తుందేమో అని చదువుతున్న పుస్తకం టేబిలుమీద ఉంచి వరండాగుమ్మంలో పచారు చేస్తూ ఆకాశంకేసి చూశాడు మురళి. తగ్గేలా ఏమీ కనబడలేదు. పది అయింది. భోజనంచేసి సిద్ధంగా ఉంటే తెరిపివ్వగానే వెళ్ళవొచ్చుననుకొని కిందకి దిగాడు. పిలవడానికి వొస్తున్న 'మధు' ఎదురుపడింది ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళడానికి బయలుదేరారు.

'ముద్దేయించడమ్మా! ముద్ద' అని కేక వినబడింది. మురళి వెనక్కితిరిగి తలుపుతీశాడు. జల్లు ఊరికే లోపలికి కొడుతోంది. చూరంట జారే వాననీళ్ళు హోరున చప్పుడు చేస్తూన్నాయి. కొద్దిగా తలుపుపక్కకి నిలబడి చూశాడు. ఇరవైయైదేళ్ళుంటాయి. వానకి తడిసిపోయిన చాలీచాలని చిరుగులగుడ్డ కట్టుకుంది. ఏడాదిబిడ్డని చంకపెట్టుకుని ఆతడిగుడ్డే కప్పింది. వొణికిపోతున్నాడు బిడ్డ. ఒక ముష్టిమనిషి. గుమ్మంలో నిలబడి ఉంది.

'బాబయ్యా! బిడ్డ చలికి వొణికిపోతున్నాడు. యింత పాతగుడ్డ ఇప్పించండి తండ్రీ.' అంది వొణుకుతూను.

చిన్ని పరుగెత్తుకొచ్చింది.

'నన్ను రానియ్యటంలేదు' అంటూ కృష్ణుడు వొచ్చాడు.

మురళికి అదంతా చూచేసరికి గుండె కరిగిపోయింది. ఎంతో విచారించాడు.

'మధూ! ఏదేనా పాతచీర తెచ్చి ఇయ్యవో' అన్నాడు.

'నేకెత్తావు' అని చిన్ని పరిగెత్తింది.

'బాబయ్యా! మొగాడికి కోపమొచ్చి చావకొట్టి పొమ్మని తోలేశాడండి. నిన్న మద్దేలనుంచి తిండిలేక వానలో అయింటికీ ఈయింటికీ తిరుగుతూ ఇలా వొచ్చానండి. బిడ్డకీవాకా పట్టెడన్నం పెట్టించి పున్నెం కట్టుకోండి తండ్రీ! మీపాదాలకి మొక్కుతా' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

'అక్కడా ఇక్కడా దొరికే దొరకాక్క అడుక్కుంటూ తిరగకపోతే ఎక్కడేనా కూలిచేసుకుంటే నీకు నీబిడ్డకి సరిపడ్డతిండి దొరకదుటే?' అన్నాడు మురళి.

'మావోంటోళ్ళకి కూలెక్కడ దొరుకుతాదండి? ఏదో అడుక్కు తిండమే కాని' అంది.

'మా ఇంట్లో చేస్తావు? ఇంతతిండెట్టి పాతగుడ్డలిస్తాఉంటా నీకు నీబిడ్డకీని. ఏదైటో గుడిసేసుకుందు గాని. తాగి అల్లాఏడిశాడు గాని మళ్ళ వాడే రమ్మంటాడు. మరేంఫరవాలేదులే' అన్నాడు మురళి.

'అల్లాగే బాబా?' అని మహానందపడింది.

'నాన్నా! బువ్వెట్టనా' అన్నాడు కృష్ణుడు.

చిన్ని పాతబట్ట తెచ్చి యిచ్చింది. బిడ్డనికూడిచి తను కట్టుకుంది. అందరి భోజనాలూ అయినాక మధు అన్నం తెచ్చి పెట్టింది. వర్షంకురుస్తోనే ఉంది.

'సాయంకాలంనుంచి ఇంట్లో అన్నిపనులు ఇది చేస్తుంది. దాసీ దాన్ని రావొద్దుఅనిచెప్పు, నాలుగు చోట్లకి ఒప్పుకొని ఓరోజు ఝాము తెల్లారగట్ల, ఓరోజు ఝాముపొద్దెక్క వొస్తాంటుంది. ఇదెప్పుడూ మనిల్లే కాసుకుంటుంది' అని భార్యతో చెప్పాడు.

వర్షం హోరున కురుస్తానే ఉంది. మురళి కోర్టు మానేశాడు. మధ్యాహ్నం దాసీదివొస్తే తనే రావొద్దని చెప్పి మాన్పించేశాడు.

౨

'రామి' ఊరిబయట చిన్నగుడిసె వేసుకుంది. రెండు పూటలా తను, బిడ్డా కడుపునిండా యింత తిండి తింటూన్నారు. వారంరోజుల్లో నమ్మకమైన మనిషి అనిపించుకొంది. ఇల్లూ వాకిలూ ఊడ్చేది. దీపాలలో చమురుపోసి సిద్ధపరిచేది నీళ్ళుతోడేది, పక్కవేసేది పిల్లల్ని ఆడించేది అదీ ఇదీ ఏమిటి అన్నిపనులుచేసేది.

ఆఖరు శ్రావణ మంగళవారం. చిన్ని, మధు తల అంటుకున్నారు. పూజలు చేసుకున్నారు. కళ్ళకి కాటుక పెట్టుకుని వొచ్చిపోయే ముత్తయిదువులకి వాయినా లిచ్చి అక్షతలు మీద వేయించుకుంటున్నారు.

మబ్బులు మళ్ళీ ముసుకువొస్తున్నాయి. ఉరుములు మెరుపులూ. కొండలమీద కురుస్తోంది వాన. వాయినాలు పుచ్చుకుని వానరాకుండా ఇంటికి చేరుకుంటున్నారు తడవకుండాను.

కృష్ణుడు వాళ్ళ పిన్నిగారి పిల్లలు బొట్టిపెట్టినిండా కాగితాలు చింపి పోసుకుని పడవలు చేసుకుంటూ వసారాలో కూచుని వానకాలవల్లో వొదులుతున్నారు మధ్యమధ్య కేకలు వేసుకుంటూను.

రామి పనులన్నీ చూసుకుని కృష్ణుడికి నీళ్ళుపోసి చొక్కాతొడిగి కూర్చోపెట్టి పక్కలువేసి బిడ్డనెత్తుకుని ఇంట్లో తల్లితో చెప్పి వెళ్ళిపోయింది చినుకులు రాకుండా.

అయిదుగంటలయింది. హడావిడి తగ్గింది. చినుకులు రాలుతున్నాయి. అప్పుడప్పుడొచ్చేవాళ్ళకి వెంటనే వాయినాలిచ్చి పంపేస్తున్నారు. చిన్ని తల్లితో కబుర్లు చెబుతూ వంటింట్లో కూర్చుంది.

'చిన్నీ! జడవేయించుకోవూ? నాగరం తెచ్చుకురా! వేస్తాను. చీకటిపడిపోతుంది మళ్ళీని.' అన్నది మధు.

తలంటుకొనేందుకు నాగరంతీసి బొట్టి పెట్టెలో పెట్టింది ఉదయం. గదిలోకివెళ్ళి చూసింది పెట్టె లేదు. వాకిటిలోకివచ్చి చూసింది. కృష్ణుడు కాయితాలతో నిండిఉంది. అందులో వెతికింది కనబడలేదు. అంతటా చూచింది.

'కృష్ణా! నాగరంతీశావురా!' అంది చిన్ని.

'మరేం రామి పట్టుకుపోయిందే' అన్నారు పిన్నిగారి పిల్లలు.

'ఔనే నిజమే' అని కృష్ణుడు తల ఊపాడు.

'రామీ!' అని వాకిటిలో కెళ్ళి పిలిచింది పలకలేదు.

తల్లి వంటింటిలోంచి 'ఇప్పుడేవెళ్లిందే' అని చెప్పింది.

'అక్కా మాశావుటే రామి పట్టుకుపోయింది నాగరం కృష్ణుడూ వాళ్ళూ చూశారుట' అంది చిన్ని.

'దొంగ అది జాగర్తర్రోయి' అని అమ్మ చెబుతునే ఉండేది నాన్నరానీ చెబుదాం' అంది మధు.

'ఏమిటే! అవాఘ్కానిడి' అని తల్లి వాకిటిలోకి వచ్చింది.

'చిన్ని నాగరం రామి పట్టుకుపోయిందిట కృష్ణుడు చూశాడుట' అన్నది మధు.

'నేచెప్పలేదూ! నాకు తెలుసు. దాని మొహమే చెబుతోంది. దాని దొంగవాలకం అదీని-' అంది తల్లి.

'చిన్నీ' అంటూ కోటువిప్పుతూ మురళీ అక్కడికి వచ్చాడు. కృష్ణుడు కాళ్ళకి అడ్డపడ్డాడు.

'చూశారా? అన్నంత అయింది నేచెబితే మీరు వింటారా? నమ్మకంగా పనిచేసే మనిషిని తీసుకొమని మాటిపించారు' అంది విసుగుగా భార్య.

చిన్ని 'నానాగరం రామి పట్టుకుపోయింది' అంది.

'పిన్నిగారి పిల్లలు, కృష్ణుడు చూశారుట నాన్నా యిందాకాను' అంది మధు.

'చప్పునతెచ్చు నాన్నా' అంది చిన్ని.

మురళీ 'చిన్నవాళ్ళమాటలేనా! అంతా చూశారా? బంగారేమిటి? ఎక్కడికిపోతుంది' అన్నాడు.

'అంతా వెతికాము నాన్నా. ఎక్కడా కనబడలేదు. అది తీసికెడుతూంటే కృష్ణుడు చూశాడుట' అంది మధు.

'ఔను నాన్నా ఔను.' అన్నాడు కృష్ణుడు.

మురళికి ఏమీతోచలేదు. రామి అటువంటి పనులు చేస్తుందని అతనికి నమ్మకంలేదు, దారిద్ర్యంచేత చేసిందేమో అనుకున్నాడు. రామి గుడిసెదగ్గిరకి బయలు దేరాడు. చిన్నగా చినుకులు పడుతున్నాయి. రామి బిడ్డకి మెతుకులు పెడుతోంది. మురళినిచూసి నిర్ఘాంత పడిపోయింది.

'ఏంబాబయ్యా! ఇల్లావొచ్చారు వానలోను?' అంది రామి.

'చిన్నినాగరం కనపడలేదుట నువ్వు తీశావని కృష్ణుడు చెబుతున్నాడు. తీస్తే అల్లరికాకుండా చప్పున ఇచ్చెయ్యి. ఏమీఫరవాలేదు' అన్నాడు మురళి.

నిర్ఘాంతపడిపోయింది మొగంమీద నెత్తురుచుక్కలేదు. మాటలేదు. తెల్లపోతూ చూస్తోంది.

'బాబూ మీపాదాలసాక్షి నాకేం తెలియదు గుప్పెడు మెతుకులు పెడుతున్నారు. హాయిగా బతుకుతున్నాము నోటిముందరికూడు పడకొట్టుకుంటానా బాబూ రక్షించాలి తండ్రీ. నేనేమీ ఎరగను' అని తలబాదుకుంటూ ఏడిచింది రామి.

'నిజంచెప్పు నీకేమీ చిక్కులేదులే' అన్నాడు మురళి.

'బాబూ నాకేం తెలియదు. కాయితాలేసి కుట్టన్న గారు బొట్టిపెట్టితో ఆడుకుంటూన్నారు నీళ్ళని చూక్కుతోడిగి ఆడుకోమని చెప్పి వొచ్చేశాను. అంత కన్న ఏమీఎరగను తండ్రీ! నాబిడ్డసాక్షి ఏంచేసినా సరే యీబిడ్డని మీపాదాలమీద పెడతాను' అని ఏడిచింది రామి.

మురళికి ఏమీ ఆలోచనతట్టలేదు ఇంకోలా పోడానికి వీలులేదు. కక్కుర్తిపడి ఇదే తీసిఉంటుందేమో అని అనుమానం బాగాఉంది. అనేకవిధాల తర్కించి అడిగాడు ఏడుపుతప్ప ఏమీచెప్పలేదు. బిడ్డమీద ప్రమాణాలు చేస్తోంది అనుమానం పోలేదు.

'నిజంచెప్పు. బాగుపడు. పోలీసులవచ్చి దావగొడితే చక్కగా చెపుతావు. ఆలోచించుకో నీయిష్టం వెడుతున్నాను. తరవాత ఏంలాభంఉండదు' అన్నాడు మురళి.

'చంపినామీాకే. బ్రతికించినా మీాకే మీయిష్టం వచ్చినట్టు చేయండిబాబూ నేనేపాపం ఎరగను' అని బిడ్డమీదవొట్లుపెట్టుకుని గొల్లుగొల్లున ఏడిచింది. మురళి వెళ్ళిపోయాడు.

చినుకులు పడుతున్నాయి. సూర్యాస్తమయం అయింది. కనుచీకటి. ఇద్దరు పోలీసులువచ్చి గుడిసె ముందర నిలబడ్డారు.

'రామీ అయ్యగారినాగరం తెచ్చియిస్తావా? దెబ్బలు తగలాలా?' అన్నాడు తర్జించి ఓపోలీసు.

'బాబూ! నేనేమీ ఎరగను బిడ్డసాక్షి, దేముడు సాక్షి' అని గొల్లున ఏడిచింది.

'మూస్తావేమిరా దొంగముండ అయ్యగారికే చెప్ప లేదు మనకి చెప్తుందిరా. దెబ్బ దేవేంద్రలోకంఅంటితే చెప్తుంది' అన్నాడు.

రామి 'రక్షించండి బాబయ్యా' అని ఏడ్చింది.

కర్రతో పోలీసు కొట్టాడు. చాలా దెబ్బలు తగి లాయి బతిమాలుకొంది. ఇంకా బాదుతునే ఉన్నాడు గొంతెత్తిపోయింది. బిడ్డ గుక్కపట్టి ఏడిచాడు. దెబ్బ లకి కొయ్యబారి పడిపోయింది. ఏమీ చెప్పలేదు.

రాత్రి కొట్టులో పెట్టారు బిడ్డనీ దాన్నీ. ఉపూరుప తిండి తినకుండా చలిలో బిడ్డని రొమ్మున అద్దుకుని దేవుళ్ళకి దణ్ణాలు పెట్టుకుంటూ నిద్రపోయింది.

3

7½ గంటలయింది. మబ్బుగా ఉంది. ఇన్స్పెక్టరు పోలీసులు మురళియింటికి వొచ్చారు. నాలుగుమూలలా చూశారు కనబడలేదు. పిల్లలకి అబద్ధమాడవలసిన పని ఏం ఉంది? నిజమే అయి ఉండాలని నిశ్చయించు కున్నారు.

'ఈపెట్టె మామూలుగా ఉండేచోటేది' అన్నాడు ఇన్స్పెక్టరు.

'భోషాణంమీద' అని చెప్తూ లోపలకితీసుకెళ్లాడు మురళి. అక్కడఏమీ కనబడలేదు. పోలీసులచేత భోషాణం ఇవతలకి సర్దించి వెతకమన్నారు. పోలీసు భోషాణంకింద నాగరంతీసి ఇన్స్పెక్టరు చేతిలో పెట్టాడు.

మురళిని పిలిచి 'ఇది మీ నాగరమేనా?' అన్నాడు ఇన్స్పెక్టరు.

'ఇదేనా నీనాగరం చిన్నీ.' అన్నాడు మురళి ఆశ్చర్యపడిపోతూను.

'ఔనునాన్నా?' అంది మధు.

'మురళి ఇన్స్పెక్టరు ఏమేమో మాట్లాడుకున్నారు పోలీసులని పంపించి ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళి పోయారు.

పోలీసులు రామిని వదిలేశారు వెంటనే.

'వొస్తువుదొరికిందా' అని రామి ఇంతమొగం చేసు కుని సంతోషంతో అడిగింది.

'నీకెందుకులే పో అదృష్టవంతురాలవు' అన్నారు పోలీసులు.

'చెప్పండి బాబయ్యా' అంది రామి.

'లేకపోతే నిన్నొదులుతారులే పో' అన్నారు పోలీసులు.

రామి బిడ్డని చంకవేసుకుని ఆనందంతో వెళ్ళింది.

మురళి తాంబూలంవేసుకుంటూ కూర్చుని ఏదో ఆలోచిస్తూన్నాడు.

రామివొచ్చింది. బిడ్డని కాళ్ళమీదపడేసి 'దేముడు ఈగండం గాశాడు బాబూ! నాగరందొరికిందటగాదు! బాబూ!' అని ఏమో చెబుతూ ఏడిచింది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చేతులమీద వీపుమీద దెబ్బల దద్దుర్లు తేరాయి.

'ఫరవాలేదు ఊరుకో దొరికింది' అంటూ చాలా విచారిస్తూ చూచాడు.

'రాత్రి ఖైదులో ఎల్లాఉందే' అంది చిన్నివొచ్చి.

'తప్పూకాదులే అల్లాగ-' అంది మధు.

'నమ్మకంగాపనిచేసి గుప్పెడుమెతుకులు తినడానికి భగమంతుడు ఓర్వలేకపోయాడు'అంది రామిదీనంగాను

'మించిపోయిందేమిలేదు. నీపనినీవు మళ్ళీచూసుకో' అన్నాడు మురళి.

'దణ్ణాలు బాబయ్యా అనాదపచ్చిని బిచ్చ మెత్తు కుంటేచాలు. బతుకుతాను.' అని ఏడిచింది రామి.

'ఫరవాలేదే వెర్రిదానా' అన్నాడు మురళి.

'నేనుండనుతండ్రీ, ఎప్పుడేనా ఏదేనా పెట్టండి ఏపనేనా చేసిపోతూంటాను బాబూ,' అంది రామి.

పదిరూపాయిల నోటుతీసి మురళి రామికి ఇచ్చాడు తీసుకోనంది. కాదు అన్నాడు. తీసుకొని ఇంటికి వెళ్ళి పోయింది. క్రింద కృష్ణుడు ఆడుకుంటూంటే చేతిలో పెట్టి వెళ్ళిపోయింది.మురళి చదువుకుంటూంటే కాయితం కృష్ణుడు తెచ్చి బల్లమీద పెట్టి 'రామియిచ్చింది' అని చెప్పి గంతేసి వెళ్ళిపోయాడు.

—కనకదండి గోపాలకృష్ణశాస్త్రి.

# గాంధర్వము

(ఏకాంకరూపకము.)

(గతసంచిక తరువాయి.)

గో (కోపంగా):—నిజమేనమ్మా! బోధపడక నే చేశావు. తప్పని తెలిస్తే ఎందుకుచేస్తావు? నీకుమాత్రం జ్ఞానంలేదా? అంత మూర్ఖురాలివా? ఇహ నేనా బుద్ధిగావుండి బంధువులలో మర్యాద తెచ్చుకో తల్లీ!

సుం (గర్వంతో):—మామయ్యా! నీకుకూడా నా సంగతి సరిగా అర్థంకానట్టుంది. నేనేదో తప్పుపని చేశానని నువ్వుకూడా చాలా విచారిస్తున్నట్టున్నావు. లోకులేమనుకుంటారో, బంధువులేమనుకుంటారో, సంఘం యేమనుకుంటుందో అని నాకోసం అమ్మా నువ్వూ చాలా దిగులుపడుతున్నారు. కాని, నాకోసం యెవరూ విచారించక్కర్లేదు. ఏవరేమనుకున్నా నాకేం లెక్కలేదు—

రా :—చాల్లే—నోరుముయ్యి! వెధవప్రతాపం... యింకా వాదిస్తున్నావు సిగ్గులేక...ఆడదానికి భర్త కంటే యేముంది? భర్తను దైవంలాగు చూసుకోవాలి—

సుం :—అవును; ఎప్పుడో యెవడో మాయిద్దర్నీ కూచోబెట్టి అర్థంలేని, వున్నా తెలీని వాగుడేదో వాగేడని యెల్లకాలం యిష్టమున్నా లేకపోయినా పడియుండవ్వాలి—

రా :—అయ్యో! అయ్యో! ఏమిటిది? ఒళ్లుతెలిసే మాటాడుతున్నావా? వివాహమంటే యేమిటో నీకు తెలుసా?

సుం :—తెలీకేం?—మీ చేతులోవున్న బొమ్మని యింకొకరి ఆధీనంచెయ్యడం అన్నమాట! నేను చిన్నతనంలో నా ఆటబొమ్మని వుంచుకున్నట్టే మీరూ నన్ను తయారుచేశారు. నాకు ప్రాణం, మనస్సూ, ఆత్మా వున్నాయనే మీకు తట్టలేదు. లేకుంటే నాకంత చిన్నతనంలో వివాహంచెయ్యవలసిన అవస్యకత యేమీలేదని తోకవేళ చేసినా నారాయణమూర్తిని తప్ప యింకెవరినీ చెయ్యవద్దనీ యాడవలేదూ?—

రా :—అవున్లే—

సుం :—వొద్దంటూవుంటే నన్నిలాకట్టేయడం మీకు న్యాయమేనా? నేనేం కోరుకున్నా నా, చేశానా? ఇప్పుడు నన్నిలా—

రా :—ఎంత కృతఘ్నురాలివి? నీసౌఖ్యం మాకేమీ అక్కర్లేనట్టూ మాటాడుతున్నావు! నారాయణమూర్తి! వాడెవడు? మనమెవరం? ఒకశాఖా, సాంప్రదాయమా, పోనీ అస్తా, వుద్యోగమా—బికారి వెధవ!...నీకు మేమేం లోపంచేశామూ? నీ వివాహంగురించి మామయ్యా, నేనూ యెంత శ్రమపడ్డామూ? శాఖశాఖ అంటేట్లోనూ యిటువంటి సంబంధంలేదని మన అదృష్టానికి బంధువులందరూ యెంత అసూయపడ్డారూ?...ఇతనికేంలోటూ! కురూపా! కుంటా, గుడ్డా, దరిద్రుడా? ఏం తక్కువైందనీ—యిష్టంలేకపోవడం? నిక్షేపం—నిధి—ఎటువంటి సమస్థానం!

సుం :—అతను గొప్ప ఆస్తిపరులని నాకు తెలుసు. దాన్నంతట్నీ యెల్లా ఖర్చుచెయ్యడమో వూహించడానికికూడా అవకాశంలేనంత ఆస్తి అతనికుంది. కాని—

రా (ముఖంచిట్లించి):—కాని—యేమిటి?

సుం :—ప్రేమకి ధనం అవసరమన్నసంగతి నాకింకా బోధపడలేదు.

రా :—అయితే ఆ బికారి పై—

సుం :—కాదు—అతనే నా ఆస్తి, నా ప్రభువు; నా ప్రాణాలన్నీ సంతోషమంతా అతనే. ఎన్నో జన్మలతరబడిచేస్తున్న నా పుణ్యఫలం. నా జీవనానికి వెలుగు. అతను లేకపోతే నాకు జీవించవలసిన అవసరం యేమీలేదు.

గో (బుజ్జగిస్తున్నట్టు):—అమ్మాయి! తొందర పడకు! బాగా ఆలోచించు! నీ శ్రేయస్సుకోసే చెబుతున్నాం కాని నీమీద మాకేం పగ లేదు. నీ సౌభాగ్యానికి నువ్వే అడ్డుతగులుకోకు!...ఇంతధనం, యీ మేడలూ, నగలూ—

సుం (హేళనగా):—ధనం! మేడలు! నగలు! వీటితో నే నేమిటి చేసుకోడం? ఇవి మానవునికి సౌభాగ్యాన్నిస్తాయి! ఇవ్వగలవు! ధనాన్నిబట్టి మానవులకు విలువకడతారు! ప్రేమకి వెలకడతారు! ద్రవ్యం కోసం మానవుల్ని ప్రేమించాలి—వరించాలి! వద్దువద్దు నాకా ప్రేమతో సంబంధంలేదు. నాకాధనం అవసరంలేదు—

రా :—అయ్యో! ఏమిటి మూర్ఖత? పరువూ, మర్యాదా, ప్రతిష్ఠా—

సుం (గర్జించినట్టు):—పరువు! మర్యాద! ప్రతిష్ట! ఎవరు వాటిగురించి తలబెడుతున్నదీ? ప్రేమకంటె మధురమైంది, అంతకంటె బలమైంది, దానికంటె ఉత్కృష్టమైంది నాకీ లోకంలో గాని పరలోకంలో గాని యేమీ లేదు. దానికోసం జనసంఘం, సంపత్తీ, పరువూ, మర్యాదా, ప్రతిష్టా, మతమూ, నీతీ, పవిత్రతా అన్నీ వొదులుకుంటాను. ప్రేమరహితమైన, స్వేచ్ఛారహితమైన స్వర్గంకూడా నా కక్కర్లేదు.

రా :—నీకేదో కొంచెం పిచ్చెత్తినట్టూవుంది.

ధ :—అవును; ప్రేమ చాలామందిని పిచ్చివాళ్ళను చేస్తుంది.

రా (పళ్లుబిగిస్తూ):—ఊం, ప్రేమ! దీని మొహం—యేమ్మహా అందంగా వెలిగిపోతున్నాడని?

ధ :—అత్తా! మనమట్టుకి అతన్లో విశేషమైన అందం యేమీ గోచరించకపోవచ్చును. మనకతడు సామాన్యంగానే కనబడవచ్చును. కాని, వొక్కొక్క హృదయ మొక్కొక్కరూపంపైని వాలుతుంది. అప్పుడారూపం—ఆ వొక్కరూపమే యెన్నటికీ చెరగకుండా ఆ హృదయంలో నాటుకుపోతుంది—

రా :—ఆఁ. యేడుస్తుంది.

(అప్పుడుసాళిట్లోనుంచి 'ధర్మం' అన్నపిలుపు)

ధ :—వస్తున్నా.

రా :—ఎవరూ?

ధ :—నారాయణమూర్తిలాగుంది—

రా (మండిపడుతూ):—ఆ వెధవిక్కడికికూడా వస్తున్నాడూ? ఇంకా సిగ్గులేక...పొమ్మను...గెంటి అవతలకి...ఆ పాడుమొహం నాకంటపడనీకు .. నే చూడలేను—

సుం (నెమ్మదిగా):—నాన్నగారూ! నారాయణమూర్తి యిక్కడికి రావడానికి తగినంతయోగ్యుడు కాడూ?

శ్రీనివాసరావు (శాంతంగా):—అతడు చాలా మంచివాడనే నా వుద్దేశం. అతనెంత బుద్ధిమంతుడో అంతయోగ్యుడు.

సుం :—అయితే అతనిరాకకి మీ అభ్యంతరం—

శ్రీని :—లేదమ్మా! నాకేం అభ్యంతరంలేదు—సరికదా అతను రావాలనే నేను కోరుతున్నాను. కాని, యిది మనయిల్లు కాదు; ధర్మారావుగారు యిష్టపడితే అతనిరాకకి నేను చాలా సంతోషిస్తాను.

ధ :—నాకేం అభ్యంతరం? ఇదిగో తీసుకువస్తున్నా.

[ధర్మారావు చరచరా వెళ్ళి నారాయణమూర్తి రెక్కపట్టుకుని మెల్లగా ప్రవేశిస్తాడు.

నారాయణమూర్తి—ఆకుపచ్చ పట్టంచుల ఖద్దరుపంచా, గుండ్రబొత్తాముల కంటె మెడ ఖద్దరులాల్చీ, పైమీద లేతగులాబీ ఖద్దరు వుత్తరీయం వల్లెవాటుగా ధరించి వుంటాడు. అతని రూపమునుబట్టి వయస్సు యిరవై అన్న యెడల అంతేనా అనీ, యిరవై రెండూ, యిర్వైమూడూ అన్న యెడల అంతవుండదేమోననీ తోస్తూవుంటుంది. వుంగరాలుతిరిగిన పొడుగాటి నల్లని క్రాపూ, అంతకంటె నల్లగా తళతళలాడే పెద్దకళ్లూ, చివర కొంచెం వంపుతిరిగిన చురుకైన సూది ముక్కూ, చిరునవ్వులొలికే పెదవులూ, ఆ లేతముఖమూ, నాజూకైన వొళ్లూ అన్నీ

అతడు చాలా అందమైనవాడని చెప్పక చెబుతూవుంటాయి. వెయ్యిమందిలోవున్నా అందరికళ్లూ ముందుగా అతనిమీద వాలుతాయి.]

రా (వారు సమీపిస్తూవుండగా వుద్రేకంతో):— అయ్యో. ఆ వెధవనెందుకు తీసుకువస్తున్నావు? గెంటీడం మానేసి...(కోపంతో వుత్తేజితురాలై పళ్లు బిగిస్తూ) పాపాత్ముడు...ఛండాలుడు...యే మొహం పెట్టుకువస్తున్నాడు—

ధ (నెమ్మదిగా):—అత్తా! అతనిపై నెందుకూ కోపం! అతని తప్పేముందీ యిందులోనూ? బాల్యంనుంచీ యిద్దరూ చనువుగా వొక్కచోట మెలగడంవల్ల అతనికి సహజంగా మీపిల్లపైని ప్రేమ జనించింది. మీపిల్ల యేమాత్రం వుపేక్షవహించినా, ప్రతిప్రేమ చూపకపోయినా అతనిప్రేమ క్రమంగా తగ్గిపోయివుండును. కాని, మీపిల్లకుకూడా ఆవిధంగానే అతనిపైన మనస్సున్నట్టూ తెలుసుకోవడంవల్ల అతనిప్రేమ క్రమంగా అభివృద్ధిచెందింది. ఈ విషయంలో అతను సహజస్వభావాన్ని అనుసరించివెళ్ళాడు. అతని దోషమేముందీ?

గో:—ఔను దీనిలో బుద్ధిలేకపోతే అతణ్ణి నిందించడం యెందుకూ? దీనికిపాడుబుద్ధి లేకపోతే అతను చేరగలడా?

(ఇద్దరూ బాగా సమీపిస్తారు. నారాయణమూర్తి నుద్దేశించి)

రా (వుద్రేకం అణుచుకుంటూ):—బాబూ! నువ్వు మాకు బంధువుడవుగాని, ఆప్తుడివిగాని కావుగదా?

నారాయణమూర్తి:—కాను—

రా:—అయితే యేమిటి బాబూ! యీ వ్యాపారమంతానూ!

నా:—ఏం వ్యాపారం?

రా:—ఏం వ్యాపారమా? మాపిల్లతో యెందుకూ పేకాడతంతానూ? అది ఆడదీ, భర్తతో అత్తవారింట్లో కాపరంచేస్తున్నదీనూ. నువ్వు మంచి బుద్ధిమంతుడివీ, ప్రాజ్ఞుడివీ, బాగా చదువుకున్నవాడివీను. దాన్నీ, దాని సంసారాన్నీ యిలా పాడుచెయ్యడానికి ప్రయత్నించడం న్యాయమేనా!

నా (తలవాల్చుకుని నెమ్మదిగా):—నే నేంచేశానూ? బాల్యంనుంచీ మీపిల్లా నేనూ యెంతచనువుగా, యెంతస్నేహంగా తిరిగేవాళ్ళమో మీకు తెలీదూ? ఎప్పుడూ వొక్కచోటేవుంటూ, కలిసే పేకార్లువేసుతూ—

రా:—నిజమేబాబూ! బాల్యంలో మీ యిద్దరూ చాలా స్నేహంగావుండేవారే అనుకో! కాని అదింకా చిన్నపిల్ల కాదుకదా? భర్తతో కాపరంచేస్తున్నపిల్ల. దాన్తో యిప్పుడుకూడా నువ్వలా ప్రవర్తించడంలో కాని కేంబాగుంటుందీ? అందువల్ల దాని కనేక చిక్కులొస్తాయి. దాని కాపరానికికూడా నీళ్ళపాలై పోతుంది. నీకంటే యింకా పెళ్ళికాలేదు; కాని, మీ యింట్లోకూడా ఆడబిడ్డలున్నారుకదా? వాళ్ళుకూడా యిలాగే కట్టుకున్నభర్తల్ని విడిచిపెట్టి పరాయివాళ్ళతో పేకార్లుకొడుతూవుంటే నువ్వు సహించగలవా? అప్పుడు నీకెంత కష్టంగావుంటుంది? ఇదిగో నీ పెద్దలకు అతు నమస్కారాలు. నాకీలోకంలో యీపిల్లకంటె యెవ్వరూలేరు. దీన్ని విడిచిపెట్టు బాబూ, నీ పుణ్యముంటుంది. నీకేం, మొగవాడివి. ఎల్లాతిరిగినా చెల్లుతుంది. పండువంటి దాని కాపరానికి మాత్రం యెసరుపెట్టకు బాబూ! (దీనంగా) నిన్ను బతిమాలుకుంటాను. నీపాదాలు పట్టుకుంటాను.

[నారాయణమూర్తి స్తంభితుడై పోతాడు. ఇంకేమీ మాటాడలేక ముఖం వాల్చుకుని వెనక్కిమళ్లిపోతాడు. మెల్లగా వీధిద్వారము వరకూవెళ్లి వుండబట్టక ముఖం వెనక్కుతిప్పి అశ్రుజలాల్లోనుంచి సుందరివైపొక్కసారి జాలిగాచూస్తాడు. అంతవరకూ అతణ్ణే అనుసరిస్తున్న సుందరికళ్ళనిండా నీళ్లూరుతాయి. ఆమె చిన్న నిట్టూర్పువుచ్చి దోసిడితో ముఖం కప్పుకుంటుంది. అంతలోనే చటాలున లేచి రుద్ధకంఠంతో 'అబ్బాయి!' అని పిలుస్తుంది. వొదల్లేక వొదల్లేక

వెళ్లిపోబోతున్న నారాయణమూర్తి చటుక్కున ఆగిచూస్తాడు.]

సుం :—ఉండు. నేనూ వొస్తున్నాను.

(ఆమె లేచి మెల్లగా కలలో నడుస్తున్నట్టు నడుస్తూ నారాయణమూర్తి దెగ్గిరికి వెళుతూ వుంటుంది.)

గో :—సుందరీ! తొందరపడకు తల్లీ! నేమందరం నిన్నెంతముద్దుగా, గారాబంగా చూసుకుంటున్నామో నీకు తెలీదూ? లావణ్యరేఖలాగు నువ్వు నీభర్తతో కలిసి కాపరంచేస్తూవుంటే మాకెంత ఆనందంగా వుంటుంది. నీభర్త నిన్నెంతలా ప్రేమిస్తున్నాడు. నీకోసం, నీ సౌఖ్యంకోసం యేం చెయ్యమన్నా చెయ్యగలడు. అతణ్ణి వొదిలివెళ్ళడానికి నీ మనస్సెలా వొప్పుకుంటూంది? అతనికెంత కష్టంగావుంటుంది?

సుం :—నన్నింత హృదయంలేనిదానిగా మీరు భావిస్తే నేను సహించలేను. అతనికికలిగే మనఃకష్టానికంతకూ నేనే కారకురాలినని తలుసుకున్నప్పుడల్లా నాకెంత విచారంగావుంటుందో చెప్పలేను. కాని, యేం చెయ్యను. వొకారిని ప్రేమించడం కాని ప్రేమించకపోవడం కాని నా శక్తిలోవుంటే యెంత బాగుండును? కాని లేదు—అది నా శక్తిలోలేదు. నేనెంత ప్రయత్నించినా నారాయణమూర్తి నుంచి నా మనసుని మళ్ళించుకోలేకపోతున్నాను. ఒక్కక్షణం అతను నాచెంత లేకపోతే నాకుకలిగే ఆ వోర్చుకోలేని దుఃఖం, ఆ ప్రాణాలుచీల్చే బాధా మీకుతెలీదు. నాకెంత బాధకలిగినా అతని ఆనందానికిమాత్రం భంగం కలగనివ్వకూడదన్న సద్బుద్ధి యింతవరకూ నాలో పుట్టలేదు. యేం కర్మమోగాని—పోనీ, వొకవేళ నారాయణమూర్తిపైని నాప్రేమనీ, మోహాన్నీ చంపుకుని ప్రేమరహితమైన మొండుమై యితనిలోవుంటేమాత్రం యితనికేం సౌఖ్యం యివ్వగలను?

గో :—అతను నిన్నింత ప్రేమిస్తున్నందుకేనా అతనిపైని ప్రేమకనబర్చడం నీకు పరమకర్తవ్యం. అంతకన్న నేనేం చెప్పలేను.

సుం (నెమ్మదిగా):—నాలోలేనిదీ నేనెలా చూపగలను? అది నా స్వాధీనంలోలేదని మీా కెన్నోసార్లు చెప్పాను.

రా :—అయితే అంతే...

సుం :—ఏంచెయ్యనూ?

రా :—అయ్యో! అయ్యో! ఏమిటీ మూర్ఖత? కొంచెం కళ్లువిప్పిచూడూ! లోకులూ, బంధువులూ నీ గురించి యెలా చెప్పుకుంటున్నారో!

సుం (గర్వంతో తీవ్రంగా):—లోకులు! లోకుల అభిప్రాయంకోసం కనిపెట్టుకు కూచోలేను—బంధువులు! నా అంతరాత్మనివంచించి బంధువుల్నందర్నీ మెప్పించేశక్తి నాలోలేదు. ఇతర్లేమనుకుంటారో అని నా స్వభావానికి వ్యతిరేకంగా నటించడం నాకు చాతకాదు—

రా :—ఛీ—ఛండాలురాలా! కృతఘ్నురాలా!... నా కడుపున చెడపుట్టేవు—

శ్రీనివాసరావు (నెమ్మదిగా):—ఎందుకంత కోపం దానిమీాదా?

రా (తీవ్రంగా):—కోపమెందుకూ? కడుపు నిండిపోతూంది మీాపిల్లను చూస్తే...సిగ్గులేకపోయింది—యింకా వెనకేసుకురావడానికి—

సుం :—అమ్మా! దేముడు నన్నిలాచేశాడు. నేను దుర్మార్గురాలిననీ, కృతఘ్నురాలిననీ నీ యిష్టంవచ్చినట్టూ తిట్టు, నిందించు లోపల వొకవిధంగావుండి పైకోవిధంగా నటించేపాటి తెలివితేటలు నాలోలేవు. నన్నీవిధంగా నలుదెశలనుంచీ బంధించడం నేను సహించలేను (ఏడుస్తుంది).

శ్రీ (నెమ్మదిగా):—అమ్మాయి! నీకు వాళ్ళతో మాటాడవలసిన అవసరం యేమీాలేదు. ఇలారా తల్లీ!

(సుందరివచ్చి తండ్రిచెంత తలవాల్చుకుని కూచుంటుంది. తిరిగి వెళ్లిపోడానికి వుద్యుక్తుడవుతున్న నారాయణమూర్తిని శ్రీనివాసరావు ఆదరంతో 'నారాయణమూర్తీ రావోయి వెళ్లిపోదువుగాని' అని పిలుస్తాడు. నారాయణమూర్తి నెమ్మదిగా రాగా శ్రీనివాసరావు ఆదరంతో అతణ్ణి

తనపక్కనే కూచోబెడతాడు. ఒకటి రెండు నిముషాలు యెవరూ మాటాడరు. శ్రీనివాసరావు కనుబొమ్మలేవో ఆలోచనచేస్తున్నట్టు వంపుతిరిగివుంటాయి.)

శ్రీ (ధర్మారావు నుద్దేశించి):—బాబూ! నీకు కష్టంగా లేకపోతే వొకటిరెండు విషయాలు మాటాడ దలుచుకుంటున్నాను.

ధ :—నాకేం కష్టం? మీ వ్యావహారిక విచక్షణయందూ, నిష్పాక్షిక బుద్ధియందూ, నిమర్శనాదృష్టియందూ నాకు సంపూర్ణ విశ్వాస ముంది.

(శ్రీనివాసరావు వొకటిరెండు నిముషాలు మౌనం వహిస్తాడు.)

శ్రీ (సుందరి నుద్దేశించి):—అమ్మాయి! నువ్వు నారాయణమూర్తిని విడిచివుండలేవు?

గో (చిరాకుతో):—ఏమిటా ప్రశ్న? మతిపోయిన ప్రశ్న. ఆలోచనా పాలోచనాలేకుండా. విడిచివుండలేను! వుండలేకపోతేమట్టుకు వాడికిచ్చి పెళ్ళిచేస్తావేమిటి? ఈసంగతి నాకేం అర్థంకాకుండా వుంది. ఏమిటా తొందర?

శ్రీ (మృదుస్వరంతో):—బావా! నేనేం తొందర పడలేదు. బాగా ఆలోచించే మాటాడుతున్నాను. వివాహానికన్నిటికన్నా వధూవరుల ప్రేమే ప్రధానమైందని నా అంతరాత్మ బోధిస్తూంది. వారిద్దర్లో యెవరికి ప్రేమ లేకపోయినా సంఘానికి వెరచి వారిని కలిపివుండమని నిర్బంధించడం కేవలం అన్యాయం. సుందరీ, నారాయణమూర్తీ యిద్దరూ వొకర్నివొకరు విడవలేకుండా యెవరిమట్టుకువారు తమ్ముతామే మరిచి రెండోవారుగా మారి యింత గాఢానురాగనిమగ్నులై వున్నప్పుడు అది సహజమనీ, న్యాయమనీ మనకి తోచి నప్పుడుకూడా మన పిరికితనం, సందేహం కారణంగా వాళ్ళి అడ్డుపెట్టడం యెంతమాత్రం ధర్మంకాదు.

గో :—అయితే వారిద్దరికీవున్న యీసంబంధం మీకుకూడా యిష్టమే అన్నమాట?

శ్రీ :—ఇష్టమో అయిష్టమో నే చెప్పలేను. కాని తల్లితండ్రులమైనంతమాత్రాన వారి స్వేచ్ఛనీ స్వాతంత్ర్యాన్ని శాశ్వతంగా అరికట్టడానికి మనకేం అధికారం లేదు.

రా :—బాగుంది...

శ్రీ (అటుచూడకుండా):—అమ్మాయి! అయితే నారాయణమూర్తిని వివాహంచేసుకోడం నీ కిష్టమేనా?

సుం :—ఈ విషయంలో మీ మనస్సుకికూడా యెక్కడ బాధకలిగిస్తానో అని భయపడుతున్నాను.

శ్రీ :—ఏమమ్మా! ఎందుచేత? నాకేం కష్టంగా వుండదు. చెప్పతల్లీ నీమనసులో వున్నదేమిటో.

సుం (తలవంచుకుని):—నాకెవర్నీ వివాహంచేసుకోవాలని లేదు.

నా (విస్మయంతో):—ఏం? నామీద నీకిష్టం లేదూ?—ప్రేమలేదూ?

సుం :—ఇష్టంలేదూ? ప్రేమలేదూ? అబ్బాయి! ఏమిటా అడగడం? నీకన్న ప్రేమించతగలవారు నాకీ లోకంలో ఎవరున్నారూ? నా హృదయంలోని ప్రతీనాడీ నీకోసమే కొట్టుకుంటున్నసంగతి నీకు తెలీదూ? ఆహారం, నిద్రా, గాలీ లేకపోయినా కొంతకాలం జీవించగలనేమో. కాని నువ్వులేందే వొక్కనిముషం కూడా జీవించలేను. రాత్రీ, పొగలూ, నిద్రలోనూ, కలలోనూకూడా నువ్వే నా. తలపులో వుంటావు. ఎప్పుడూ నీముఖంచూస్తూ నీ పక్కనేవుండి పోవాలనుంటుంది.

నా (ఆనందంతో):—నిజం! నన్ను సంతోషపెట్టడానికంటున్నట్టుంది.

సుం :—అబ్బాయి! నామాటల్లో నీకామాత్రం విశ్వాసంలేదూ? నా ప్రేమనంతట్నీ మాటల్లోకి తర్జుమాచేసి నీకు తెలియజేయగలిగితే, నీకు నమ్మకం పుట్టించగలిగితే యెంతబాగుండును? కాని ఆ శక్తి నాకులేదు. నాకే నీమీద అంతప్రేమలేకపోతే, అంత కాంక్ష లేకపోతే యింతప్రయత్నంచేసి నీదెగ్గిరికి వస్తానా? ఇంత త్యాగంచేసి, యింత నిందకోర్చి నిన్ను నావాణ్ణి చేసుకుందికిలా ప్రయత్నిస్తానా? నీమీద నాకెంత వెర్రి మోహమో నీకు తెలీదు—

నా :—అయితే నన్ను వివాహం చేసుకుంది కెందు కిష్టపడవు?

సుం :—ఎందుకా?—ఎప్పుడో పసితనంలో నాకు సరిగా జ్ఞానంలేనప్పుడు నా యిష్టంలేకుండా చేసిన సంబంధం పోదులుకుంటేనే యింతఅల్లర జరిగింది. అలాంటిది—నేను సహజంగా యేరుకున్నభర్తతో యెప్పుడేనా విడిపోవలసివస్తే సంఘం నన్ను బతక నిస్తుందా?

నా :—ఇంతసహజమైన, గాఢమైన మన ప్రేమకి కూడా యెందుకు విఘాతంవస్తుంది?

సుం :—ఏమో! ఎందుకేనా రావచ్చు. అట్టే వెర్రి తీపి తింటే వెగటులో వినట్టు-

నా :—అంటే నే నెప్పుడేనా నీకు విసుగు పుట్టిస్తానేమోనని!

సుం :—నువ్వు నాకు విసుగుపుట్టించకపోవచ్చును. నేనేనీకు విసుగు పుట్టించవచ్చు. ఇప్పుడంటే నువ్వు నన్నింత ప్రేమతో చూస్తున్నావు. ఒకవేళ నీప్రేమ దృష్టి యెప్పుడైనా యింకొకరిపైపు ప్రసరిస్తే? అప్పుడు నాకు చాలాకష్టంగాయుంటుంది. లేదా నామనస్సే నా స్వాధీనంతప్పి యింకెవరిచేతనైనా ఆకర్షింపబడ వచ్చును. ఇప్పటికి నాప్రాణంకంటె అధికంగా నిన్ను ప్రేమిస్తున్న సంగతి నీకు తెలుసు. ఈప్రపంచంలో నువ్వు నాపక్కనుంటే పరపురుషుని నీడకూడా చూడకపోయినా నాకు చింతలేదు. కాని మన యీ ప్రేమ ఎప్పుడూ యిలాగే స్థిరంగాయుంటుందని యేమీనమ్మకంలేదు.

నా :—నీ కటువంటి అనుమానం కలగడానికి కారణం యేమీలేదు-

సుం :—ఎందుకు లేదూ? ఎంతమంది ప్రాణ స్నేహితులు పరమ శత్రువులుగా మారిపోలేదు. లక్షల కొలదీ, కోట్లకొలదీ ప్రజలచాత ఉత్తమోత్తములుగా గణింపబడిన యెంతమంది నాయకులు స్వల్పకాలం లోనే పరమనీచులుగా భావింపబడి తిరిగి ప్రజల అవి శ్వాసానికి పాత్రులుకాలేదు? ఎంతమంది భార్యాభర్తలు మొదట యెంతో అనురాగంతో యుండి తరువాత పోట్లాడ్కొని అసహ్యించుకుని దొమ్ములాటల్లోకి దిగలేదు? ఇవన్నీ కళ్ళారా చూస్తూ ప్రేమ స్థిరంగా యుంటుందని యెలాగా నమ్మడం? ప్రేమ రహితమైన, రసవిహీనమైన జీవితం వొక్కనిముషం నేను గడపలేను. ప్రేమ పోగానే విడుదలయ్యే స్వేచ్ఛ యుంటేనే గాని నేను వివాహంచేసుకోను.

శ్రీ :—అమ్మాయి! అయితే దానికోసం వివాహం మానుకోడమెందుకూ? ఎంతవరకూ అన్యోన్యం ప్రేమ వుంటే అంతవరకే కలిసివుండండి! ఎప్పుడిద్దర్లో యే కారణంచాత యెవరికిష్టంలేకపోయినా విడిపోవచ్చును. ఇష్టంలేనప్పుడు కలిసివుండి మాత్రం యేంప్రయోజనం?

గో (హఠాత్తుగా దెబ్బతిన్నట్టు) :—బావా!...

శ్రీ (నెమ్మదిగా) :—బావా? నువ్వింత ఖంగారు పడవలసిన అవసరం యిందులో యేమీలేదు. ఒకస్త్రీ, వొకపురుషుడూ అన్యోన్యం ప్రేమించుకుని పరస్పరాభివృద్ధికిగాని, సంఘాభివృద్ధికిగాని భంగం కలుగనట్లుగా దాంపత్య సౌఖ్యం అనుభవించడమే వివాహంయొక్క ముఖ్యోద్దేశం, ప్రేమలేందే దాంపత్యసౌఖ్యంలేదు. అందుచాత యిష్టంలేని యిద్దరు స్త్రీపురుషులను వివాహమాడమని నిర్బంధించడం యెంతపొరపాటో, పెళ్ళి చేసుకున్నా దంపతులలో యెవరికేనా యిష్టంలేక విడిపోవాలని కోరుకున్నప్పుడు వారిని కలిసియుండమని నిర్బంధించడంకూడా అంత పొరపాటే. ఈ రెండింటిలోనూ కూడా వివాహోద్దేశం సరిగా ఫలించలేదనే చెప్పవచ్చును.

గో :—అయితే యిష్టపడితే అప్పుడు విడిపోయే దానికి యెవరితోపడితే వారితో పోయేదానికి వివాహం కూడా యెందుకూ? వివాహమనేదే తీసేస్తే నయం.

శ్రీ :—వివాహమనేది లేకపోవడం చాలా ప్రమాదం.

గో :—ఎందుచాతా?

శ్రీ :—వివాహమంటే మరేంలేదు. ఒకస్త్రీ వొక పురుషుడూ యిష్టపడి దాంపత్యసౌఖ్య మనుభవించ డానికి నిశ్చయించుకున్నప్పుడు వారికున్న ఆసంబంధం సంఘంయొక్క వొప్పుకోడమే.

గో :—సంఘానికి వారిపైనేమీ అధికారంలేనప్పుడు సంఘంయెదుట వొప్పుకోవలసిన అవసరం వారికేముంది?

శ్రీ :—స్త్రీపురుషుల ఆంతరంగిక సంబంధంపైని సంఘాని కేమీ అధికారం లేకపోయినా ఆసంబంధానికి ఫలరూపమైన సంతానంమాత్రం సంఘానికి చెందింది కావడంచాత ఆసంతానంయొక్క తల్లిదండ్రులను తెలుసుకుని, ఆబిడ్డలను రక్షించడం, పోషించడం మొదలైన తల్లిదండ్రుల బాధ్యతలను నిర్ణయించి, ఆతల్లిదండ్రులపైని తత్సంతానానికి గల హక్కులను సంరక్షిస్తుంది సంఘం.

గో :—సంఘం వారి హక్కుల నెంత రక్షించినా తల్లిదండ్రులలో యెవరులేకపోయినా ఆశిశువులకు కలిగే లోపాన్ని సంఘం యెంతమాత్రం సవరింపజాలదని నువ్వింకా తెలుసుకోవలసుంది.

శ్రీ :—నువ్వన్నమాట నిజమే; పిల్లలకి తల్లీ, తండ్రీ యిద్దరూ సమానమైన అవసరమే అవడంచాత యిద్దర్లో యెవరులేకపోయినా ఆ పిల్లలకు కొంతలోపమేనని వొప్పుకోక తప్పదు. కాని, సాధారణంగా స్త్రీ పురుషులు మొట్టమొదట యెంత స్వార్థపరులైనా బిడ్డ పుట్టేక వాళ్ళలో నిజమైన సైంకాన్నత్యం సహజంగా కలుగుతుంది. బిడ్డ యిద్దరికీ ప్రాణసమానమైన వస్తువే. కాబట్టి వానికోసం భార్యాభర్త లిరువురూ వారిసౌఖ్యం చాలావరకు వొదులుకుంటారు. అప్పుడు కూడా దంపతులలో యేకారణంచాతనైనా యిష్టం లేక యెవరేనా విడిపోదలుచుకుంటే అడ్డు పెట్టడానికి సంఘాని కేమీ హక్కులేదు. అది కేవలం ఆదంపతుల అంతరాత్మలపైనీ, ధర్మంపైనీ ఆధారపడి వుంటుంది. కాని అల్లా విడిపోదలుచుకున్న దంపతులలో వొకరి వల్ల వొకరికి యెటువంటి అన్యాయం జరగకుండా మాత్రం సంఘం చూస్తుంది, అలాగునే పిల్లలగురించి ఆదంపతులకున్న బాధ్యతను వొదులుకుందికికూడా సంఘం వొప్పుకోదు.

గో :—అయితే సుందరీ నారాయణమూర్తీ వివాహంచేసుకోడం నీకు సమ్మతమే!

శ్రీ :—దానికీ నాసమ్మతితో యేమీసంబంధంలేదు.

గో :—వారి వివాహానికి నీఅంగీకారం వుంటుందా?

శ్రీ :—వారిద్దరూ యిష్టపడి వివాహం చేసుకుందికి సిద్ధపడ్డప్పుడు ఆ పని అన్యాయంకానప్పుడు అంగీకరించడమే మంచిదని నా అంతరాత్మ బోధిస్తూంది. ఇటువంటి స్థితిలో వాళ్ళి ఆశీర్వదించేవారు నాకంటె యెవరున్నారు?— ఈవిషయంలో ధర్మారావుగారికి కష్టం గాయుంటుందేమోనని విచారిస్తున్నాను.

ధ :—లేదు—నాకు మీరనుకున్నంత కష్టంగా లేదు. మీకుటుంబంతో నాకున్న సహవాసంమూలాన మానవ ప్రకృతిలోని సత్యాన్ని గ్రహించకలిగినందుకు వొకవిధంగా నాకు సంతోషంగాకూడా వుంది.

శ్రీ :—అయితే నాకు మరేమీ చింతలేదు.

నా (చిరునవ్వుతో సుందరినుద్దేశించి) :—యేం? ఇప్పుడిష్టపడిందా అమ్మాయికి—

[సుందరిచెక్కిళ్లు చప్పున యెర్రబారుతాయి. సిగ్గుతో తలవంచుకుని సగంమూసిన కళ్ళతో అతని ముఖంవంక చూస్తూ వుంటుంది.]

నా (ఆమెకళ్ళలోకి చూస్తూ) :—ఆనందంగా వుందా?

సుం (చిరునవ్వుతో కొంచెంగా కళ్ళెత్తి చూస్తూ) :—ఆనందం కాకేం?

[శ్రీనివాసరావు నిలుచుని వారిద్దరి బుజాలపైనీ చేతులువేసి ముద్దుగా నిమురుతూ దరికి తీసుకుంటాడు. ఇరువురూ అతని పాదాలకు వంగి నమస్కరిస్తారు. అతడు నెమ్మదిగా వారిద్దర్నీ లేవనెత్తుతూవుంటాడు. మాధవీలత పైనుంచి రెండుపువ్వులు వారి శిరసులపైని రాలుస్తుంది.]

(తెరవాలుతుంది.)

—ఆకుండి సత్యనారాయణ.

# చిన్న చిన్న వ్యాసాలు

[మాసపత్రికలు విస్తరించుటలో వ్యాస పరిమాణవిషయమున నిక్కచ్చి ఎక్కువైనదనియు, సంపాదకులు నాతి విస్తరవ్యాసములనే విశేషముగ కోరుటలో విషయగౌరవము తగ్గుటకు అవకాశమేర్పడుచున్నదనియు ఈ వ్యాసకర్త తన అభిప్రాయమును ఇందు వెల్లడించుచున్నాడు. ఇందలి సత్యమునుగూర్చి సమాలోచింపవలసిన బాధ్యత సంపాదకులమీదను, వ్యాస రచయితలమీదను సమముగ నిలచియున్నది. శ్రీ కామేశ్వరరావుగారు ఇందు వెల్లడించిన విషయము లనేకములు సత్యములని అంగీకరింపక తీరదు. సారస్వత జిజ్ఞాసకుల ఇష్టాగోష్ఠుల యందు ఇట్టి విషయములు పెక్కులు చర్చింపబడుచుండును. కాని ఈ విషయముల నింతవఱకు ఎవరును వ్యాస రూపమున క్రోడీకరింపలేదు. కావున కామేశ్వరరావుగారి ఈ వ్యాసము పఠనీయమేగాక చర్చనీయముకూడనై యున్నది.

—సంపాదకుడు.]

తెలుగుదేశంలో మళ్లా యిప్పుడు అనేక పత్రికలు బయలుదేరాయి. మన తెలుగు దేశంలో ఎనభై యేళ్ళనుంచీ పత్రికోద్యమం కనబడుతూంది. ఇప్పటికి కొన్నివందల పత్రికలు వెలువడ్డాయి. కాని వెనక ప్రకటించబడ్డ వాటిలో కొన్నికొన్ని పత్రికలపేర్లేనా యిప్పుడు మనకి మిగలలేదు. పత్రిక లేమిటో శాశ్వతమని గ్రంథకర్తలు పత్రికలకు రాస్తూ వుంటారు. కాని అవి మనుష్యులకంటే అశాశ్వతంగా కనబడుతున్నాయి. కష్టపడి ఒక పుస్తకం అచ్చువేయించుకుంటే అది చిరకాలం నిలిచేటట్లావుంది. ప్రజలు పుస్తకాలను జాగ్రత్త పెట్టినట్లు పత్రికలను జాగ్రత్త పెట్టకుండా వున్నారు. వార్తాపత్రికలలాంటివే వాఙ్మయపత్రికలూ అని ఒకమాటు అటూ యిటూ తిరగేసి పారేస్తున్నారు. ఇంక గ్రంథాలయాల సంగతి వేరే చెప్పక్కర్లేదు. వాటిలో అసంపూర్తి సంపుటాలే గాని సంపూర్తి సంపుటాలు సాధారణంగా కనపడవు. ఈమోస్తరుగా మన వాఙ్మయమెంతో నష్టపోతున్నాం.

ఇటీవల బయలుదేరిన చిన్నచిన్న పత్రికలు, మాకు చిన్నచిన్న వ్యాసాలే కావాలంటున్నాయి, నాలుగు పావుఠావులకంటే హెచ్చురాయకండనీ, అరింటికంటే హెచ్చు వద్దనీ, పదింటికంటే వద్దనీ అంటున్నాయి. ఈమోస్తరుగా వ్యాసాలసైజులు నిర్ణయం చేసి ఆర్డర్లు యిస్తున్నాయి. ఈ ఆర్డర్లు యియ్యడం నేడు ప్రచారంలోఉన్న మాసపత్రికలతో ప్రారంభించిందనుకొంటాను. ఆంధ్రపత్రికా, సమదర్శినీ కూడా వ్యాసాలూ, వార్తలూ క్లుప్తంగా వుంటే వేగిరం ప్రకటించడానికవకాశ మిస్తాయని అన్నాయి కాని క్లుప్తంగారాస్తేగాని వెయ్యమనిగాని, నాలుగుపేజీలకంటే యెక్కువ రాయవద్దని కాని అనలేదు. వెనకటి వాఙ్మయ పత్రికలయినా ఈమోస్తరుగా సైజు నిర్ణయించేసి వ్యాసాలు కోరినట్టు కనపడదు. హాస్య పత్రికలకు ఈసైజు నిర్ణయంవల్ల కొంత లాభముంటే వుండవచ్చుగాని - హాస్య వ్యాసాలు అతి దీర్ఘాలైతే విసుగు కలగజేస్తాయి కాబట్టి. ఏదయినా యిప్పుడున్నంత చిన్న వ్యాసాలుగా వుంటే లాభంలేదు—తక్కిన వాఙ్మయ పత్రికలకి మాత్రం దీనివల్ల నష్టమేకాని లాభంలేదు.

చిట్టిచిట్టి వ్యాసాలవల్ల చాలా ప్రమాద

ముంది. జానెడువ్యాసంలో గ్రంథకర్త యే మాత్రం పనితనం చూపించగలడు? తన యొక్క లోకపరిశీలనగాని, కల్పనాశక్తిగాని చూపించాలంటే వ్యాసం జానెడుముక్క అవదు. అదేవిధంగా భాషాపరిశోధనగాని, విమర్శశక్తిగాని చూపించాలంటే బెత్తెడు వ్యాసంకాదు, ఒకవేళ టూకీగా పొడి మాటలలో పుస్తకాల విషయసూచికలాగ చెప్తే అవుతుందేమో కాని వ్యాసంలాగ రాయబోతే మట్టుకు అవదు. ఇక్కడ ఎవరేనా ఒక ప్రశ్న వెయ్యవచ్చు. భావ ఖండ కావ్యాలు వుంటున్నాయికదా. అవి చిన్నవేకాని పెద్దవికావుకదా. అదేమోస్తరుగా వ్యాసాలు చిన్నవేరాయండి అని. కాని భావ ఖండ కావ్యాలసంగతే వేరు. పద్య వాఙ్మయమూర్తులన్నిటిలోకీ భావఖండ కావ్యాలే చిన్నవి. అవి అంతకంటే పెద్దవిగా వుండడానికి వీలులేదు. ఎంచేతంటే ఉద్రేకంమీద ఒక భావాన్ని తెలిపే ఖండ కావ్యాలవి. పెద్దవిగావుంటే వాటిలో ఒకే భావంకాని ఉద్రేకంగాని వుండదు. అంచేత భావ ఖండకావ్యాల సంగతే వేరు. ఇంక మరొకసంగతి. నవలలు, నాటకాలు మొదలైనవి పెద్దపెద్దవిగా వుండనే వున్నాయి. కాబట్టి ఈ వ్యాసాలు చాలా చిన్నవిగా వుంటే మంచిదిఅని.ఈప్రశ్నకు జవాబు పైనే కొంతవరకూ చెప్పాను. గ్రంథకర్త తనలోకపరిశీలనగాని కల్పనా శక్తిగాని చూపించాలంటే అవి జానెడు ముక్కలుకావు అని. ఒక పెద్ద వ్యాసాన్నివిరిచి జానెడేసిముక్కలు చేసుగోవచ్చు - ఇప్పుడు ఈమోస్తరుగానే జరుగుతున్నాయి పత్రికల్లో. కాని ఈ ముక్కలు మనస్సుకుమాత్రం తృప్తి యియ్యవు, దేనికది కొంత సంతోషమిస్తే యియ్యవచ్చునుగాని. పరమాన్నమయినా ఒక చెంచాడే గొంతుకలో పోసుకుంటే తృప్తి కలుగుతుందా? దానిరుచివల్ల కొంత ఆనందంకలిగితే కలుగుతుందికాని తృప్తి మాత్రం కలగదు. ఆనందంతోపాటు తృప్తి కూడా కలగాలంటే మరింత పరమాన్నం తాగాలి. అదేవిధంగా యీచిన్నవ్యాసాలు మనస్సుకు కొంత ఆనందమిస్తే యిస్తాయి కాని తృప్తినిమాత్రం యియ్యవు. తృప్తి నియ్యాలంటే యివి పెద్దవిగా వుండితీరాలి. ఈ సందర్భంలో చిత్రకళనుంచి ఒక పోలిక చెప్తాను. రామారాయ చిత్రకళామందిరంలో అనేక చిత్రపటాలున్నాయి. చిన్నవీ వున్నాయి, పెద్దవీవున్నాయి చిన్న చిత్రపటాలు అంటే ఒకమనిషిగాని ఒక చెట్టుగాని ఏదోఒకటి రెండు అంశాలుమాత్రమే కలవి చాలావున్నాయి ఈ చిన్న చిత్రపటాలు చక్కగానే వుంటాయి. ఆనందమిస్తాయి. కాని పెద్ద చిత్రపటాలు అనేక అంశాలుగలవి యిచ్చిన తృప్తిని యియ్యలేవు. పెద్ద చిత్రపటాలు ఒక్కటొక్కటి ఒక్కొక్క ప్రపంచమంత ఆనందమిస్తాయి. ఆనందంతోపాటు తృప్తికూడా కలగాలంటే గుణంతోపాటు రాశికూడా వుండాలి అన్నమాట. ఈసామ్యం వాఙ్మయానికీ చిత్రకళకీ కూడా చెల్లుతుంది.

పత్రికా సంపాదకులు చిన్నచిన్న వ్యాసాలు కోరడంలో ఒక ఉద్దేశముంది. అదేదంటే—సంపాదకులు తాము ఒక్కరూపాయికే చందారులికి అనేక వ్యాసాలుగల సంచిక నెలనెలకీ అందజేస్తున్నామని. ఈ ఉద్దేశం బాగానేవుంది. ప్రజల నాకర్షించి వారు జ్ఞానాభివృద్ధి చెయ్యవలసిందే. కాని వారు అవలంబించే మార్గం మాత్రం

యేమీ బాగు లేదు. ఎంచేతంటే పీరు ఎవ్వడయితే చిన్నచిన్న వ్యాసాలు కోరేరో అప్పుడే వ్యాసాలలో గుణం తగ్గిపోయింది. చందాదారులకంటికి వ్యాసాలరాశి కనబడుతుంది గాని గుణం కనపడదు. గుణం లేని రాశి నిష్ప్రయోజనం. సంపాదకులు చిన్నచిన్న వ్యాసాలు రాయుమని కోరవద్దు. పెద్ద వ్యాసాలు వెయ్యడంవల్ల సంపాదకులకు ఆర్థికంగా యేమేనా నష్టంకలుగుతుందేమో అంటే అలాంటిదేమీ లేదు. పది చిన్న వ్యాసాలు వేసేబదులు మూడు పెద్దవ్యాసాలు వేస్తారు. ఎప్పుడైనా సంచిక పుటల సంఖ్య ఒక్కటే.

పెద్దవ్యాసాలు వెయ్యడానికి సంపాదకులు మరొక ఆక్షేపణ చెప్తున్నారు. పెద్ద వ్యాసాలయితే 'తరవాయిలు'గా వెయ్యవలసివస్తుంది, చిన్న వ్యాసాలయితే ఆ చిక్కేమీ వుండదు అని. ఇది బహు బలహీనమైనకారణం కాబట్టి దీనినిగురించి విశేషంగా చెప్పను. వాఙ్మయానికి కావలసింది గుణంకాని తుక్కు కాదు. సంపాదకులు తమ సౌకర్యంచూసుకొని తుక్కు ప్రకటిస్తామంటే యెలాగ? ఇంతకీ యీ 'తరవాయిల' కష్టం సులభంగానే దాటవచ్చు. కథలకీ చిన్న నాటకాలకీ, సాహిత్య చిత్రాలకీ 'స్కెచ్‌స్' 'తరవాయిలు' పనికిరావు గాని, విమర్శ వ్యాసములకీ, భాషా వ్యాసములకీ పనికి వస్తాయి. కాబట్టి విమర్శ వ్యాసములనీ భాషా వ్యాసములనీ 'తరవాయిలు'గా వేసి పైవాటినిమాత్రం ఒక్కమాటే వేస్తూ వుండవచ్చు.

పెద్దవ్యాసములు ప్రకటించడానికి పెద్ద పత్రికలున్నాయి అంచేత చిన్న పత్రికలలో చిన్నవ్యాసములు వేస్తామని సంపాదకులు అనవచ్చు. పెద్దపత్రికలకీ చిన్న పత్రికలకీ రాశిభేదమే గాని గుణభేదముండకూడదు. చిన్న వ్యాసములలో గుణం అట్టే వుండదని చెప్పాను. పెద్దపత్రికలు పది పెద్దవ్యాసములు వెయ్యగలిస్తే చిన్నపత్రికలు మూడు చిన్నవ్యాసములు వేస్తాయి. పెద్దపత్రికలకీ చిన్నపత్రికలకీ ఇంతే భేదముండాలి కాని గుణభేద ముండకూడదు.

కనక పత్రికా సంపాదకులను ఈ మోస్తరుగా కోరుతున్నాను. మీరు వ్యాసకర్తల దగ్గిరనుంచి పూర్తిగా ప్రతిభవుండే వ్యాసములు కోరండిగాని చిన్నచిన్న వ్యాసములు కోరవద్దు. వాఙ్మయానికి కావలసింది గుణం మాత్రమే. ఆ గుణం చిన్నచిన్న వ్యాసములలో కనపడదు. అంచేత చిన్నచిన్న వ్యాసములు కోరవద్దు. ఇంక చందాదారుల సంగతి—చందాదారులు తాము చెల్లించే రూపాయికి సంచినరుకు వచ్చేటట్లా చూసుకోవాలి. చిన్న వ్యాసములు సంఖ్యకు చాలా వుంటాయిగాని గుణవంతంగా వుండవు. అంచేత చక్కనైన పెద్దవ్యాసములు పత్రికలలో వేసేటట్లా పత్రికాసంపాదకులను కోరాలి గాని పుటకొక వ్యాసము వెయ్యమని కోరగూడదు. పైవాళ్ళ సంగతి యెలాగ వున్నా ఈ చిన్నవ్యాసములవల్ల ముఖ్యంగా చెడిపోయేవాళ్లు రచయితలు. ప్రతిభ లేని రాతలు పీరు కాలహరణంకోసం రాసుకోడమవుతుంది. ప్రతిభ అంతా చూపించి వ్యాసం రాయబోతే అది పెద్దదవుతుంది కాని చిన్నదికాదు. చిన్నవి రాయాలని వ్యాస సంగ్రహాలు కాని, వ్యాసలేశాలు కాని, వ్యాసపు తునకలుగాని రాయవద్దు. తమయొక్క కాలం పాఠకులయొక్క కాలం కూడా వృథాచెయ్యవద్దు.

ఈ సందర్భంలో మరొక సంగతికూడా చెప్తాను. 'మా పత్రికలో ఖండకావ్యాలు ప్రకటించం అంచేత మాకు ఖండకావ్యాలు పంపకండి' అని అనేక పత్రికాసంపాదకు లంటున్నారు. ఈ రకమైన పద్యవాఙ్మయ నిషేధం చాలా విచిత్రంగావుంది. పద్య కవి తనుమెచ్చలేని కొందరుపండితులు పద్య వాఙ్మయ నిషేధానికి పూనుకున్నా. ఖండ కావ్యాలు రచిస్తూఉన్న యువకులుకొందరు తాము ప్రచురించే పత్రికలలో ఈ మోస్త రుగా అనడం చాలా విచిత్రంగావుంది. ఏ దేశంలోనైనా కవికే మొదటితాంబూలం. కవితర్వాతే తక్కిన గ్రంథకర్తలికి సన్మానం. పద్యంతర్వాతే గద్యం. గద్యకవిని సృష్టించ వచ్చుగాని పద్యకవిని సృష్టించలేము. అం చేత పద్యకవికి గౌరవంహెచ్చు అలాంటి సందర్భంలో మా పత్రికలో ఖండకావ్యాలు ప్రకటించం అనిఅనడం చాలా తప్పు. కవుల దగ్గిరనుంచి వచ్చిన ఖండకావ్యాల్లో సంపా దకులకు ఏ ఖండకావ్యాలయితే బాగా వున్నాయని తోస్తుందో అవే వారి పత్రిక లలో ప్రకటించవచ్చు. అంతేగాని మాకు పద్యాలు పంపకండి అని వాఙ్మయమూర్తు లన్నిటిలోకీ వుత్తమమైన పద్య వాఙ్మయాన్ని అనాదరించవద్దు.

ఈ మోస్తరుగా వ్యాసములనుగురించీ ఖండకావ్యాలనుగురించీ నాకు మంచి అని తోచిన రెండుమాటలూ చెప్పాను. ఈ మాటలలో గుణమేదైనావుంటే సంపాద కులు గ్రహించి దానిని ఆచరిస్తారుగాక! ఇక్కడ ఒక చిన్నసంగతి. వ్యాసకర్తలిని పెద్దపెద్ద వ్యాసములు రాయమని నువ్వు మాత్రం చిన్నవ్యాసమెందుకు రాసేవని యెవరేనా ఆక్షేపిస్తారేమో! ఇది కథకాదు, నాటకంకాదు, సాహిత్య చిత్రంకాదు ఉన్న శక్తి అంతా చూపించిరాస్తే పెద్దదవడానికి ఇది పరిశోధనవ్యాసంకూడా కాదు, పెద్ద గ్రంథవిమర్శకాదు. సంపాదకులు తాము పత్రికల్లో ప్రకటించే రెండుముక్కలికీ యిది జవాబు. ఆరెండుముక్కలనూబట్టి చూస్తే యిది పెద్ద వ్యాసమే.

—ఉకుమళ్ళ కామేశ్వరరావు, బి.ఏ.బి ఇ.డి.

---

# ఆ రా ధ న ము

నీపదాంభోజమ్ము
లేపదాలద్రవించె
నవియే సెలలుగట్టె నమ్మా! మనస్సులో.
ఈ శ్రావణీకంఠ
మేమో కలిపిపాడు
నా నిరాశాజీవితాని కానో తోడు.
నాముక్తి సాయుజ్య
నాకాశ్రమమ్ములో
ఏతుపానులా నుబ్లుగాతిరిగి ముంచుకొనె.
ఇదుగో ప్రేమజ్యోతి!
ఇందె నా జీవనపు
రక్తమ్ముబోసి నీరాజనమ్మెత్తితిని.
ఇదె నీ మధురలోక
లోకాంత ములదాక
ప్రాకులాడును భక్తి భావాలువెలిగించు.
ఓ మాతృదేవి! నీ
యారాధనము లోనె
ఈ జీవిత మ్మంతరింపగావలె నమ్మ!

—ఊటుకూరు సత్యనారాయణరావు.

# వరకట్నం

౧

సీతి పంపుదగ్గిర చేతులు కడుక్కుంటున్నది. రెడ్డిగారితోటలో పనిచేసే మాలవెంకడి కూతురు. దమయంతి కోసం దేవతలకు కూడా నోరూరినట్లు, అగ్రవర్ణాలనబడే వారినికూడా ఆకర్షింపగల సౌందర్యము ఆ మాలపిల్లలో వుంది.

'ఏమే సీతి! పంపు ముట్టుకున్నావు; నీకేం పోగాలంవచ్చిందే' అని గర్జించింది, చంకలో ఒక బిందె, చేతిలో ఒకబిందె పట్టుకుని మన్నీళ్ళకోసమని వస్తూన్న సోమిదమ్మగారు.

అదరిపడి ఇవతలకు వచ్చేసింది సీతి. ఇక సాగించింది సోమిదేవమ్మగారు. 'మరీకాలం మారిపోతుందమ్మా! నానా మాలకూడా ఔతున్నది. పంపు మైలపడిపోయింది; ఇవ్వాళ పస్తుపడుకోవాలిసిందే దీనిజీవానికి పడి ఏడుస్తా.'

క్షమార్హముకాని ఒక పెద్ద తప్పుచేసినట్లు వణికిపోయింది సీతి.

'ఔనే! బ్రాహ్మణులు వాడుకునే పంపు నీ వెందుకు ముట్టుకోవచ్చావుగా! మాఅల్లుడితో చెప్పి ఏం చేయిస్తానో చూడూ!' అంటూ సోమిదమ్మగారికి వత్తాసివచ్చింది, ఆయుర్వేద డాక్టరుగారి విధవ అత్తగారు. ఆవిడ అసలే కంచుమనిషి. సగంసగం విరిగిన పండ్లు చూపిస్తూ శరవొచ్చినట్లు ఎనిమిదో అష్టం చదివేసింది.

ఇంతలో ఇంకో ఆవిడ అందుకున్నది: 'వాళ్ళ నంటే ఏ మున్నదమ్మా. తప్పంతామందే; మనమే వాళ్ళకు దారిచూపిస్తున్నాం. ఆమధ్య చూడలేదూ శాస్త్రులుగారి భార్య మాలపిల్లల నందర్నీ వెంటేసుకుని గుళ్ళల్లో దూరేటందుకు ప్రయత్నంచేసింది'—

చుట్టుప్రక్కల ఆడవాళ్ళంతా చేరారు. పెద్దపులుల గుంపుముందు లేడిపిల్లలాగు సగంచచ్చి గుడ్లు వప్పజెప్పి చూస్తున్నది సీతి.

సీతికి అప్పుడు భగవంతుడిలా ప్రత్యక్షమయ్యాడు వెంకట్రావు. బండిలోనుంచిదిగి, బజారునుంచి కొని తెచ్చుకున్న గుడ్డలమూట ఒకటీ, పండ్లూ అవీవున్న తాటాకుబుట్ట ఒకటీ, సీతికి అందించి తన గదిలోనికి పట్టుకెళ్ళమన్నాడు. అవి అందుకుని బ్రతికేంరా భగవంతుడా అని వెళ్ళిపోయింది సీతి. వెంకట్రావును చూచి ముత్తయిదువలంతా గృహాల్లోదూరేరు. అన్ని విషయాల్లోనూ నిరాఘాటంగా మాట్లాడేందుకు లైసెన్సువున్న వితంతువులు మాత్రం మిగిలేరు. 'బట్టలుకూడా మాల పిల్లచేత మోయిస్తున్నావేమి నాయనా! బ్రాహ్మణుడివి కాదూ.' అని బుర్రమీద ముసుగు సవరించుకుంటూ డాక్టరుగారి అత్తగారుచేసిన ఆక్షేపణకు జవాబు చెప్పకుండానే, వెంకట్రావు రెడ్డిగారింట్లోకి వెళ్ళిపోయాడు. అతనిబస రెడ్డిగారి మేడమీది దక్షిణపువైపుగదిలో.

వెంకట్రావు వచ్చేసరికి బట్టా, మూటా, క్రింద పెట్టి గుమ్మందగ్గిర నుల్చుంది, సీతి. ఒక్క నిట్టూర్పు విడిచి ఇక నెప్పుడూ ఆ పంపువద్దకు పోకూడదని మనస్సులో నిశ్చయంచేసుకున్నది.

సీతి ఇన్నాళ్ళనుంచీ వాళ్ళ చిన్నగారివూళ్ళో ఉంటూండేది. పది పదిహేనురోజుల క్రితమే వెంకన్న ఉత్తరంవ్రాసి దాన్ని పిలిపించుకున్నాడు. కాస్త చేతి క్రింద ఆసరావుంటుంది కనుక. అతనూ చాల పెద్ద వాడైపోయాడు; కాచిపోసే దిక్కు లేదు మరి.— క్రొత్త కనుక సీతికి తెలీదు; వాళ్ళ మాలపల్లిలోలా, నాగరికత హెచ్చిపోయిన పట్నాలలోకూడా సర్వ మానవ సౌభ్రాతృత్వమే ప్రకాశిస్తుందని అనుకున్న దేమో అందుచేతనే పంపు ముట్టుకున్నది.

వెంకట్రావువచ్చి గదితాళంతీసి, లోపల ప్రవేశించి, కోటుతీసి వంకెకుతగిలించి కుర్చీలో చేరగిలపడ్డాడు. సీతి అతనితో జరిగిన సంగతంతాచెప్పి: 'ఇంతలో మీరు రాకపోతే, నాప్రాణాలు కొరికితినేసేవాళ్ళు సుమండీ, ఈ బాపనక్కలంతా' అంది.

'వాళ్ళ చేదస్తానికేంగాని సీతా.—'

'సీతి! అనండి బాబూ మాకెందు కంతపేరు'

'నీ అందానికితోడు చక్కని పేరే వుండాలి. సీతా! అనేపిలుస్తా. సీతా!'

ఆ నల్లపిల్ల ముసిముసినవ్వులు నవ్వుతూ సిగ్గుపడింది.

'నీ చక్కదనానికితోడు చదువుకూడా వుంటే నీ వొక అందగాడైన విద్యావంతునికి భార్యవౌతావు సుమా సీతా!'

'మా పిన్నిగారివూళ్ళో కిరస్తానిబళ్ళో నాలుగో క్లాసువరకూ మాత్రం చదువుకున్నా' అంది సిగ్గుచేత ఎర్రబడ్డ ముఖంతో.

'ఇంకా పైనకూడా ఎందుకు చదువుకోకూడదూ?'

'కిరస్తానిమతంలో చేరితే డబ్బిచ్చి పెద్దచదువు చెప్పిస్తానంది దొరసాని, నేనైతే ఏ మతమైతేనేం కలిసిపోదామనుకున్నా. కాని మాఅయ్య వొప్పుకున్నాడుకాడు. మనకు కోదండ్రాముడే దైవం' అన్నాడు.

'ఔను. వెంకన్న మంచి రామభక్తుడు. తోటలో పనిచేస్తూ అతను పాడుకూండే పదాలు వింటూఁటాను కదా! చాల భక్తిరసంగా వుంటవి. రోజూ సాయంత్రం గుడిదగ్గరకుపోయి దూరాన్నేఉండి దండంపెట్టిపోతాడు.

'మా పిన్నిగారివూళ్ళో కిరస్తానిగుళ్ళో తెల్ల దొరలూ, దొరసాన్లతోకూడా కలిసికూర్చొని ప్రార్థన చేసేవాళ్ళం మాబళ్ళో మాలపిల్లలమంతా. బాపనయ్యలు మీరు మమ్మల్ని మన గుళ్ళలోకే రానియ్యరుగా. అందుకనే మాఅయ్య మా పాకలోనే ఒక రాములవారి పటం పెట్టుకున్నాడు. రోజూ తోటలో నుంచి పూలుతెచ్చి పూజచేస్తాడు.'

'ఔను. నే నెరుగుదును.'

'ఎలా తెలుసు?. మాయింటికి ఎప్పుడన్నా వచ్చారా?' అని అడిగి కొంచెం సిగ్గుపడ్డది.

'ఒకసారి వచ్చా. నేనావైపు షికారుపోతూంటే మీ అయ్య నన్నుపిల్చి మాపిన్నికి ఉత్తరం వ్రాయించాడు. ఆ ఉత్తరమేగా నిన్నిక్కడకు తెచ్చింది.'

'ఉత్తరం నేనే చదివేను. విడివిడిగా అక్షరాలు అందంగా వున్నై.'

వెంకట్రావు పెదవులచివర చిరునవ్వు నవ్వేడు, బుట్టలోనుంచి ఒక ద్రాక్షపండుతీసి నోట్లో వేసుకుంటూ.

'ఇక నే పోతా బాబూ!' అంది సీత.

'ఇవిగో కొన్నిపండ్లు తీసికెళ్ళు సీతా!' అని దాని ఒడిలో తాను కొనితెచ్చిన అన్నిరకాలపండ్లూ, కొన్ని పోసేడు. సీత వెళ్ళిపోయింది. 'షేక్స్పియర్' నాటకం ఒకటి చదువుకుంటూ నిద్రపోయాడు వెంకట్రావు.

సీత ముట్టుకున్న పంపువిషయం ఏమైందో తెలీదు. పురోహితుణ్ణి పిలిపించి వేదమంత్రాలచేత ఆ ఇనుప ముక్కల్ని పునీతంచేయించారో, శేష సోమిదేవమ్మగారింట్లో ఆ రోజున వుపోష్యం ఉన్నారో, ఏ సంగతీ భోగట్టా చేయబడలేదు.

## ౨

వెంకట్రావు తల్లిదండ్రులను చంపి పుట్టినబిడ్డ. చిన్నప్పటినుంచీ దుగ్గిరాలలో సుందర్రామయ్యగారింటిలో పెరిగేడు. ఆయన, మేనల్లుడిని తన పిల్లలతోకూడా ప్రేమతో పెంచేడు. వెంకట్రావు చదువులో తెలివిగా పైకి ఎక్కవస్తున్నాడు. కొంచెం అందగాడు కూడాను. అందుచేత తన కూతుర్ని అతనికిచ్చే విషయంలో సుందర్రామయ్యగారి భార్యకు అయిష్టం కలగలేదు. రాజేశ్వరీ వెంకట్రావులకు పెండ్లైనసంవత్సరమే అతడు మెట్రిక్యులేషన్ పేసయ్యాడు.

తరువాత గుంటూరు కాలేజిలో చేర్పించాడు మేనల్లుడిని సుందర్రామయ్యగారు. అతనికోసం మళ్ళీ అక్కడ వేరేకాపురం ఎందుకని తన్ను ఎరిగినటువంటీ, ఆ బాల్యస్నేహితుడూ ఐన రెడ్డిగారింట్లో అతనికి బస ఏర్పాటుచేసేడు. హోటల్లో భోజనం. రెడ్డిగారు అతన్ని కాస్త పైపైన కనిపెడుతూండేవాడు. కాలేజీ చదువు కూడా పూర్తికావచ్చింది. ఇంకా మూడు నెలలకు బి. ఏ. పరీక్షకు కూర్చుంటాడు.

ఒకనాడు వెంకట్రావు తన సహాధ్యాయి యైన శాస్త్రితో కులాసాగా మేడమీది ఖాళీస్థలంలో కుర్చీలు వేసుక కూర్చుని మాట్లాడుతున్నాడు. రెడ్డిగారి తోటయొక్క సౌందర్యమంతా వారికి కనిపిస్తున్నది. అందుండి వీస్తున్న మందపవనానికి శాస్త్రి బోడి తలమీద ఎదిగీ ఎదుగకుండావున్న నాలుగుపీచులు ఏమినాట్యంచేస్తున్నా చేస్తున్నాయి.

వెంకట్రావు ప్రసంగవశాత్తూ అన్నాడు: 'శాస్త్రీ!

నేను రేపు స్కూలులో వర్ణాంతర వివాహాలనుగురించి ఉపన్యసింపవలసివుంది.'

'అవి దేశక్షేమానికని చెప్పేరకమేగా నువ్వు!'

'ఔను.'

'మీరంతా వేదబాహ్యులురా. ఏ తురక, కిరస్తానీ మతాలలోనో పుట్టవలసినవాళ్ళు.'

'వేదం వేదమని కొట్టుకలాడుతారే కాని మీరంతా! వాటిలో ఏముందయ్యా! వేదాలంటే హిందూదేశపు ఆదిమ నివాసులైన ఆర్యుల ఆచారాలూ, వారి అనుభవాలూ. మానవుని అనుభవము ఎప్పటికీ అసంపూర్తేనని తెలుసుకదా. ఇక వాటి ప్రయోజనం?'

'ఛీ! హిందువుడు వుచ్చరింప తగనిమాట. వేదాలు అపౌరుషేయాలోయ్.'

'పోనీ, నీవన్నట్లు అవి దేవుడి ముఖంనుండే వూడిపడ్డవనుకో. భగవంతుణ్ని పూర్తిగా అర్థంచేసుకోగలుగుటకు మనం మానవమాత్రులమేకదా! అప్పుడూ మనకవి ప్రయోజనకారులు కావు—అదీకాక వేదాలు ఏలాగు త్రిప్పితే అలాగు తిరుగుతున్నవి. హిందూదేశంలోని అనేకమతాలకూ అవే ఆధారం. అందరికీ అన్నివిధాలగా సత్యాన్ని చూపిస్తున్నవి. భగవంతుడిమార్గాల మల్లేనే అవీ దుర్గ్రాహ్యాలుగా వున్నై.'

'నీదంతా ఉన్మత్తుని ప్రలాపం'

'కాదు విను. మన జీవితమంతా ప్రతినిమిషం పుణ్యపాపాలమధ్య, సుఖదుఃఖాలమధ్య, మంచిచెడ్డల మధ్య వుంది. ఎల్లప్పుడూ జీవితంఅంటే సత్యాన్వేషణగా యుండాలె. మన అనుభవాలే మనబుద్ధిని పరిపక్వంచేసి మనకు సత్యాన్ని గోచరింపచెయ్యాలి; అంతే కాని నీ వేదాలు, నీ శాస్త్రజ్ఞానమూ నీకు నేర్పేది తర్కం; అనుభవమియ్యవు. యజమానుడిని కుక్కవలె మీరు వేదపురాణాదులను అనుచరిస్తారు—నిజంగా ఆలోచిస్తే ప్రేమ ప్రాధాన్యమైన వివాహం వర్ణాంతరమైతే మాత్రం—'

వెంకట్రావు ధోరణి ఆగిపోయింది. ఎందుకనో 'అరెరే!' అనిమాత్రం ఉచ్చరించి, మేడమీదినుంచి క్రిందికి పరుగెత్తిపోయాడు. శాస్త్రీ గాభరాపడి క్రిందికి దిగి వెంకట్రావు కనుపించకపోతే మళ్ళీ పైకి వెళ్ళి కుర్చీలో పడుకున్నాడు అప్పుడప్పుడే తూరుపు కొండపైకెక్కుతూన్న చంద్రబింబాన్నిచూస్తూ.

మరు నిముషంలో వెంకట్రావు రెడ్డిగారితోట్లో దిగుడుబావి క్రిందిమెట్టుమీద వున్నాడు. నీళ్ళలో గుటకలువేస్తున్న వ్యక్తియొక్క జుట్టుమాత్రం పైకిపైన నాచులాగ తేలుతున్నది. అందుకోబోయ్యాడు వెంకట్రావు. కాని ఆ వ్యక్తిలోనికి మునిగింది. ఇంకోసారి పైకితేలగానే చివాలున ఆ జుట్టుపట్టుకుని సీతని ఈవలకు లాగేడు తిన్నగా. ఆపిల్లను జాగ్రత్తగా ఎత్తుకుని ఒడ్డుకుతెచ్చి తన తొడలమీద ఆమెతలవుంచి పడుకోబెట్టుకుని కూర్చున్నాడు.

ఆమెచేతులు పైకీ క్రిందికీ ఆడిస్తూ కొంచెంగా వ్యాయామం కలుగచేశాడు. ముక్కునా నోటా కొన్ని నీళ్ళు కక్కింది. కొంతసేపటికి నిండువూపిరి తీసికొని కన్నులుతెరిచింది; కాని మళ్ళీ మూసికొని ఒత్తిగిలిపడుకుంది చేతులతో అతనినడుం కౌగిలించుకుని. శ్వాస సరిగా చేస్తున్నది.

సీత చక్కందికాదని ఎవరంటారు? దరిద్రదశచేత పోషణ లేకపోవడం తూ—న్ని, ఎంతసౌందర్యం ఆ ముఖంలో గర్భీభూతమైవుంది! ఫాలభాగాన్ని కప్పిన వెండ్రుకలను ప్రక్కకుత్రోసి, ఉత్తరీయంతో ముఖంమీది తడి అద్ది వెంకట్రావు వంగి ఆమె పెదవులకు తన పెదవులు కలిపేడు.

వెంటనే కన్నులుతెరిచింది సీత. తోట అవతలివాకిటి గుండా సీతని నడుముపట్టుకుని నడిపించి తీసికొనిపోయి ఒక బండీమీద వెంకన్నయింట్లో దిగబెట్టేడు వెంకట్రావు. వెంకన్న తన కృతజ్ఞత వెల్లడిచేయడానికి తనకువచ్చిన భాషంతా ఉపయోగించాడు.

తిరిగి వెంకట్రావు గదిచేరుకునేసరికి, శాస్త్రీ కుర్చీలో ఒక చిన్ననిద్ర తీస్తున్నాడు. వెంకట్రావు నీళ్ళు తెచ్చి అతనిచెవిలో పోసేటప్పటికి ఉలికిపడి లేచాడు.

## 3

సీతకు బాగా స్వస్థతచిక్కింతర్వాత ఒకనాటి సాయంకాలం:

వెంకట్రావు తోట్లో షికారుచేస్తున్నాడు. సీత మెల్లగావచ్చి అతనిమెడలో ఒక పూలచెండు వేసింది.

'మీ ఉపకారానికి కృతజ్ఞురాలిని. మీ మేలు మరచి పోను' అంటూ. నిరాడంబరమైన అమాయికపు సౌందర్యమంతా ఒలికింది ఆనాటి ఆమెరూపంలో. వెంకట్రావుకు పరవశమైంది. అప్రయత్నంగా బాహువులు చాచి ఆమె నడుముపట్టి దగ్గరకు లాగికొని రెండు గుండెలూ ఏకంచేశాడు.

మరికొన్నాళ్ళకు వెంకన్నయింటిలో రాములవారి పటంముందు: వెంకన్న తన కూతురుచేయి వెంకట్రావు చేతుల్లోపెట్టి అంటున్నాడు: 'నా కోదండరాముడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు. సీతా! బాబుగారిని దైవంగా చూసుకో. బాబూ! ఎప్పటికైనా తక్కువజాతిపిల్ల అని సీతని మీరు వదలేస్తే నా రాముడు ఓర్వడు.'

ఒక్కవిషయం చెప్పవలసివుంది వాళ్ళ వివాహానికి వెంకన్న ఒప్పుదల చాల కష్టంమీదనే దొరికింది. ఇంటర్మీడియేటు చదువుతూన్నప్పుడే వెంకట్రావుకు మైనార్టీ వెళ్ళిపోయింది. అప్పుడే అతని ఆస్తికి అంతవరకూ 'ట్రస్టీ'గావున్న మేనమామ సర్వమూ అతని అధీనం చేశాడు. అందుచేత వెంకట్రావు స్వతంత్రించి తనకు ఇంపీరియల్ బ్యాంకులోవున్న డబ్బులో ఒక పదివేల రూపాయిలు నాలుగు సంవత్సరముల అవల సీతకు బ్యాంకువారే ఇచ్చేలాగున ఏర్పాటు చేసినప్పుడు వెంకన్న మరి అడ్డుచెప్పలేదు.

౪

బి. ఏ. పరీక్షలైపోయినా ఇంటికిపోయే తొందరలో లేదు వెంకట్రావు. తన భావిజీవితపు ఏర్పాట్లనుగురించి ఆలోచిస్తున్నాడు. ఏదో వుద్యోగం కోసం వెతుక్కోవాలనే వుద్దేశంకాదు. నాలుగైదు కుటుంబాలను తనతోకూడా పోషింపగల ధనవంతుడతను. ఇప్పుడతన్ని ఎదుర్కొన్న సమస్యలు వేరు. సీతతో ఎక్కడ తాను కాపురంపెట్టాలి. ఇక తనకూ సుందరామయ్యగారికీ సంబంధం వదలిపోయినట్లేనా! మరి రాజేశ్వరి సంగతేమిటి? ఒకవేళ సంఘం తన్ను బహిష్కరిస్తే ఏమిచేయాలి! ఇప్పుడు తాను స్వతంత్రించి తన వ్యక్తిత్వం చూపుకోవలసిన పరిస్థితి.

సీతా వెంకట్రావుల ప్రణయసంబంధం శాస్త్రికి చూచాయగా తెలిసింది. శాస్త్రిది 'సనాతనిష్టు పార్టీ' చాలా రోజులనుంచీ ఒక చెయాస్లగారి శుశ్రూష చేస్తూండేవాడు. కాని గురువుగారికీ ఒక వరోపాలితంతు ఫుటూ ఏదో బాదరాయణసంబంధం యున్నదని తెలిసి ఆయనవద్దకు వెళ్ళడం మానేశాడు. అదంతా వేరేకథ.

సీతా వెంకట్రావుల కథ విని శాస్త్రి చాలాదుఃఖించాడు. పాపం చెడ్డాడు కులభ్రష్టుడై, అధఃపతితుడై పోతున్నాడే అనుకున్నాడు. వెంటనే ఒక అణాకు లోభించకుండా ఒక పెద్దవుత్తరం బనాయించాడు సుందరామయ్యగారికి సర్వమూ తెలియబరుస్తూ 'ఉపేక్షచేస్తే మీ మేనల్లుడు మీకుదక్కడు సుమండీ!' అనికూడా వ్రాశాడు.

ఉత్తరం చదువుకునేసరికి సుందరామయ్యగారి భార్యకు అల్లుడిమీద పట్టరాని కోపమూ, కూతురిమీద జాలీ పుట్టుకొచ్చినై. వెంకట్రావును ఆమె చాలా దూషించింది. 'వెంటనే మీరుపోయి అతన్ని ఇంటికి తీసుకరండి. లేకపోతే మరీ చెడిపోతాడు' అని భర్తను వెళ్ళిందాకా గోరాడింది.

మొన్న మొన్ననే కాలేజీగోడలు దాటి బైటకువచ్చిన యువకుణ్ణి బుట్టవేయడం, ప్రపంచానుభవం పూర్తిగా వున్న సుందరామయ్యగారికి కష్టమనిపించలేదు. వెంకట్రావును ఇంటికితెచ్చి ఒక శుభముహూర్తాన రాజేశ్వరి అనే కాడి మెడకు తగిలించేశాడు. తరువాత తన బావమరిది ఒకాయన హైదరాబాదులోవుంటే ఆయన ద్వారా అబ్కారీ డిపార్టుమెంటులో ఒకవుద్యోగం సంపాదించిపెట్టి మేనల్లుడిని భార్యాసహితంగా అక్కడకు తోలేశాడు. సీతమాత్రం వెంకన్నపాకలోనే మిగిలిపోయింది.

రాజేశ్వరి అందంగలపిల్ల. పచ్చనిదేహచ్ఛాయ. నల్లనికండ్లు, తీరైన ముక్కు, అంతపొడుగుకాని, సన్నపాటి, సౌకుమార్యంవొలికే శరీరం, ఒత్తుగా నిగనిగలాడేజుట్టు—ఇంకా చాలావున్నవి సౌందర్యచిహ్నాలు. మొత్తంమీద వెంకట్రావును ఆకర్షించడానికి శృంగారం కొదువలేని విగ్రహం.

వెంకట్రావు ఉద్యోగదశ నాలుగుసంవత్సరాలు మాత్రమే. అందులో మొదటిసగం సౌఖ్యంగానే గడిచింది. తరువాత అతని శరీరారోగ్యం తప్పింది. హైద

రాబాడు శీతోష్ణస్థితి అతనికి పడలేదో ఏమో శరీరం డసిలింది. లంబాడీ దయ్యంలాగా మలేరియాజ్వరం పట్టుకుని వదలటంలేదు. చాలా క్షీణించాడు మనిషి. పైగా దగ్గొకటి, అది రానురాను క్షయలోకి దింపింది. ఏ డాక్టరును సలహా అడిగినా 'మీరు ఉద్యోగం వదలి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుని మందుతింటూంటేనే గాని మీ శరీరం మీకు దక్కదు' అన్నారు. అందుచేత నిరుత్సాహపడి ఉద్యోగానికి రాజీనామాఇచ్చి రాజేశ్వరితో దుగ్గిరాలకు వచ్చేశాడు.

నాలుగు సంవత్సరాల తరువాతవచ్చిన వెంకట్రావును చూచేసరికి సుందరరామయ్యగారు నిర్విణ్ణులై పోయారు. అతనిముఖంలో పూర్వపుతేజస్సు లేనేలేదు. పరలోకానికి ఇంకా కొన్నిగజాల దూరంలోయున్నట్లు అతనకు తోచింది.

ఏమి ఆలోచించుకున్నాడో కాని వెంకట్రావును తన ఆస్తినంతా రాజేశ్వరిపేర వ్రాసేయమని మృదువుగా, అతనిమేలే కోరినవానివలె చెప్పేడు. చిన్నప్పటినుంచీ కుమారునివలె తన్నుపెంచి తన శ్రేయస్సుకోసమే పాటుపడిన మామగారిమాటలు తన్ను మోసపుచ్చటానికనే అభిప్రాయంపోలేదు వెంకట్రావుకు. రాజేశ్వరంటే తన ఆజ్ఞాబద్ధురాలనే విశ్వాసమేవుంది అతనికి. అందుచేత మామగారి యిష్టప్రకారమే చేసేడు.

'గుంటూరు వెళ్ళి మందుపుచ్చుకుని శరీరం బాగుచేసుకో' అనిచెప్పిన సుందరరామయ్యగారి సలహా బాగానేవుంది. వెంకట్రావుకూ అదేయుద్దేశం వుంది; గుంటూర్లో తానెరిగిన డాక్టర్లు చాలామందియున్నారు. అందుచేత తన ఉపచారంనిమిత్తం రాజేశ్వరినికూడా తీసికెళ్ళాలని అనుకున్నాడు. ప్రేమపాత్రురాలైన భార్య దగ్గర ఉంటే సగంబాధ తీసివేసినట్లు.

కాని రాజేశ్వరికి మాత్రం ఇష్టంలేదు. 'ఇంకనాక పుట్టింటికివస్తే అప్పుడే గుంటూరుప్రయాణమా మళ్ళీ' అంది. అదీకాక భర్తకు శరీరారోగ్యం తప్పిననాటనుంచీ జీవితమాధుర్యం ఆమె నాలుకకు తగులుటంలేదు. కాపురానికివెళ్ళిన మొదటి రెండుసంవత్సరాలకూ, తరువాతస్థితికీ చాలా వ్యత్యాసం కనిపించింది; అది ఆమె సహించలేకపోయింది. అందుచేత భర్తమీద ప్రేమ కొంత తగ్గియుండొచ్చు—కష్టదినాలు సంప్రాప్తమైనప్పుడు భార్య తన ధైర్యంతో దురదృష్టాన్ని ఎదుర్కొని, తన హృదయంలోని స్వర్గీయజ్యోతిని ప్రజ్వలింపజేసి భర్తకు ఓదార్పు, శాంతి, ఇవ్వగలిగియుండాలి. అట్లాంటి భార్యలు భాగ్యవంతుల యిండ్లల్లో అరుదు.

'గుంటూరు నేనుకూడా ఎందుకు? మీ దేహం ఆరోగ్యం కుదిరివచ్చేవరకూ నేనిక్కడేవుంటాను. నాకక్కడ ఒంటరిగా సుఖం వుండదు' అని రాజేశ్వరి అన్నప్పుడు ఆమె తత్వమంతా బోధపడింది వెంకట్రావుకు. 'ఇది నాకు భార్యకాదు' అనుకుని ఒంటరిగానే వెళ్ళి గుంటూరు సర్కారు ఆసుపత్రిలో 'ఇన్ పేషెంటు'గా చేరాడు.

మాసంరోజులు గడిచేసరికి కొంచెం తేరుకున్నాడు మనిషి. ఒకనాడు సాయంత్రమప్పుడు తన గదిముందు ఒక పీచుపరుపుమీద గోడకానుకుని కూర్చున్నాడు. ఇంతలో తన పూర్వపు సహాధ్యాయియైన శాస్త్రి అక్కడకు వచ్చాడు. మిత్రదర్శనం అతనికి ఆనందం కలుగజేసింది. శాస్త్రి అన్నాడు 'వెంకట్రావూ. నిన్ను చూచిపోదామనే వచ్చా. నీవు రోజురోజూ తేరుకుంటున్నావనుకుంటా!'

'ఔను, డాక్టర్లదయవల్ల.—నీవిక్కడే ఉంటున్నావా! ఏదైనా ఉద్యోగమా?'

'నేను ఉద్యోగంచేయదలచలేదు.'

'అయితే నయన్నగారి శిక్షణలోనే వున్నావన్నమాట.'

'లేదోయ్. ఇప్పుడు నా తత్వమంతా మారిపోయింది. నేను మానవసేవచేస్తున్నా.'

'పాషాణం ద్రవీభూతమైంది.'

'ఔను. సత్యస్వరూపుడైన గాంధిజీ పవిత్రాత్మచేత ప్రబోధింపబడి.'

'అయితే నీవు పైమెట్టుకు పోయావు. నాకు పూజనీయుడవైనావు'

'హరిజనపాఠశాల ఒకటి స్థాపించి దానికి చందాలు పోగుచేసి పనిచేస్తున్నా. ఇప్పుడు సుమారు ఒక వంద మంది బాలబాలికలు వుంటారు నా స్కూల్లో. ఇంకా వృద్ధిచేయాలి.'

'నిజంగా ధన్యుడవు.'

కొంతసేపటివరకూ నిశ్శబ్దం. తరువాత వెంకట్రావు శాస్త్రి భుజంమీద చేయివేసి 'శాస్త్రీ. పూర్వం మనం చదువుకుండే రోజుల్లో రెడ్డిగారింట్లో వుండేవాడిని నీకు జ్ఞాపకంవుందా?'

'ఔను. అవన్నీ ఒకనాటి రోజులు.'

'రెడ్డిగారితోటలో పనిచేసే వెంకన్నను నీ వెరుగుదువా?'

'ఆ'

'అతనికొక చక్కని కూతురుండేది—'

'సీత కదూ. నీ వామెను వివాహమాడి ఇక్కడే విడిచిపెట్టి వెళ్ళేవు. వెంకన్న తమ్ముళ్ళలాగ దుఃఖించి దుఃఖించి చనిపోయాడు.'

'సీత మళ్ళీ ఎవరినైనా పెండ్లాడి సుఖంగావుందా చెప్పు. ఆమెను బహిష్కరించినందుకే నాకీ అవస్థ కలిగిందని నాకు అనుమానం. అది వెంకడి శాపంకూడాను. మళ్ళీ సీత సుఖంగావుంటేనే నాకు శాపవిమోచనం.'

'సీత మారుమనువు చేసుకొనేటంత నీచురాలు కాదు. కులము తక్కువైనా గుణముగొప్పది. ఇప్పుడామె నా యింటిలోనే మరికొందరు హరిజనబాలికలతో కులాసాగావుంటున్నది. రోజూ ఆమెగదిలో నీ ఛాయాపటాన్నే పూజించుకుంటూంది. కోదండరామునితోపాటు.'

'శాస్త్రీ! అంత అమాయకత్వాన్ని మోసంచేశాను. నా పాపానికి నిష్కృతిలేదు.'

'ఉన్నది. నీవిక నీ జీవితశేషాన్ని నా ఉద్యమాభివృద్ధికోసం నా కుడిభుజముగా పనిచేయి.'

'నా కారోగ్యము కుదిరితేకదా.'

'ఇంకో మాసంరోజులలో నీది వజ్రకాయమైపోతుంది. నీ ఆరోగ్యంకోసం రోజూ సీత చేస్తూన్న ప్రార్థనలు కోదండరాముడు వృథాచేస్తాడనుకోను.'

'అయితే, సీతకు తెలుసా నే నిక్కడున్న సంగతి.'

'నీ వీ ఆసుపత్రిలో చేరినమర్నాడే తెలిసిందిమాకు. నాడుమొదలు ప్రొద్దునా సాయంత్రమూ నీ కోసం అన్నపాలు తెచ్చి ఆసుపత్రిలో యిచ్చిపోతున్నది ఎవరో తెలుసా—సీత.'

వెంకట్రావుకు చాలా సంతోషమైంది. అపూటే అతనికి పూర్తిగా ఆరోగ్యం చేకూరినట్లయింది. కులాసాగా మరికొంతసేపు శాస్త్రితో మాట్లాడి అతను వెళ్ళగానే ఎన్నడూ అనుభవించని గాఢనిద్రపోయాడు.

*


సీత మునుపటికీ ఇప్పటికీ చాల మారిపోయింది. ఆమె ఇప్పుడు కేవలం సౌందర్యనిధి. ఒకప్పుడు సంస్కారవిహీనమై యుండిన ఆ కేశభారమిప్పుడొక మనోహరమైన వేణ్యాకారము దాల్చింది. విద్యాగంధముచేత ఒక తేజస్సు ముఖములో ప్రాముకొని పెద్దయింటి బిడ్డ అనిపిస్తున్నది. పూర్వము పనిపాటలచేత కొంచెము కరకుబారిన హస్తాలు నేడు పల్లవములను పోల్చవచ్చియున్నవి. మాటలలో, చేతలలో ఒక తీయని నాగరకత ప్రాకివచ్చింది. నేడి పంచమబాలికల కామె యిప్పుడు పెద్దక్కవలె సంచరించుకొనుచున్నది. శాస్త్రిగారి హరిజన పాఠశాలలో ఇకముందు ఉపాధ్యాయత్వము స్వీకరింపనున్నది కూడా.

ఆనాడు సీతను చూడవలెను. శాస్త్రిగారి గృహిణి ఆమెకు సంస్కరణ చేసి ముఖాన కల్యాణపుబొట్టు పెట్టింది. ఒక ఖద్దరుచీర కట్టింది. ఆ చామనచాయ శరీరంమీద ఆ ఖద్దరురంగు అదొక అందంగావుంది. సిగ్గుతో బుగ్గలెర్రబడ్డ ఆ పిల్లను తిన్నగా వెంకట్రావుదగ్గరకు తెచ్చి శాస్త్రి ఆమె దక్షిణహస్తము అతనికి అందిస్తూ అన్నాడు. 'మిత్రుడా! ఇదిగో నీ రత్నాన్నే సానబెట్టి మళ్ళీ నీకే యిస్తున్నాను; పుచ్చుకో' అని.

వెంకట్రావు చిరునవ్వునవ్వుతూ ఆమె హస్తాన్ని గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. సీత అతనిచూపులలో తన చూపులు కలిపి సిగ్గుపడి తలవంచుకుంది.

తరువాత కొన్నాళ్ళకు సీతకొరకు 'డిపాజిటు' చేసిన పదివేలరూపాయిలు బ్యాంకువారు ఆమెకు ఇచ్చేశారు. సీత ఆనోట్లు పట్టుకపోయి 'ఇదిగో మీకు వరకట్నం' అంది, వెంకట్రావు చేతులలో పెట్టి. అతడా డబ్బును హరిజనపాఠశాలకు మూలధనంగా శాస్త్రిచేతికిచ్చి అతని కుడిభుజంగా పనిచేస్తున్నాడు.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి ఏ.




# తొలిబిడ్డ

ఒక దంపతులకు పుట్టు తొలిబిడ్డ. తరువాత పుట్టువు నొందు బిడ్డలనుండి ఈ తొలిబిడ్డను వేఱుపఱచు కొన్ని ప్రత్యేకవిషయములు గలవు. ఆబిడ్డ తొలిబిడ్డ యగుటయే ఒక ప్రత్యేకవిషయము. శిశుపోషణ విషయమున తల్లిదండ్రులకు అప్పటికి పూర్తిగా అనుభవము ఉండదు. అనుభవము లేకుండుటచే వారు బిడ్డపెంపకము విషయమున అత్యాతురత చూపుదురు. ఈ అత్యాతురత ఆ చిన్నబిడ్డ కూడ వెంటనే గ్రహింపగలదు. ఒక్క నిదర్శనము చూడుడు. శిశువును అడ్డాలలో పట్టుకొనుటయే ఒక ప్రత్యేకవిద్య అవలసి యున్నది. నెలబిడ్డల నెత్తుకొనినపుడు సాధారణముగ అలవాటులేని వారికి చాల భయము వేయును. ముద్దుకొలుప ఆ నెలబిడ్డను ఎత్తుకొనమని నీకిచ్చెదరు. ఆబిడ్డ నీ బిడ్డ కాకపోవచ్చును. అన్నెము పున్నెము ఎఱుగని ఆ శిశువును ఎత్తుకొనుటలో ఏప్రమాదము జరుగునో యను మానసికవేదన నిన్ను అంటియుండును. నీ చేతులలో ఆ బిడ్డయుండు కాసంతసేపును అతిగా చలించు పాదరసమును పట్టియుండినట్లు నీవు భావింతువు. ఏ నిముసమునందైనను ఆబిడ్డ నీ చేతులనుండి జారిపోవచ్చునని నీవు శంకించుచుందువు. నీవా బిడ్డను తిరిగి భద్రముగ ఇచ్చివైచి ఎంతయో భారము తగ్గినట్టుల తేలికపడుదువు. నీవు పట్టుకొనుటతోడనే శిశువు ఈ సంగతిని గ్రహించును. నీ చేతులలో తనస్థితి భద్రముకాదను భావమును ఆ శిశువు ఏడుపుమూలమున తెలుపును.

చంటిబిడ్డల నెత్తికొనుటలో నీకు అనుభవములేనిచో నీ తొలిబిడ్డతో కూడ ఈ విధమగు బాధ తప్పదు. నీ చేతులలో బిడ్డ కుదురుగనుండక పోరుపట్టుటలో నీవా బిడ్డవిషయమున ఆతురరాల వగుదువు. బిడ్డకు చలితగిలెనో, ఆకలివేయుచున్నదో, ఏదైన బాధగానున్నదో అని నీవు కలతచెందుదువు ఈ చేతులలో తన స్థితి రక్షితముకాదను భావమును శిశువు ఒక్క రోదనము చేతనే గాక నిద్రపోకుండుట, డోకుకొనుట, విరేచనము చేసికొనుట మొదలగు లక్షణములతో కూడ సూచించును. ఇంతమాత్రముతో ముగియదు. అట్టి బిడ్డ పాలు త్రాగకుండుట కూడ సంభవించును.

తన తల్లిచేతులలో తన స్థితి భద్రముకాదను సంగతి ఆ చిన్నబిడ్డ ఎట్లు గ్రహించునో తెలిసికొనుట చాల కష్టము. ఒకలాగున ఊహింపవచ్చును. చంటిబిడ్డను ఎత్తుకొనునపుడు నూత్నముగ మాతృత్వము వహించిన స్త్రీ పైన చెప్పినట్టి ఒకవిధమగు భయమునకు లోనగును. ఈ భయము ఆమెకు తెలియకయే చేతుల వణుకు మొదలగు లక్షణములతో బహిర్గతమగును. ఈ వణుకు తల్లి కనిపెట్టలేకపోయినను ఆమె చేతులలోనుండు పిల్లమాత్రము వెంటనే గ్రహించును. ఇట్టి సమయములందు చేతులలో చిన్నబొంతగాని, పలుచటి తలగడగాని పెట్టుకొని బిడ్డనెత్తుకొనుట మంచిది. ఈ మెలకువచే తల్లి చేతి వణుకును చంటిపిల్లకూడ తెలిసికొనలేకపోవును. కొద్దికాలములో క్రొత్తగా పిల్లతల్లి

కాకున్న స్త్రీ ఇదివఱకు తనకు చంటిబిడ్డలను ఎత్తుకొను అలవాటు బొత్తిగా లేకున్నచో ఇప్పుడైనను చంటిబిడ్డలను ఎత్తుకొనుచు కొంత అనుభవమును సంపాదించుట మంచిది. ఇరుగుపొరుగున స్నేహితురాండ్రలో ఎవరికైన చంటిబిడ్డ యుండుచో వారి యింటికి తఱుచు పోవుచు ఆ బిడ్డల సంరక్షణమున పాల్గొనుచు వారికి నీళ్ళుపోయుట మొదలగు పనులయందు అవకాశమున్నంతవరకు తరిఫీదు నొందుచుండవలయును. బిడ్డను జాగ్రత్తగ ఎత్తుకొనుట ఎట్లో ముందు నేర్చుకొనుము దానితో క్రొత్తగ బిడ్డనెత్తుకొనుటలో కలుగు భయము సమసిపోవును. శిశుపోషణ విషయమున కావలసిన జ్ఞానము స్త్రీలకు సహజముగనే కలుగునని చెప్పుదురు. కాని ఇది సత్యదూరమైనమాట. మాతృత్వమునకు అర్హతనొందినంతమాత్రమున స్త్రీ శిశుపోషణవిషయమున సర్వజ్ఞురాలు కాలేదు.

తొలిబిడ్డ విషయమై తల్లి వలసిన జాగ్రత్తకంటె హెచ్చు జాగ్రత్తను చూపును. తొలిబిడ్డనుగూర్చి తల్లి మిక్కిలి గర్వముతోనుండును. కలిగినంతలో అతనికి సర్వము సమకూర్చుటకు ఆమె అత్యాతురత చూపును. ఇంత చేయుచున్నను బిడ్డకు సుఖము సమకూడుచున్నదా లేదా అని ఆమె అనవరతము అనుమానించుచుండును. ఏడ్చినపుడెల్ల పాలు ఇచ్చుచున్నను బిడ్డకు పాలు సరిపోవుచున్నవా లేదా యను సందేహము ఆమెను సర్వదా పీడించుచుండును. బిడ్డ పుష్టిచేయుచున్నను అది చాలినంత పుష్టి కాదేమోయను అనుమానము తల్లినివీడదు. బిడ్డ క్యారుమనిన చాలు, ఆమెకు ఎక్కడలేని కంగారు కలుగును, తొందరగాపోయి బిడ్డను చూచువఱకు ఆమెకు కాళ్ళు ఆడవు. చూచి ఊరుకొనదు. చేతులలోనికి తీసికొనును. ఆమె చేతులకు వణుకుగావున బిడ్డ ఆమెచేతులలో మఱింత బిగ్గరగ అఱచును. అందులో తల్లి బిడ్డకు ఆకలి అగుచున్నదనుకొనును. అంతక్రితమే పాలు ఇచ్చియున్నది, అయినను ఇప్పుడుకూడ ఇచ్చును. బుజ్జగించును, నిమురును, జోల పాడును, బిడ్డను ఎత్తుకొని అటునిటు తిరుగును. బిడ్డకు ఈరీతి అలవాటగును. ఇంతటి అనవసరపు జాగ్రత్త పుచ్చుకొని బిడ్డను పెంచుటతో తల్లికి వేళపట్టున ఆహారము, కంటినిండ నిద్ర లభింపకుండును. ఫలముగా ఆమె ఆరోగ్యము భంగపడును. ఆమె నరములు నిస్సత్త్వయగును. విషాదకర చిత్రమును ప్రదర్శించుచుంటినని పలువురు తలంపవచ్చును. కాని ఇట్టి ప్రదర్శనములు సర్వసాధారణముగ ప్రతి గృహమున సంభవిల్లుచునేయుండును. పైగా తొలిబిడ్డనుగూర్చి తల్లి ఒక్కింత అతిశయపడును. కాగా ఆ బిడ్డను పలువురకు చూపుచుండుటకు ఆమె ముచ్చటపడును. ఎవరైన చూడవచ్చినచో బిడ్డకు నిద్రాభంగము గావించియైన ఆమె బిడ్డను వారికిచూపును. ఆమె క్రొత్తగా తల్లియైనది. మొగమోటము జాస్తి. బిడ్డడు నిద్రించుచున్నాడు, మాపుటకపుడు తీసికొనిరావలెను అని ఆమె చూడవచ్చినవారితో చెప్పజాలకుండును. ఆమె భర్తయు ఈ విషయమున దోషముచేయువాడే యగుచున్నాడు. క్రొత్తకొమ్మక్కు గావున అతనికిని ఈ బిడ్డ అనిన మిక్కిలి ముద్దుగానుండును. పనినుండిగాని కచేరినుండిగాని వచ్చుటతోడనే అతడు నేరుగా బిడ్డవద్దకు పోవును, బిడ్డను లేపును, ముద్దుపెట్టుకొనును, పలుకరించును, నవ్వించును—ఇవిఅన్నియు ఏసమయమున? బిడ్డ ప్రశాంతముగ నిద్రించుచుండవలసిన సమయమున పగటిపూటయు, సాయంకాలపు పూటయు ఆ తొలిబిడ్డ కథ ఇట్లుండును.

ఇక రాత్రిపూట. 'ఏడాదిలోపు బిడ్డ. ఒంటరిగా ఎట్లు పరుండగలదు. చలివేయవచ్చును. పైగా చిన్నబిడ్డను ఒంటరిగా పండుకొననీయరాదు' అనుచు తల్లి పిల్లమంచము మీదనే పండుకొనును. ఇది బిడ్డ ఆరోగ్యమునకెంతయు భంగకరమైనది. ప్రక్కను తాము లేనిదే తమ బిడ్డలు నిద్రింపజాలరని కొందఱు తల్లులు మిక్కిలి గర్వముతో చెప్పుకొందురు. దీని కన్నిటికిని అజ్ఞానమే కారణమని చెప్పవలసియున్నది.

తల్లి చూపు ఈ అతిజాగ్రత్తకు, అత్యాతురతకు ఫలమేమి? ఆయింట తనకు పెద్ద చెలామణియుండుట ఐదు, ఆఱునెలలు వచ్చుసరికి బిడ్డ గ్రహింపగలుగును. తాను ఆయింట ముఖ్యుడగు వ్యక్తియగుటయు, తన

రోదనము ఆయింట శాసనమగుటయు ఆ బిడ్డ తెలిసికొనును. తల్లిని తన యిష్టమువచ్చినట్లు తిప్పుకొనును. తాను కోరిన ప్రతివస్తువు పొందగలుగుటలో బిడ్డ కాలక్రమమున ప్రతివస్తువుకోరు పిల్లడుగా తయారగును. కాని కాలక్రమమున వాడు కోరిన ప్రతివస్తువు పొందుట దుస్తరమగుట తెలిసికొనును. దానితో వాడు తృప్తిలేనివాడు, అందనివానికై ఆశపడువాడు అగును. అట్టివానిని స్నేహితులు, బంధువులు కూడ భరింపజాలరు. తాను అందరికంటె హెచ్చు చెలామణి కలిగియుండుటకు అతడెట్టి పనియైనను చేయుచుండును. ఇట్టి పిల్లవాడు సాధారణముగ అన్నము తిననని మంకుపట్టు పట్టును. అన్నము తిననని కోపగించు పిల్లడు సాధారణముగ అతిజాగ్రత్తచే చెడినవాడై యుండును. తొలిబిడ్డ ఇట్లు చెడుటకు హెచ్చు అవకాశములుగలవు.

తొలిబిడ్డ విషయమున గమనార్హమగు మరియొక సంగతిగలదు. తరువాతపుట్టు బిడ్డల కందఱును వారికంటె పెద్దవారగు బిడ్డలనుచూచి కొన్ని విషయములు నేర్చుకొనుటకు అవకాశములు విరళములై యుండును. తరువాత పుట్టు బిడ్డలకు ఆయింట తామొక్కరమే కామనియు, తినదగు - అనుభవింపదగు వస్తువులను ఇతరులతో పంచుకొనవలసి యుండుననియు తెలిసి యుండును. అగుటచేతనే తొలిబిడ్డకుండు స్వార్థపరత్వము, ఓర్పులేనితనము తరువాతిబిడ్డల కుండజాలదు. ఇద్దరు పరుగెత్తుచున్నారనుకొనుడు. ముందు పరుగెత్తువానిని అందుకొను కాంక్షతో వెనక పరుగెత్తువాడు చురుకుగా పరుగెత్తును. అట్లే రెండవబిడ్డ తొలిబిడ్డను అనుకరించు వాంఛలో ఏసంగతియైనను చురుకుగాను, సులభముగాను నేర్చుకొనును. తొలిబిడ్డకు ఈ అవకాశములు లేవు. అనుకరించుటకు అతనికి ఆదర్శము లేదు. అంతయు అతడు స్వయముగ నేర్చుకొనవలసి యుండును. అతిజాగ్రత్తవహించి యుండుటచే తలిదండ్రులు ఇట్లాతడు స్వయముగ నేర్చుకొనుటకు గూడ అడ్డువచ్చుచుండుట జరుగును.

ఇతరుల దృష్టిలో తమ పిల్లలు ఎట్లున్నారో తెలిసికొనగలుగు తలిదండ్రులు చాల తక్కువగ నుందురు. తమపిల్లలు మంచివారు, ఇతరుల బిడ్డలు చెడ్డవారు—తమబిడ్డలకు సరియైన ఆహారము ఈయబడుచున్నది, ఇతరుల పిల్లలకు సరిపోవు ఆహారము లేదు—ఇట్టి భావములు తలిదండ్రులకు తప్పక ఉండును. ఇట్టిభావములతో ఉండువారు తమబిడ్డలను తరచు అనుభవజ్ఞుడగు వైద్యునివద్దకు నియమిత కాలములయందు కొనిపోయి చూపుచుండుచో అతడు పరీక్షచేసి శిశుపోషణమున ఏమైన లోపములున్నయెడల చెప్పగలడు.

తొలిబిడ్డ విషయమున ఇట్టి లోపములు లేకుండ తలిదండ్రులు జాగ్రత్తపడవలెను. అనుభవములేమిని తొలిబిడ్డ విషయమున తలిదండ్రులు ఆతురత కలిగియుందురు. అనుభవము లేకపోవుటచే తలిదండ్రులు చిన్నతనమున బిడ్డలకుకలుగు ప్రమాదకరములగు వ్యాధులను ప్రారంభదశలో గుర్తింపజాలకుందురు. బిడ్డలను ఎత్తుకొనుటలో అలవాటులేక ఈ తొలిబిడ్డ నెత్తికొనినపుడు తల్లిచేతులు వణకుటయు అందుచే బిడ్డ ఏడ్చుచుండుటయు జరుగును. కలసిన జాగ్రత్తకంటె హెచ్చు జాగ్రత్త తల్లి చూపుటలో బిడ్డకు గారాబము మిక్కుటమగును. దివారాత్రములు అట్టిబిడ్డకు తల్లి చెంత నుండవలయును. అందుతో తల్లి ఆరోగ్యముచెడుట అసంభవము కాదు. తొలిబిడ్డకు మందలింపు ఉండని కారణముచేత అలవాట్లు త్వరగ పట్టుబడును. ముద్దుచేతనే ఇతరులకు చూపవలయునను కాంక్షచేతను తొలిబిడ్డకు గాఢనిద్ర లేకుండగచేతురు. తొలిబిడ్డ ఆయింట తన మాటకు హెచ్చు చెలామణియుండుట తెలిసికొని దానిని ఉపయోగించును. కాగా తొలిబిడ్డడు పెరిగి చిఱ్ఱుబుస్సులు—అసంతృప్తి—ఇవి స్వభావగుణములు కలవాడగును. పెరిగికూడ తలిదండ్రుల పరిశీలనమును, పోషణమును కోరును. అవి లభింపనిచో డీలపడును. లౌకికజీవనము చేయజాలడు, పలువురతో మైత్రికలిగి మెలగజాలడు. పెద్దఅబ్బాయి ముద్దుఅబ్బాయి అను సామెత ఈ సందర్భముచేతనే కలిగినది.

కావున తలిదండ్రులు తమ తొలిబిడ్డల పెంపకము విషయమున ఈ దోషములు కలుగకుండ మెలకువ వహింపవలయును.



శ్రీయుత వైద్యరత్న కాప్టెన్
జి. శ్రీనివాసమూర్తిగారు, బి.ఏ.బి.యల్.యం.బి.సి.యమ్.
[ప్రభుత్వ భారత దేశీయ వైద్యపాఠశాల అధ్యక్షులు.]

"ఆంధ్రభూమి"

౧.



ఛార్లెస్ యమ్ స్క్వాబ్. (బెస్సెమర్ మెడలుతో).

ఆంధ్రసాహిత్య పరిషత్తు
TELUGU ACADEMY, COCANADA

# ఛార్లెస్ యమ్ స్క్వాబ్

[సాధారణమైన కూలివాడు ఏడాదికి పదిలక్షలడాలర్ల వేతనముపొందు వణిక్పుంగవుడైన వృత్తాంతము]

1928-వ సంవత్సరము మే మాసమున ఒకానొక నాటి మధ్యాహ్నము లండనునందలి తమ కార్యాలయమున బ్రిటిషు ఇనుపవర్తకులు సమావేశమైరి. ఒక్కొక్క వర్తకుడు ఎందరో కూలివాండ్రకు యజమానిరై యుండెను. అట్టి వర్తకుల సమావేశము నిజముగ అపూర్వమైనదే. వారి సమిష్టియాజమాన్యమున బెస్సెమిర్ బంగారుపతకము గలదు. ఇనుపవర్తకులు ఇతరులకు చేయుగల గౌరవములలో ఈ బంగారుపతకము బహుమానముచేయుట శ్రేష్టతమైనది. ప్రస్తుతము ఆ వర్తకులు ఈ బంగారుపతకమును ఒకరికి బహుమానము చేయుటకే అచ్చట సమావేశమైరి. అంతటి అధిక గౌరవములకు పాత్రుడుకానున్న ఆ మహనీయుడెవరు? అతడే ఛార్లస్ యమ్. స్క్వాబ్. జీవితారంభమున అతడొక సామాన్యకార్మికుడు. ఆ దినములలో అతనికి దినమునకు నాలుగుషిల్లింగుల జీతము. అట్టివాడు తన ప్రజ్ఞచేత అమెరికాదేశపు వణిక్పుంగవులందును, కోటీశ్వరులందును అగ్రశ్రేణికి చెందకలిగెను. పదునేడేండ్ల ప్రాయమున సామాన్యమైన కూలివాడుగా నుండిన అతడు ముప్పదిరైదేండ్ల ప్రాయమున ఉక్కు-సామాను వర్తకులకు రాజు, అరువది ఆరేండ్లప్రాయమున అమెరికాసంయుక్త రాష్ట్రమునందలి ప్రముఖులలో అగ్రసరుడు, అట్టివాడైన ఛార్లస్ యమ్. స్క్వాబ్ జీవితకథ ఒక కట్టుకథవలె నుండును.

పెన్సిల్వేనియా యందలి గ్రామములలో నొకటియగు లోరెట్టో యందు అతని తొలిదినములు గడచెను. విద్యార్థిగా స్క్వాబ్ గణితశాస్త్రము, రసాయనికశాస్త్రము, ఎంజనీరింగుకళ వీనియందు మిక్కుటమగు అభిరుచి కలిగియుండువాడు. అతనికి పదునారేండ్లు వచ్చినవి. కుటుంబపు అక్కఱలు అతడు ఇంకను పాఠశాలకు పోవుటకు అడ్డు తగిలినవి. కాగా అతడు చదువుకు స్వస్తిచెప్పి ఉద్యోగమున ప్రవేశించినాడు. అతని మొదటి ఉద్యోగము ఎట్టిది? స్క్వాబ్ తండ్రి ఆ గ్రామమునుండి అచటికి చేరువనున్న రైలుస్టేషనునకు బండినడిపి కుటుంబపోషణము చేయువాడు. తండ్రి ఆహారము గొనునప్పుడు,అలసియుండు నప్పుడు ఛార్లెస్ బండినడపువాడు. అనగా బండితోలుట అతని మొదటి ఉద్యోగము.

పిమ్మట అతడు బ్రాడ్డాక్ నందలి ఒకానొక చిల్లర దుకాణమున పనివాడుగా ప్రవేశించెను. ఎంజనీరు కావలయునను గాఢమైన అభిలాషతోనున్న యువకునకు ఇది ఉత్సాహకరమైన ప్రారంభముకాదు. ఉత్సాహకరమైనది కాకపోయినను చెంత్తముమీద అదియొక ప్రారంభమే. ఏమన బ్రాడ్డాక్ నందు ది ఎడ్గార్ థామ్సన్ స్టీల్ (ఉక్కు-వర్క్సు) గలవు. అవి ఉక్కు-వర్తకులలో అతిలోకమైన ఖ్యాతిగాంచిన యాండ్రూ కార్నీజీకి చెందినవి. అవకాశము లభించినతోడనే చిల్లర దుకాణపు చీదర వదలించుకొని ఈ ఉక్కు-సామానుల కర్మాగారమున పని సంపాదించుటకు ఆ యువకుడు ఆయత్తుడై యుండెను. ఈలోగా చిల్లరదుకాణమున అతనికి వారమునకు ముప్పదిషిల్లింగుల సంబళము ముట్టుచుండెను.

చిల్లర దుకాణమునందలి పనిలో ఆ చుట్టుపట్టుల తనయంతటివాడు లేడను పేరుగొనుటకు అతడు నెలల తరబడి మిక్కిలి దీక్షతో పనిచేయువాడు. ఆ సమయమునకూడ తన మనస్సంతయు ఉక్కు-సామానుల కర్మాగారమునందే లగ్నమొనర్చియుండెను. కొద్దిరోజులలో తాను ఈ తేయాకు పేకెట్టులు మొదలగు వస్తువులను తూకనక్కఱ యుండకుండునని అతడు నమ్మువాడు. ఉక్కు-దూలములు, ఇనుపస్తంభములు తయారుచేయుట వంతెనలు నిర్మించుట,బ్రహ్మాండభవనములు కట్టుట—

ఇట్టి పనులకే తాను పుట్టువునొందితినను విశ్వాసము ఆ దినములలో కూడ అతనియందు ప్రగాఢమైయుండెను. అట్టి సుదినమెుక్క రాకకు అతడు ఓర్పుతో వేచియుండెను.

తుదకు అతనిఓర్పుకు తగినఫల మగుపడినది. ఆవర్క్సు కర్మాగారపు స్టోరుకీపరు ఏదియో కొన్ని వస్తువులు కొనుటకు ఒకనాడు ఆ చిల్లరదుకాణమునకు వచ్చెను. అదియే మంచిసమయమని చార్లస్ స్క్వాబ్ ధైర్యము తెచ్చుకొని ఆ వర్క్సునందు తనకేదైన ఉద్యోగ మిప్పించవలసినదిగా అతనిని ప్రార్థించెను. అందుమీద నాతడు చేయుటకు మిగుల కష్టమైన పనిని నేర్పుగని చేయగలవా అని స్క్వాబ్‌ను ప్రశ్నించెను. దానికి చార్లసు చేయగలనని చురుకుగాను కులుకుగాను జవాబుఇచ్చెను. దినమునకు నాలుగు షిల్లింగుల వేతనముపై చార్లస్‌నకు పనిఈయబడెను. ఒళ్ళు ముక్కలగునట్లు కష్టపడి పనిచేయువాడు. ఆవర్క్సునందు ఇతరులుచేయు పనుల తీరుకూడ ఒకకంట చూచుచు ఆనుపానులు ఆకళించువాడు. కార్మికులపై నాయకత్వము వహించి వారిచే పనిగొనుటలో నాతడు విశేషప్రజ్ఞావంతుడై యుండెను. కాగా ఆరువత్సరములు జరుగుసరికి సామాన్యమైన కూలివాడుగా ప్రవేశించిన స్క్వాబ్ ఆవర్క్సుకు సూపరింటెండెంటు ఆయెను. ఆదినములలో అమెరికా దేశమునగల ఉక్కుసామానులుచేయు పెద్ద కర్మాగారములలో నిదియొకటైయుండెను.

మఱియొకవత్సరము జరిగెను. అతనికి మంచి ఉచ్చదశపట్టెను. స్క్వాబ్‌నకు ఇరువదినాలుగేండ్ల వయస్సు, కార్నిజీ కంపెనీ కంతటికిని అతడు ఛీఫ్ ఇంజనీరు ఆయెను. అతనిక్రింద ఏడువేలమంది పనివాండ్రు. స్క్వాబ్ ఎట్టి సాంకేతిక విద్యాలాభముగాని లేని వాడనుచో ఈపనిని అతడు పొందుటలోగల అద్భుతము తేటతెల్లమగును. కళాశాలలకు పోయి ఉన్నత విద్యలనంది డిగ్రీలను సంపాదించుటకు వలయు ధనమున కాతడు నోచిపుట్టలేదు. అతనికి తెలిసినదంతయు అతడు తన ప్రజ్ఞచేతనే నేర్చుకొనెను. చూచి నేర్చుకొనువిద్య పేదవాలురకుకూడ అందుబాటైనదే కదా!

ఇంతవఱకు స్క్వాబ్ అభివృద్ధి సాధారణులకు విభ్రాంతి గొల్పునదియే. కాని అసాధారణ ప్రజ్ఞాధురీణుడగు అతడంతతో తృప్తినందలేదు. కార్నిజీ కంపెనీ యాజమాన్యమున క్రొత్తగా బిహోమ్‌స్టెడ్ స్టీల్ వర్క్సు ఏర్పడనుండెను. దానికి చార్లస్ మేనేజరు. భవనములు నిర్మించుట, వలయు సామానులతో ఆ భవనములను నింపుట, కర్మాగారము నేర్పఱచుట అతని పాలబడెను. ఆకాలమున ప్రపంచమున గల ఉక్కుసామానుల చేయు కర్మాగారములన్నిటిలోను పెద్దదైయుండెను. ఉపజ్ఞా మహితుడగు స్క్వాబ్ ఉత్తరగతి కర్మాగారముల చరిత్రలయందు అపూర్వవిషయము నొకదానిని ఈకర్మాగారమున ప్రవేశపెట్టెను. యంత్రమున ఒకదిక్కున ముడివస్తువువైచి నిరంతరము యంత్రమును పనిచేయించుచునే యుండి తుదకు అవ్వలి దిక్కున తయారైన వస్తువును తెప్పించుట ఈపద్ధతికి చార్లస్సే ఆద్యబ్రహ్మ. దీనివలన ఎంతయో కాలము కూడివచ్చునది. ప్రపంచమునందలి ఫాక్టరీలలో సగమునకుపైగా ఇపుడీ పద్ధతి అవలంబించుచున్నవి. ఈపద్ధతి అవలంబించుటవలన ఉక్కుసామానుల ఉత్పత్తి మామూలుకు రెట్టింపు అయినది. కాని స్క్వాబ్ ప్రారంభించిన రోజులలో నది సరిక్రొత్త. అందులో అమెరికను ప్రజలు స్క్వాబ్ సాధారణుడు కాడనియు, అతని మూలమున అమెరికా దేశమునకు విశేషఖ్యాతి రానున్నదనియు, సామాన్యులు చేయు కార్యములకంటె మిక్కిలి ఘనమైన పనులు చేయుటకే అతడవతరించెననియు తెలిసికొనిరి.

బృహత్పరిమాణముందిన కార్నిజీ సంస్థ కంతటికిని స్క్వాబ్ 1892-వ సంవత్సరమునాటికి మేనేజరు ఆయ్యెను. ఆదినములలో కార్నిజీ సంస్థలో గొప్ప సమ్మెకట్టు సంభవించెను. సమ్మెకట్టును సడలించి కార్మికులలోగల అసంతృప్తిని తొలగించు భారము చార్లసుపై బడెను. కార్మికులను నడుపుటలో అతడు అందెవేసిన చేయి కాగా సూర్యరశ్మికి మంచు విడిపోయినట్లు అతడు కలంగచేసికొనుటతో సమ్మెకట్టు విచ్చిపోయెను. సమ్మెకట్టును మాన్పించినందులకు ఫలముగా

కార్నీజీ కంపెనీకి స్క్వాబు అధ్యక్షుమహాశయుడయ్యెను. సామాన్యమైన కూలివాడుగా కర్మాగారమున ప్రవేశించిన యువకుడు పదునైదేండ్లు జరుగుసరికి ఆకంపెనీకి అధ్యక్షుమహాశయుడై నిచ్చెన యొక్క తుది మెట్టు ఎక్కినవాడయ్యెను. అమెరికాయందలి పలువురు వణిక్పుంగవుల జీవితకథలు అద్భుతమైనవే. కాని ఇంతత్వరగ ఇంతటి ఖ్యాతిని; ఇంతటి ధనమును అర్జించిన అద్భుత కథనము ఆ అమెరికాదేశమునసే మఱియొకటి కానరాదు.

ఈ అమెరికను ఉక్కు ఉత్పత్తిదారుని అతిలోకమైన అభివృద్ధిని బ్రిటీషు ఉక్కు ఉత్పత్తిదారులు తిలకించిరి. బ్రిటీషు ఉక్కు పరిశ్రమను పెంపొందించుటకు స్క్వాబు సేవను గొనుట వాంఛనీయమని బ్రిటీషు ఉత్పత్తిదారులు గ్రహించిరి. కార్నీజీకంపెనీని వదలి ఇంగ్లండునందలి బర్మింగుహామునకు తరలివచ్చుచో ఛార్లెస్‌నకు గొప్పమొత్తము ఇచ్చుటకు బ్రిటీషు ఉక్కు ఉత్పత్తిదారులలో నొకడు సిద్ధపడెను. కాని ఛార్లెసు దానికి మోహపడలేదు. కొలదిదినములకు పిమ్మట ఈ విషయము యాండ్రూకార్నీజీకి తెలిసెను. తెలిసిన తోడనే అతడు స్క్వాబ్ కడకువచ్చి అతనికి ఏడాదికి పదిలక్షల డాలర్ల వేతనమిచ్చు పద్ధతిమీద స్క్వాబ్‌చే బహుకాలవ్యాప్తమైన కాంట్రాక్టు వ్రాయించుకొనెను. ఏడాదికి పదిలక్షలడాలర్ల జీతము, వ్యాపారప్రపంచమున ఒకవ్యక్తికి ఈయబడు జీతములలో దీనికి మించినది నాటికి నేటికి మఱియొకటిలేదు.

ఈ కాంట్రాక్టు ఇతరులకు ఎంతయో విలువయైనదిగా కనిపించుచున్నది. స్క్వాబ్‌దృష్టిలో అది ఎట్టిది? అతనిదృష్టిలో అది ఎట్టిదియో క్రిందివృత్తాంతము చెప్పగలదు. అమెరికాసంయుక్త రాష్ట్రమునందలి ఉక్కు కర్మాగారములనన్నిటిని సమ్మేళనమొనర్చి ఒకటే ట్రస్టుగా ఏర్పాటుచేయుటకు 1900-వ సంవత్సరమున ప్రయత్నములు సాగింపనారంభించెను. అతని సంకల్పమున ఈ ట్రస్టునకు ప్రపంచమునందంతటను బ్రాంచీలుండవలయును; గుండుసూదులు మొదలు డ్రెడ్‌నాట్ల వఱకుగల సమస్తవస్తువులలో దేనికి ఆర్డరు వచ్చినను ఆ ట్రస్టు తయారుచేసి సరఫరాచేయగలిగి యుండవలయును. అమెరికాయందలి కుబేరులకందఱికిని తన సంకల్పమును చెప్పి తన పద్ధతికి వారు సమ్మతించునట్లు చేసెను. 1901-వ సంవత్సరమున యునైటెడ్ స్టేట్సు స్టీల్ కార్పొరేషను నిర్మింపబడెను. ఆ కార్పొరేషనునకు ఛార్లెసు స్క్వాబ్ ప్రెసిడెంటు. అందు 6,000,000 అరువదిలక్షల పౌనులవెలగల స్టాక్ అతనిది. అతని కప్పటికి ముప్పదితొమ్మిది ఏండ్లు.

కాని ఈ కార్పొరేషను నిర్మాణమునకు తోడుపడిన ధనికులకు—పీర్‌పాంట్ మార్గన్ మున్నగు వారికి—ఒక్కవిషయమున గుంజాలాటగా నుండెను. అది స్క్వాబ్‌నకుగల ఏడాదికి పదిలక్షల డాలర్ల జీతపు కాంట్రాక్టు. ఏడాదికి పదిలక్షలడాలర్ల జీతము. బంగారు భూమియగు అమెరికాదేశమునందలి కుబేరులు కూడ ఏ ఒక్కవ్యక్తియు అంతటి జీతమును పొందుటకు ఎఱుంగరు, వినియైనయుండలేదు. వారికి తెలిసిన వానిలో మిక్కిలి పెద్దజీతము ఏడాదికి ఒకలక్ష డాలర్ల విలువగలది. స్క్వాబ్‌జీతము దీనికి పదిరెట్లు విలువగలది. కాగా వారు గుంజాలాడుటలో ఆశ్చర్యము లేదు. వారి భయములను స్క్వాబ్ వినినాడు. ఏడాదికి పదిలక్షలడాలర్ల జీతము పొందగల తాహతు తన దగ్గఱలేదని వారు సందేహించుచుండుట గమనించినాడు. పదిలక్షలడాలర్లు విలువగల కంట్రాక్టు కాగితమును తనజేబునందు భద్రపఱచుకొని అతడు నేరుగా పీర్‌పాంట్ మార్గన్‌కడకు పోయెను. కంట్రాక్టు కాగితమును బయటికితీసెను. మార్గన్‌కు చూపెను. వెంటనే దానిని ప్రక్కన చింపివైచెను. మార్గన్ మొదలగువారు తాను ఎంతటిజీతము పుచ్చుకొనుటకు అర్హతగలదని తలంతురో అంతటి జీతమునుమాత్రమే పుచ్చుకొందునని అతడు స్పష్టముగచెప్పెను.

సినీమాలయందుగూడ మనమట్టి దృశ్యమును చూడజాలము. ఒకానొకప్పుడు సామాన్యమైన కూలివాడుగా నుండినవాడు. ఇప్పుడు అతని ఆస్తిని మదింపు చేయగా కోటికి అరువదిగ లెత్తినట్లు స్పష్టమయినది. ఇంతకును అతను వయస్సు మళ్లినవాడు కాడు, ముప్పది

తొమ్మిది ఏండ్ల ప్రౌఢప్రాయమున నున్నవాడు. అయినను తనకు ఏడాదికి పదిలక్షలుడాలర్లను గొనివచ్చు దస్తావేజును అలవోకగా చిత్తుకాగితము చింపినట్లు చింపివైచివాడు. గతవత్సరము తనకు ఆ కాగితము పదిలక్షలడాలర్లను కొనివచ్చినది. రాగల వత్సరము అందును అట్లే అది సవరు మొత్తమును కొనిరాగలదు. చేతులల అట్టి కాగితమును చింపివైచుటకు ఎంతటి ధైర్యముండవలయును? ఎంతటి సాహసముండవలయును? ఎంతటి త్యాగబుద్ధియుండవలయును? దానిని ధైర్యమనుడు, సాహసమనుడు, త్యాగమనుడు, కుదకు తలవెఱ్ఱియైన పనుపు. అట్టిది చేసినవాడు—అంతటి ధనసంపదను అలవోకగా త్యజించినవాడు ప్రపంచ చరిత్రలో ఛార్లస్ స్కాబ్ ఒక్కడే.

ఈ దృశ్యము పీర్‌పాంటు మార్గన్‌కు స్మారకము కలిగించినది. స్కాబ్ ఎట్టివాడో అతనికి తెలిసివచ్చినది. కంట్రాక్టు నిలిచియుండినచో ఛార్లెసునకు రావలసియుండు మొత్తము యావత్తు ఒక సెంటుకూడ వెలితి లేకుండ మార్గన్ అతనికి ఇచ్చినాడు. ఇంతేమను స్కాబ్‌నకు పోయినది ఏమి కులేదు. కాని ఎందఱు మనుష్యులట్లు గావింపగలరు? ప్రపంచమునందలి ఉక్కు సంస్థలలో పెద్దదియైన ఆ స్టీల్ కార్పొరేషనుకు అధ్యక్షుడుగా అతడు నాలుగుసంవత్సరములు పనిచేసెను. ఇంతలో అతని ఆరోగ్యము బొత్తిగా చెడిపోయెను. అగుటచే నాతడు తన అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చెను. నలుబదిరెండు వత్సరముల నడిప్రాయముననే అమెరికాదేశపు వ్యాపారశిఖామణులలో నొకడగు స్కాబుచరిత్ర ముగిసినట్లు కన్పట్టెను.

ముగిసినట్లు కనపడినదనుకొనినవారు పొఱపడిరనియు వారు స్కాబు సంగతి బాగుగ గ్రహింపజాలక పోయిరనియు చెప్పవలసియున్నది. ఆరోగ్యము కుదుటబడి స్వస్థచిత్తుడైనతోడనే అతడు విశ్రాంతి గొనవలయునను తన తలంపును విడనాడెను. తన కాలము, బుద్ధి పూర్తివినియోగమునకు రాగల పనికై అతడన్వేషింప నారంభించెను. ఆ అన్వేషకుని దృష్టులు పెన్‌సిల్‌వేనియా యందలి బెత్లిహెమ్‌లోని ఒకానొక చిన్న ఉక్కుకర్మాగారముపై బడెను. తోడనే దానినాతడు తన యాజమాన్యముక్రిందకు తీసికొనివచ్చెను. ఛార్లెస్ ఆ కర్మాగారపు యాజమాన్యము వహించునప్పటికి అది దివాలాతీయు స్థితిలో నుండెను. తాను విశేషశ్రమకోర్చి నిర్మించిన బ్రహ్మాండమగు ట్రస్టుతో దివాలాతీయు స్థితిలోనున్న ఈ కర్మాగారము పోటీపడవలసియుండును. అయితే ఇందును గూర్చి అతడెంతమాత్రమును విచారింపలేదు. లోగడ స్టీలు కార్పొరేషను నిర్మాణమున తన భుజములుకలిపి పనిచేసిన శాస్త్రవేత్తలను ఈ క్రొత్త కర్మాగారమునకు ఆకర్షించు అవజ్ఞతకు కూడ అతడు పాలుపడలేదు. ఆ కర్మాగారమున అవటికే పనిచేయుచుండువారిలో పదునైదుగురు యువకులను—తెలివైనవారిని పిలిచి వారిని అందు భాగస్వాములుగ నొనర్చెను. వత్సరములకు పూర్వము కార్నెజి తనకిచ్చిన అవకాశమునే ఇప్పుడాతడు ఈ పదునైదుగురు యువకులకు ఇచ్చెను.

ఆ పదునార్గురు కలిసి అరమరలులేక పనిచేయువారు. పని పెందలకడ ప్రారంభించువారు. ఆలస్యముగ ముగించువారు. బెత్లిహెమ్ వర్క్సును లాభకరముగా నొనర్చుదీక్ష. కోట్లుతీసి కొంకెలకుపెట్టి ఎనిమిది గంటలపాటు గడియారమును మఱచి వారు పనిచేయవలసియుండెను. ఇందులో ఒక్కొక్కప్పుడు డబ్బు చిక్కులు. కర్మాగారము మూయవలసివచ్చుట ఖాయమే అనిపించు పరిస్థితులు తఱచుగా కలుగుచుండునవి. కాని ఒడుదొడుకులన్నియు గడచి కర్మాగారము కొనసాగెను.

తన భాగస్వాములతో సమముగ ఛార్లసు స్కాబ్‌కూడ కష్టపడి పనిచేయువాడు. తనకు ఈ ప్రపంచమునగల ఆస్తినంతటిని—చిల్లిగవ్వవంటి చిన్ని వస్తువైనను సయితము—ఈ వ్యాపారమున పెట్టుబడి పెట్టినాడు. తాను అప్పు తేగలిగినంతధనమును తెచ్చి దానినికూడ పెట్టుబడి పెట్టినాడు. బెత్లిహెమ్ కర్మాగారము నెగ్గనిచో స్కాబ్ తన యింటినికూడ అమ్ముకొని జీవితము తిరిగి ప్రారంభింపవలసియుండును. వతి క్ష్వంగవులు తఱచు ఎదుర్కొనవలసియుండు అపాయ

భయము లిట్టివే.

బెత్లిహెమ్ కర్మాగారము దివాలాతీయలేదు, దిగజాఱలేదు. క్రమముగా అభివృద్ధిమార్గమున బడినది. 1914-వ సంవత్సరమునాటికి ఆ కర్మాగారము ప్రపంచమునందలి ఉక్కు కర్మాగారములలో రెండవది అయెను. మొదటిది శ్వాబ్ నిర్మించిన మొదటిస్టీలు ట్రస్టే. ఇట్లు ప్రపంచమునందలి మొదటి, రెండవస్థానము లాక్రమించు ఉక్కు కర్మాగారములకు అతడే స్థాపనాచార్యుడయ్యెను.

1914 లో యూరోపియను మహా సంగ్రామము ప్రారంభమయినది. మిత్రమండలివారు ఉక్కుసామానులను, మందుగుండు సామానులను ఆర్డరుమీద ఆర్డరు ఇచ్చుచుండిరి. అప్పుడు అమెరికాదేశమునుండి వచ్చు ఇతరమయిన ఆర్డరుల నన్నిటిని మానివైచి జగత్కల్యాణము కొఱకు యుద్ధముచేయుచున్నారని తాను భావించిన మిత్రమండలివారికి ఉక్కుసామానులు, మందుగుండు సామానులు సరఫరాచేయుటలో తన కర్మాగారమున దివారాత్రములు పనిసాగించెను. అమెరికాదేశమున తమకుగల ప్రతినిధివర్గముచే జర్మనులు శ్వాబ్‌నకు వర్తమానముచేసిరి. బ్రిటనునకు ఫ్రాంసునకును యుద్ధమునకు వలయు ఉక్కుసామగ్రిని, మందుగుండు సామానును సరఫరాచేయుట మానివైచి అమెరికా దేశమునుండి వచ్చు ఇతరమయిన ఆర్డరులను నిర్వహించుటకు మాత్రము తన కర్మాగారమును వినియోగించుచో శ్వాబ్‌నకు కొలది ఇడరాని ధనరాశినిత్తుమని తనకు ఏడాదికి పదిలక్షల డాలర్లను కొనివచ్చు కంట్రాక్టునే నిర్లక్ష్యముగా చింపివైచిన వారినికూడ తలతిరుగ చేయు విశేషమొత్తమును జర్మనులు ఈయగలమనిరి. కాని శ్వాబ్ దానిని కాలదన్ని వారికిట్లు బదులిడితినని చెప్పెను: 'బ్రిటనునకును, ఫ్రాంసునకును ఉక్కుసామగ్రి, మందుగుండు సామాను సరఫరాచేయుటకు నేను కృతనిశ్చయుడనైతిని. నానిశ్చయమును మాన్పించుటకు సరిపోవు ధనము; యూరపుఖండము మొత్తము మీదనే లేదని వారికి చెప్పితిని. వ్రాతమూలకమగు ఎట్టి ఒడంబడికయు లేకనే: నేను గ్రేటుబ్రిటనుతో లక్షలాది పౌనుల విలువగల వ్యాపారములను చేసితిని. అట్టి వ్యాపారములందు ఒక్కసారికూడ తగాదా కాని, కష్టముగాని నాకు కలుగలేదు.'

యుద్ధకాలమున బెత్లిహెమ్ కంపెనీవారు నిర్వహించిన ఆర్డరుల మొత్తపువిలువ 100,000,000 (పది కోట్లు) పౌనులు. అమెరికా సంయుక్త రాష్ట్రమునందలి ఓడలను కట్టు కర్మాగారములలో సగమునకుపైగా బెత్లిహెమ్ కంపెనీకి చెందినవే. అందలి పనివాండ్ర సంఖ్య లక్షమంది. ఏడాదికి ఆకర్మాగారమున ఎనుబది లక్షల టన్నుల తూకముగల ఉక్కు తయారగును. గ్రేటుబ్రిటను మొత్తముమీద తయారగు ఉక్కుకంటె కూడ ఈ కర్మాగారమున తయారగు ఉక్కు మొత్తపు తూకమే హెచ్చు.

అంతటి వ్యాపారమును నిర్మించుట పూర్ణపురుషాయుష్యజీవియగు వానికే బ్రహ్మాండమైనపని. కాని శ్వాబ్ తన నలుబదిరెండవయేట పూర్వపు వ్యాపారమునుండి విరమించిన పిమ్మటను—ప్రపంచమునకు తెలిసిన స్టీలు కార్పొరేషనులలో అగ్రస్థానము వహించిన యునైటెడ్ స్టేట్సుస్టీలు ట్రస్టును నిర్మించిన పిమ్మటను—ఈ బ్రహ్మాండ వ్యాపారమును నిర్మించినాడు. వారమునకు ముప్పది షిల్లింగుల జీతముపై ఛార్లెస్‌ను తనకుకోణమున పనికుదిర్చిన ఆనాటి చిల్లరవర్తకుడు ఈనాడుకూడ బ్రతికియుండుచో శ్వాబ్‌ను గూర్చియు, అతని ఇప్పటి వ్యాపారమునుగూర్చియు ఏమనుకొనునో?

నేడు తన అరువదిఆరవఏట కూడ ఛార్లెస్ శ్వాబ్ ఆరోగ్యవర్ధనుడు, చలాకి అయినవాడు అయి ఉన్నాడు. ఉక్కుపరిశ్రమలో ఒకడు పొందగల బహుమానములలో మిక్కిలి విలువగలది బెస్సెమర్ బంగారు పతకమును బడయుటకు అతడు లండను మహానగరమును దర్శించినపుడు జీవితారంభమునను యువకుల ఉపయోగార్థము తన జీవితతత్త్వమును గూర్చి ఇట్లు చెప్పెను. 'నెత్తిపడవద్దు. ఆనందమయ చిత్తముతో నుండుడు. నవ్వుచునే జీవితయాత్ర నడుపుడు. చలాకిగ నుండుటను అలవరచుకొనుడు. దేనినిగాని దీర్ఘముగ

చింతింపవలదు. గొప్పవారు గొప్పవారగుటకే పుట్టిరను నమ్మకము నాకులేదు. ఎవరైనను అవకాశముండునో ఈప్రపంచమున గొప్పవారు కాగలరని నావిశ్వాసము.' తన ఆరోగ్యవిధులనుగూర్చి అతడిట్లు చెప్పెను. 'రాత్రి తొమ్మిదిగంటలన్నరకు నేను విధిగా పండుకొందును. ఉదయము ఆరుగంటలన్నరకు తప్పక నిద్రమేల్కాంతును. నేను చుట్టకాల్చను—అప్పుడప్పుడు సంఘమర్యాదవిధుల ననుసరించి తప్ప నేను మద్యము త్రాగను, పొగత్రాగకూడదని నా అభిప్రాయముకాదు. కాని నేను మాత్రము పొగత్రాగుటకు అలవడలేదు.'

ఉక్కు పరిశ్రమలో నితడు అద్వితీయుడు కావున ఇతనికి ఉక్కురాజు అను పేరువచ్చినది. ఆ ఉక్కురాజుయొక్క చరిత్రమట్టిది; అతని జీవితక్రమమట్టిది. అతని చరిత్ర ప్రతియువకుడును చదువతగినది. ఒక్క అవకాశము తక్క నేను మనకులేని ఏ ఒక్క అవకాశమును అతడు కలిగియుండలేదు. అతడు ఉక్కువ్యాపారము ప్రారంభించిన దినములలో అది విస్తృతినందు తరిలో నుండెను. సూక్ష్మగ్రాహియగు స్క్వాబ్ దీనిని గ్రహించెను. కాగా అతడు సామాన్యుడగు కూలివాడుగా నుండిపోవుటకు అంగీకరింపలేదు. అతడు సోమరితనమనునది ఎఱుంగక అన్నిగంటలు పనిచేయువాడు. కూలివాని విలువకు అతనివిలువ మీఱిపోయినది. ఇదియే అతని జీవితమునుండి మనము గ్రహింపదగు గుణపాఠము. సామాన్యుడవైయుండుటలో తృప్తిపడకుము. ప్రవాహమున వచ్చితీరవలయునీతిని శ్రమపడి నీ విలువను పెంచుకొనుము. అవకాశము లభించునో క్రమాభివృద్ధి నందుచున్న ఒక క్రొత్త పరిశ్రమలో ప్రవేశింపుము. ఆపరిశ్రమ దినదినము నిపుణులను ఎక్కువగ కోరునదిగా నుండవలయును. కాని ఏడాదికి పదిలక్షల డాలర్ల (రెండులక్షల పౌనుల) వేతనముగల కాంట్రాక్టు పొందుటకుమాత్రము ఆశింపవద్దు. అట్టి కాంట్రాక్టు ప్రపంచమున మఱియొకడెవ్వడును ఇంతవఱకు పొందియుండలేదు. అంతటివేతనము పొందుటకు ఛార్లెస్ యమ్. స్క్వాబ్ తగినవాడు కావున దాని నాతడు పొందినాడు.

## కృష్ణమ్మ

౧

నాచిన్ని కృష్ణమ్మ
నడిపించు ముచ్చటలు
లోకమ్ము మరపించు
నాకమ్ము తలపించు

౨

బాబు నాచంకెక్కి
ఫక్కున్న నవ్వినా
పడిన ముత్యాలతో
ఒడియంత నిండించు॥ నా॥

౩

అలక చాలులలోన
ఒలుకు నీలాలెల్ల
దరహాస చంద్రికల
తళతళన మెఱపించు॥ నా॥

౪

చిఱుగజ్జె మ్రోయంగ
చిఱుబొజ్జ కదలంగ
నటియింప కృష్ణమ్మ
నటియించు జగమెల్ల॥ నా॥

౫

ఒయ్యార మొలయంగ
ఊదెనా వంశమ్ము
పదునాల్గు భువనాల
పాటలో పులకించు॥ నా॥

—కందుకూరి రామభద్రరావుగారు బి. ఏ.

# శబరీసమాగమ వర్ణనము

[వాల్మీకి రామాయణము - అధ్యాత్మ రామాయణము]

శ్రీరామచంద్రుడు శబరి ననుగ్రహించిన సన్నివేశవర్ణనము వాల్మీకిరామాయణము నందును, అధ్యాత్మ రామాయణము నందునుకూడ కలదు. కాని యీ సన్నివేశమునకును ప్రధాన కథకును సంబంధము కలుగుటనుబట్టి చూచినను ఈ సన్నివేశమునందుగల వర్ణనావైదగ్ధ్యము, పాత్రౌచిత్యము మున్నగు నుత్తమ కవిత్వ లక్షణములనుబట్టి చూచినను వాల్మీకిరచనము మహత్తరముగ గానవచ్చుచున్నది.

వాల్మీకి రామాయణములో శబరీ సమాగమునకును ప్రధానకథకును ఎట్టి సంబంధము కల్పింపబడలేదని యధ్యాత్మరామాయణకర్తకు తోచియుండవచ్చును. అందువలన తాను క్రొత్తగ సంబంధము కల్పవలెనని భావించి వాల్మీకి కబంధునిచే చెప్పించిన సుగ్రీవుని వృత్తాంతము నాతడు శబరిచే చెప్పించి ప్రధానకథకును దానికిని ఒకవిధమైన సంబంధము కలిపించెను అట్లు చేయుటచే నాతడు వాల్మీకి రామాయణమునకు మెఱుగుపెట్టినట్లు తోచవచ్చును. కాని సూక్ష్మముగా నాలోచించినచో వాల్మీకి శబరీ సమాగమమున కంతకంటె మహత్తర ప్రయోజనము గల్పించినాఁడు. సముద్రమువలె నెడతెగకుండనున్న శ్రీరాముని సీతావియోగ శోకమునకు వాల్మీకిరామాయణమున శబరీ సమాగమ మొకద్వీపమువలె నున్నది. మతంగాశ్రమమునందలి ప్రకృతి అత్యంత రమణీయమైనది. ఇంతియ కాదు. పరమపవిత్రమైనది, ఈ పవిత్రప్రదేశమున నడుగుపెట్టగనే శ్రీరాముని మనస్సు విలక్షణమైన యొకమార్పునంది తాత్కాలికమైన యుపశాంతి ననుభవించెను. అయితే అచ్చటి బాహ్య ప్రకృతియొక్క రామణీయకత నాత డితరుల సాహాయ్య మక్కఱలేకుండగనే గ్రహింపగలడు. వైడూర్య వర్ణము గల సుఖశీతలోదకములచే నలరారు పంపాసరస్సు దానిలోనుండి బయలువెడలు పిల్లతెమ్మెరలు దానిచుట్టును నెలకొన్న వివిధపుష్పఫల విరాజితములగు తరుషండములు, సరోవరమునందలి నీటి యానచే నచ్చటికివచ్చు వన్యమృగములు—ఇవి యన్నియు శ్రీరామునికి తమంతతామే గోచరింపగలవు. ఇవి శ్రీరాముని మనస్సున కొకవిధమైన భౌతిక సంతోషము నొడగూర్పగలవు.

కాని నిజమైన యాధ్యాత్మికానందము లభించి రాముని మనస్సు గాఢముగ పరవశము కావలెనన్నచో మతంగాశ్రమ మాహాత్మ్యము నాతడు పూర్ణముగ గ్రహింపవలెను. అట్లు గ్రహించుటకు వానిని ప్రత్యక్షముగాచూచిన శబరినోటనే దాని మాహాత్మ్యము నాతడు వినవలెనుగాని యితరుల నోట విన్నచో లాభము లేదు. శబరి సందర్శనము, సంభాషణము—ఈ రెండునుకూడ దుఃఖరోగార్తుడగు శ్రీరామునికి మహౌషధ ప్రాయములే. 'ఈ వేదికయందు మా గురువులు హోమములు చేయువారు. వారి

మాహాత్మ్యమువలన నీ యగ్నిహోత్రము లింకను దశదిక్కులను ఎట్లు వెలిగించుచున్నవో చూడుము—ఇచ్చో మా గురువులు పుష్పోపహారమును గావించిరి. ఆ పుష్పములింకను ఎట్లు వాడిపోకుండనున్నవో చూడుము! సంకల్పబలముచేతనే సప్త సముద్రములను నిచ్చటికి రప్పించుకొని మా గురువు లిందు స్నానమొనర్చిరి. ఆ సప్తసముద్ర తీర్థమిదిగో యిచ్చటనున్నది. ఆనాడు స్నానముచేసి యారవైచిన మా గురువుల వల్కములు యింకను ఎండకుండనట్లు నిలచియున్నవో చూడుము.' అని యొక్కొక్క ప్రదేశమునే చూపుచు తాను ప్రత్యక్షముగా చూచిన తన గురువుల మాహాత్మ్యము వర్ణించుచు క్షేత్రమాహాత్మ్యమును విశదీకరింపచేయుటచే శబరీ సమాగమమునకును, ప్రధాన కథకును సంబంధమేర్పడుచున్నది. ఇది సూక్ష్మమును ఉత్తమమును అగు ప్రయోజనము కాదా! వ్యాధిపీడితుని కారోగ్యనిలయు (శానిటోరిమ్) సేవన మెంత లాభకారియో నాధిపీడితుడైన శ్రీరామచంద్రునకు మతంగాశ్రమ విహారము శబరీ సమాగమమునంత ప్రయోజన కారులు.

వాల్మీకిరామాయణమునందు శబరీ సమాగమవర్ణనమును మనము రెండు స్థూల విభాగములుగా జేసికొనవచ్చును. (1) శబరి నివసించు నాశ్రమమునందలి ప్రకృతి వర్ణనము (2) శబరీసమాగమ వర్ణనము. అధ్యాత్మరామాయణమునందీ ప్రకృతి వర్ణనము కనుపట్టదు. ఈ ప్రకృతివర్ణనమువలన వాల్మీకి యొకగొప్ప ప్రయోజనమును సాధించెను. అది శబరీ సమాగమమునందలి సౌందర్యమునినుమడింపఁ జేయుచున్నది. రత్నములు కనకములో పొదిగినట్లు మహాత్ముల సమావేశమున కొక రమ్యప్రదేశమున నాశ్రమముగ సృజించి దానిని విపులముగ వర్ణించుటకంటె వైదగ్ధ్యమేమున్నది? రామాయణమునందలి ప్రకృతి వర్ణనములన్నియు మనోహరములేయైనను వానిలోఁగూడ మతంగాశ్రమ ప్రకృతివర్ణనము మఱియు మనోహరమైనది. ఆ ప్రకృతిని కనులార చూచిన శ్రీరామచంద్రుని కెట్లున్నదో మనము చెప్పఁజాలము కాని దాని వర్ణనము చదివినంతనే పంపాసరోవరమునుండి వీతెంచు పిల్లతెమ్మెరలు మన శరీరమును తాకుచున్నవా యనునట్లున్నవి. ఎంతగ కలుషితమైన చిత్తమైన ప్రసన్నమై ముందురాబోవు పవిత్రసమావేశ వర్ణనమునకు సంసిద్ధమగుచున్నది. ఇంకొక విశేషమునుగూడ మనమిచ్చట చూడవచ్చును. స్థూల ప్రకృతివర్ణనమంతయు కవి కబంధునినోటనుంచి యాతనిచే నాశ్రమమాహాత్మ్యము నించుక సూచింపఁ జేసినాడు. ఆశ్రమమాహాత్మ్య విపులీకరణమంతయు శబరినోటనున్నది. ఎవరికి తగిన భాగమును వారిచేఁ జెప్పించుటలోఁగూడఁ గవిచూపిన యౌచిత్యజ్ఞానమునకు చదువరు లానందింపఁ దగును.

ప్రకృతి వర్ణనమును విడిచిపెట్టి ప్రధానాంశమునకు వత్తము. శబరికి శ్రీరామచంద్రునికి నధ్యాత్మరామాయణములో రెండు విషయములనుగూర్చి సంభాషణము నడచినది. మొదట శ్రీరామచంద్రుడు శబరికి భక్తియోగము నుపదేశించెను. తరువాత శబరి శ్రీరామచంద్రునకు సీతాన్వేషణ సాధనము నుపదేశించెను. ఈ రెండంశములుగూడ వస్తుగౌరవమునకంత ప్రబోధకములుగా లేవు. లోకమునకు శ్రీరాము

నిచే భక్తియోగమును బోధింపఁజేయవలె నను నుత్సాహములో శ్రీరామచంద్రుడు సిద్ధురాలితో మాటాడుచున్నాడను మాట నధ్యాత్మరామాయణకారుడు విస్మరించినాడు. సద్గురుముఖమున భక్తియోగమును సాకల్యముగ నభ్యసించి యనుభూతిచేఁగూడ దానిలో పరిణతినంది జన్మసాఫల్యము సంపాదించిన నిర్యాణమున కున్ముఖురాలయియున్న శబరికి క్రొత్తగ శ్రీరామచంద్రునిచే భక్తియోగోపదేశమును జేయించుటలో శ్రీరామచంద్రుని యౌచిత్య జ్ఞానమునకుగాని శబరి యనుభవజ్ఞానమునకు గాని తగిన గౌరవమీయలేదు. యోగీశ్వరి యగు శబరికిని యోగేశ్వరుఁడగు శ్రీరామచంద్రునికిని జరిగిన సమావేశమును యదార్థముగ చిత్రించుటకుఁ జాలిన యోగదృష్టి కవికి లేకపోయినది.

ప్రప్రథమున శ్రీరామచంద్రునికి శబరికి నడచిన ప్రశ్నోత్తరములను వాల్మీకి యెంతో చమత్కారముగా వర్ణించినాడు.

శ్లో॥ కచ్చిత్తే నిర్జితావిఘ్నాః కచ్చిత్తే వర్ధతేతపః
కచ్చిత్తే నియతః క్రోధ ఆహారశ్చత పోధనే
కచ్చిత్తే నియమాః ప్రాప్తాః కచ్చిత్తే మనస్సుఖమ్
కచ్చిత్తే గురుశుశ్రూషా సఫలా చారుభాషిణి!

'విఘ్నములను జయించితివా? ఇంద్రియములను శాసించితివా? తపస్సు వర్ధిల్లుచున్నదా? నీకు మనశ్శాంతి చేకూరినదా? నీగురుశుశ్రూష ఫలించినదా?' అని శబరిని శ్రీరామచంద్రుఁడు కుశలప్రశ్న చేసెను. ఆతడు శబరిమనస్థ్సితి యెట్టి పరిపక్వదశకు వచ్చెనో యామెను చూచియు చూడకుండ గనే గనిపెట్టి పై ప్రశ్నలు వైచినాడు. దాని కామెయిచ్చిన ప్రత్యుత్తరముగూడ ననమాన సౌందర్యముగలది. 'సాసిద్ధా సిద్ధసమ్మతా' అని యామెను వాల్మీకి వర్ణించినాడు. ఆమె యిదివరకే సిద్ధురాలట. ఆవిషయమున నామెకుఁగాని యితరులకుఁగాని యనుమానముండుట కవకాశము లేకుండ 'సిద్ధసమ్మతా' యని వర్ణించినాడు. సిద్ధులు వచ్చి యామె సిద్ధురాలని యంగీకరించినారట. విద్యార్థులకు పరిషన్మండలివారొసగుపట్ట (యూనివర్సిటీ డిగ్రీ) యెట్టిదో శబరికి సిద్ధుల యంగీకార మట్టిది. బ్రహ్మవిద్యయందు పట్టభద్రురాలయిన శబరి శ్రీరామచంద్రున కేమని ప్రత్యుత్తరమిచ్చుచున్నది?

శ్లో॥ అద్యప్రాప్తా తపస్సిద్ధి స్తవ సందర్శనాన్మయా
అద్య మే సఫలంజన్మం గురవశ్చ సుపూజితాః॥
చక్షుషా తవసౌమ్యేన పూతాస్మి రఘునన్దన
గమిష్యామ్య యక్షయా న్లోకాం స్త్వత్ప్రసాదా
దరిన్దమ!

'ఇదివరలో నేనుపొందిన తపస్సిద్ధి నొకసిద్ధిగా గణింపను. ఇప్పుడు నీదర్శనము వలన నాతపస్సు నిజముగా సిద్ధించినదని భావించుచున్నాను. నీ సౌమ్యదృష్టిలో స్నానమాడుటవలన నేను పవిత్రనైతిని. నీదయవలన నక్షయలోకములు నాకు లభింపగలవు.' శబరికి శ్రీరామచంద్రునియందుగల భక్తి నీ మూడుమాటలలోను కవి యెంత వ్యంగ్యప్రధానముగా చిత్రించినాడు. నీవప్రమేయుడవని కాని, యాదిపురుషుడవని కాని, త్రిలోకగురుడవని కాని. సచ్చిదానందమూర్తివని కాని శబరి శ్రీరాముని స్తుతింపలేదు. పురాణ స్తుతులలో నున్న పెద్దపెద్ద వేదాంత వాక్యములు తమ్ము గైకొనవలసినదని తమంతగ వాల్మీకియొద్దకు వచ్చి ప్రార్థించుచున్నను వాల్మీకి వానిలో నొక్కదానినైన గైకొనలేదు. కాని మొదటిశ్లోకార్థమును

వచింపఁజేయుటలో ఎంత సౌకుమార్యము, ఎంత మార్దవము, ఎట్టి గౌరవప్రపత్తులను కవి స్ఫురింపజేయుచున్నాడు. ఇక రెండవ శ్లోకము మఱింత శ్లాఘనీయముగా నున్నది. అవతారమూర్తుల కటాక్షముల నుండి యమృతతేజము సదా జాహ్నవీనదివలె ప్రవహించుచుండును. ఇది సిద్ధులకు మాత్రమే గోచరము. 'నీ దృష్టులనుండి వెల్వడు సౌమ్య తేజమున నేను స్నానమాడుచున్నాను' (నీ సౌమ్యదృష్టిచే నేను పవిత్రనైతిని.) అని ధ్వని ప్రధానముగాఁ జెప్పించుటచే కవి శబరియొక్క గౌరవము నెంత చిత్రముగా పోషించినాడు. మహాత్ములైన వారి సమావేశముల నధిక ప్రసంగము పనికిరాదు. ఒండొరులను చూచుకొనుటతోడనే వారలు పరవశులగుదురు. ఈ రహస్యము మహాత్ములైన వాల్మీకికే తెలియవలెను గాని యితరులకెట్లు తెలియఁగలదు?

ఈ యుత్తమ సన్నివేశ గౌరవమును వాల్మీకి యింకొక విధముగాకూడ పోషించినాడు. శ్రీరామచంద్రునితో శబరి కాని శబరితో శ్రీరామచంద్రుఁడు కాని సీతావియోగమునుగూర్చి యొక్కమాటయైన ముచ్చటింపలేదు. వారెంతసేపును మతంగమహాత్మ్యవర్ణనమును పుణ్యకథా కాలక్షేపమునే గావించిరి కాని యింకొకవిధముగ మనస్సును బోనీయలేదు. సీతను గోల్పోయిన వెనుక మరల సీత లభించువరకు రామచంద్రమూర్తి యింతటి మనస్సమాధానము నెచ్చటను జూపింపలేదు. దీనికి కారణము లేకపోలేదు. మహాత్ములు మహాత్ముల సందర్శనము వలన తన్మయత్వమునందుదురు. అందుచే వారి మన స్సుత్తమ భూములలో (హయ్యర్ ప్లేన్స్) సంచరించును కాని యధోగామిని కాఁజాలదు. వారి కట్టి సందర్భములందు తక్కిన యైహికవిషయముల మాట యటుండగా శరీరమే విస్మృతమగును. కేశవచంద్రసేనుకు చాల జబ్బుగానున్నాడని శ్రీరామకృష్ణ పరమహంస యొకసారి యాతనిని చూడబోయెనట! అప్పటికి కేశవచంద్రసేనుని యాప్తులెల్ల కేశవచంద్రసేనుడింక జీవింపడని నిరాశ జేసికొనిరి. తామొండొరులను జూచుకొనుట కదే కడపటిసారి యని యా మహాపురుషు లిరువురికుగూడ తెలియును. అన్యోన్యానురాగమున వారిరువురకు లోపము లేదు. కాని సుమారు మూడు గంటలవఱకు వా రొండొరులతో ముచ్చటించుకొన్నను అంతటి దీర్ఘసంభాషణమున నొక్కమాటయైన కేశవచంద్రుని రోగమునుగూర్చి కాని శీఘ్రములో తమకుఁ గలుగఁబోవు వియోగమునుగూర్చి కాని లేదట! అట్టిచో శబరివంటి యేకాంతిక భక్తురాలిని సందర్శించినపుడు శ్రీరాముడును, శ్రీరామునివంటి తేజోనిధిని చూచినపుడు శబరియు పరవశులై తమ దేహములను మరచిపోయి యాత్మానందమున నోలలాడుచు సత్కాలక్షేపముననే ప్రొద్దుపుచ్చిరనుటలో నాశ్చర్య మేమికలదు? ఈ రహస్యమును గనిపెట్టియే వాల్మీకి సుగ్రీవవృత్తాంతమునంతను కబంధునిచేతనే జెప్పించినాఁడు.

—నండూరి బంగారయ్య బి. ఏ.

# రైల్లో నిద్రపోవడాన్ని గురించి

రైలు ఎక్కడంలో ఉద్దేశం అందరికీ ఒక ఊరు నుంచి మరో ఊరు వెళ్ళడమే అను నిర్ణయంతో నేను ఏకీభవించలేను. నిద్రపోవడం ప్రధానంగాను, ఊరు వెళ్ళడం అప్రధానంగాను రైలు ఎక్కే ఒక జాతి మనుష్యులున్నారు. అట్టి జాతిమనుష్యుల్ని నేను చాలా మందిని చూచాను. మీరుకూడా కొందరిని చూచి ఉండకపోరని అనుకుంటున్నాను. చూచి ఉన్నా, తమరు - నిద్రపోవడానికే కొందరు రైలుఎక్కుతారని నేనంటే ఒక పట్టాన్ని నమ్మరు. 'పట్టాలమీద చక్రాలు పరుగున తిరిగేటప్పుడు పుట్టే భరింపరాని చప్పుడు - దీనికితోడు నడుమ ఇంజన్ మహాశయుని ఈలబొబ్బలు-ఈరెండింటిని మించినది దిగేవారు ఎక్కేవారు చేసే సంతగోలను మించే రణగుణధ్వని నిద్రపోకుండా నిట్టరాడుల్లా కూర్చుని ఉబుసుపోక ఊసులాడే ప్రజల వికార కంఠస్వరములు - పోదామంటే మాత్రం ఎల్లా నిద్రపడుతుందయ్యా అని ఇంట్లో చంటిపిల్ల క్యారుమన్నా, చీమచిటుక్కుమన్నా, బల్లసరంబీ మీద పిల్లి నడిచినా, అనుతెలియక కొత్తకోడలు తలుపు గడియవేయటంలో కించిత్తు చప్పుడుచేసినా, ముసలమ్మ చూపుఆనక నీళ్ళబిందిమీద మూతఎత్తివేసి ధ్వనిచేసినా ఇక ఆరాత్రికి రెప్పవేయకుండా ఉండే మా పొరుగింటి శివావధానులు వంటివారు ప్రశ్నింపవచ్చు. పాలసముద్రం కెరటాలహోరులో - పాన్పుగా ఉన్న ఆదిశేషుడు తన వేయితలలతో బుసకొట్టుచుండగా - గళ్ళుగళ్ళుమనే లక్ష్మీదేవి నిరంతరము పార్శ్వవర్తిని అయిఉండగా విష్ణుమూర్తివారు నిద్రపోతారను పురాణకవుల వ్రాతలు నమ్మినప్పుడు చక్రాల చప్పుడులో - ఇంజను ఈల ధ్వనిలో - పాసెంజర్ల గోలలో నిద్రపోయే విష్ణుమూర్తులు నేటి ఈపిసప కాలంలోకూడా ఉన్నారను నామాటలు నమ్మకతీరదు అని మాశివావధానులు వంటి వారికి నేను చెప్పే సమాధానము.

అసలు ఏ పరిస్థితుల్లో అయినా సరే గాఢంగా నిద్రపోవడం ఆరోగ్యలక్షణం అని ఆరోగ్యశాస్త్రవేత్తలంతా అరుస్తున్నారు. నిద్ర పట్టకపోవడమనేది ఒక గొప్పజబ్బు. పెద్దపెద్ద డాక్టరుదొరలు బుద్ధిమంతులు కూడా వాడి నిద్రపట్టకపోవడమనే రోగాన్ని కుదర్చలేకపోతున్నారు. అట్టి పరిస్థితుల్లో నిద్రలేకపోవడమనే రోగం పొంతపోకుండా ఎంతచప్పుళ్లో అయినా సరే నిద్రపోగలగడం మంచి ఆరోగ్యపద్ధతి. ఎంతమంచి ఆరోగ్యపద్ధతి అయినా ఇదిమాత్రం నాకు పట్టుబడలేదు. నాకు పట్టుబడని దోషాన్ని కామోసు నాతమ్ముళ్ళకుకూడా ఈ పద్ధతి పట్టుబడలేదు. మా భావమరుదులు ముగ్గిరికీమాత్రం ఈ పద్ధతి ఉగ్గుపాలతో నేర్చిన విద్యఅయింది. రైలుఎక్కడం తరువు. అది రాత్రి అయినా, పగలైనా వాళ్ళు నిద్రపోతారు. రైలుపెట్టె కిటికీల్లోంచి తొంగిచూడడమనే దురభ్యాసం వారికి ఎంతమాత్రంలేదు. ఎక్కడంతరువు వారు నిద్రపోతారు. కిందబల్లలమీద చోటు ఉండదనుకోండి సామాను పెట్టే బల్లలమీద పడుకుంటారు. ఆ బల్లలమీద సామాను ఉన్నా వారికి పాటింపులేదు. ఆ సామాను మీదే వారు పడుకుంటారు. ఆ సామానుల ఎగుడు దిగుడులు వాళ్ళకి ఎంతమాత్రం ఇబ్బంది కల్గించవు. మేలుకునే వారికి ఈ ఎగుడుదిగుడులు బాధిస్తాయిగాని నిద్రపోయే వారిని - అందులో మా బావమరదుల్ని - అసలే బాధించవు. నిద్ర సుఖమెరగదనే విషయం మీకు నేను చెప్పవలసిందికాదు. ఒక్కొక్కప్పుడు సామానుబల్లలమీద సామాను పైటాపుకంతా కమాను అయితే వీరి పనేమిటని ఈ వ్యాసపాఠకుల్లోని జిజ్ఞాసాపరులు ప్రశ్నింపవచ్చు. అల్లాంటి సమయంలో వీరు కింద ఉట్టిబల్లమీద మనుష్యుల కాళ్ళమధ్య కూర్చుండి కునికిపాట్లుపడ ప్రారంభించి నెమ్మదిగా ఎవరిమోకాళ్ళమీదో తల ఆనుకొని నిద్రతీస్తారు. మరొక విశేషం కూడా ఉంది. మా బావమరుదుల్లో-మధ్యవాడు తప్ప మిగతాయిద్దరు బాగా గురకపెడతారు. గురకపెట్టే స్వభావం ఉన్నవాళ్ళల్లో చాలామందికి కొంతసేపు

నిద్రపోయిన తర్వాతగాని గుర్రు అందుకోదు. కాని వీళ్ళవిషయంలో అల్లా కాదు. వీళ్ళకు, నిద్రతోనే గుర్రు, గుర్రుతోనే నిద్ర. ఈ గుర్రువల్ల వాళ్ళకే కాకుండా ఆప్రక్క రెండుమూడు పెట్టెలలో ఉన్న వారికికూడా రైలు చక్రాలచప్పుడు, ఇంజనుకూతపాసెంజర్ల గోలం కేకలు ఏమీ వినిపించవు. స్వార్థము, పరార్థము ఇట్లు ఈ విషయంలో మావాళ్ళకు కలిసివచ్చింది.

ఈ జాతి మనుష్యుల్ని మనం రైలుసంథకర్తలని పిలవతగును. మా బావమఱుదుల్ని మనస్సులోపెట్టుకుని రైలులో నిద్రపోయే స్వభావంకలవాళ్ళని రైలుసంథకర్తలని పిలవతగునని నేను అంటంలేదు. నేను ఇతరులను మనస్సులోపెట్టుకునే ఈపేరు సూచిస్తున్నాను. ఏమంటారా మా బావమఱుదులు ఒక రైలుపెట్టెలోనే కాదు ఎక్కడైనాసరే ఎప్పుడైనాసరే నిద్రపోతారు. దీపం ఉన్నా, లేకపోయినా—మంచంనిండా నల్లులు ఉన్నా, దోమలు మితిమీరిఉన్నా మా బావమఱుదులకు నిద్రాభంగం ఉండదు. దొగడలు గుచ్చుకుంటాయి అనే భయంలేకుండా వాళ్ళు అవసరమైతే ట్రంకుపెట్టెలమీదే పడుకుని నిద్రపోతారు. ఒకసారి ఏంజరిగిం దనుకున్నారు, మా మూడోబావమఱది, నేను స్టీమరురేవుకి వచ్చాము. స్టీమరు ఇంకా రావడానికి కొంత వ్యవధిఉంది. బట్టతడుపుడు చినుకులుపడి అప్పుడే వానవెలిసింది. ఆ స్టీమరురేవంతా చెమ్మగా ఉండి కూర్చోడానికి జాగాలేకుండా ఉంది, అప్పుడు మా బావమఱది మా కూడాతెచ్చిన ట్రంకు కిందపెట్టి దానిమీద ఖండువాపఱుచుకుని కాళ్ళు ముడుచుకుని సుఖంగా గుర్రుపెట్టి నిద్రపోయాడు. మరోసారి మా రెండో బావమఱది తణుకులో ఒక కాఫీహోటలులో బెంచికింద దూరి నిద్రపోయినవిషయం ప్రజాలోకానికి తెలియకపోయినా మా బంధులోకానికి తెలిసింది. అట్టి మా బావమఱుదుల్ని ఏ పరిస్థితులలో పడితే ఆ పరిస్థితులలో—ఎక్కడపడితే అక్కడ—ఎప్పుడుపడితే అప్పుడు నిద్రపోగలిగే మా బావమఱుదుల్ని కేవలం రైలు సంథకర్తలనిమాత్రం అనడం నాకు ఏమీ యిష్టం లేదు. అన్నాగాని ఆ పేరుకి వారియెడల పూర్తి చెలామణీ ఉండదు. నెపోలియన్ యుద్ధభూమిలోకూడా కావాలంటే నిద్రపోగలిగేవాడట. గాంధిగారుకూడ ఎప్పుడు పోవాలంటే అప్పుడు ఎంతకొద్దిసేపు పోవాలంటే అంతకొద్దిసేపు నిద్రపోగలడట. ఇంకా మీకు ఇష్టమైతే మా బావమఱుదుల్ని నిద్ర నెపోలియనులని, నిద్ర గాంధీలని అనండి అంతేకాని రైలు సంథకర్తలంటేమాత్రం సరిపోదు.

మా బావమఱుదుల్ని నిద్ర నెపోలియనులను, నిద్ర గాంధీలనుచేసే ఉత్సాహంలో అసలు విషయాన్ని తప్పి వచ్చాము. రైలులో నిద్రపోయేవాళ్ళల్లో మా బావమఱుదుల్లాంటి కొందర్ని రైలు సంథకర్తలు అనడానికి వీల్లేకపోతే ఇక అసలగ్గమనుష్యులు ఎట్లాంటివారయ్యా అని మీరు అడగవచ్చు. దానికి సమాధానము మనవి చేస్తాను. నా స్నేహితుడు జగన్నాధాచారికి ఇంట్లో దీపం ఉంటే నిద్రపట్టదు. 'దీపంఉంటే తాచుపాములు రావు, కాబట్టి చిన్నదీపమేనా ఉండనీయండి, నిన్నను మన ప్రక్క ఇంట్లో కారెడు నల్లతాచుపాముపిల్లను చంపారు' అని ఒకసారిపెళ్ళాం ఎంతబతిమాలినా జగన్నాధాచారి ఇంటిలో దీపంపెట్టనిచ్చాడుకాదు. ఏదో స్నేహితుడు గదా అని ఆనాడు నేను వాణ్ణి చూడబోయాను. భార్యాభర్తల తగువులలో కలగచేసుకోవడం మంచిది కాకపోయినా నేను ఊరుకోక 'చిన్నదీపం ఉండనీయరా, ఇంతట్లో ఏం పోతుంది' అన్నా. 'పోతుందని కాదురా, దీపంఉంటే నాకు నిద్రపట్టదు. చావనామరి' అన్నాడు. చిన్నదీపం ఉన్నా ఇంటిలోనిద్రపోని ఈ మనిషి ఒకసారి మద్రాసునుంచి మెయిలులో బెజవాడ వస్తూ మూడవతరగతి పెట్టెలో సామానుబల్లమీద పక్క వేసుకుని గాఢంగా నిద్రపోయాడు. బెజవాడ వచ్చేవరకు మరి కదల్నాయినాలేదు. రైలుపెట్టెలో దీపం అతనికి మూరెడుదూరంలో ఉంది. మనయింటిలో దీపాలకంటె రైలుపెట్టెలో దీపాలు చాలా కాంతిగాఉంటాయి గదా. అయినా అతడు యింటిలోకంటె ఇక్కడే బాగా నిద్రపోయాడు. అతనితోకూడా ప్రయాణం చేస్తూఉన్న నేను బెజవాడలో ఈ విషయం ప్రస్తావింతునుగదా 'ఏమిటోరా, రైలుఎక్కడం తడువు, నాకు నిద్రవస్తుంది' అన్నాడు. ఇల్లాంటి మనుష్యుల్ని మనం తప్పకుండా రైలు సంథకర్తలని అనితీరాలి.

చూడండి ఇంటిలో పక్కమీద దుప్పటి మడతలు పడి ఉంటే నిద్రపట్టదని విసుక్కునేవారు—పల్లి అలికిడి కలుగుతేచాలు పాడిగ్రుడ్లు వేసుకునేవారు—దోమ గుయ్‌మంటే నిద్రపట్టటంలేదని అఘోరించేవారు—ఇంకా ఇంకా అనేకతరహాలవారు రైలు ఎక్కడం తోటే ఒట్టికొయ్యలమీదే, కొయ్యల సందునుండి టిక్కెట్టులేకుండానే రైలుఎక్కి అందు పెర్మనెంటు పాసెంజర్లగా ఉండు నల్లులదండు తమమీద ఎత్తి వచ్చినా, దీపపుకాంతికి చిన్నపురుగులు పెండలు మీద తలమీదకు వచ్చిపడుతున్నా రైలులో నిద్రపోయే వాళ్ళను నేను ఎందఱినో చూచాను. ఈ తరగతి వాళ్ళను అందఱినీ రైలు కుంభకర్ణులు అండానికి ఎవరికీ ఏమీ అభ్యంతరం ఉండదు.

అయితే ఈ రైలుకుంభకర్ణులలోకూడా రెండు రకాలున్నాయి. ఒకరకము కూర్చునే కుంభకర్ణులు; రెండోరకము పడుకునే కుంభకర్ణులు. కూర్చున్నట్లే ఉండి అవతలబల్లకు కాళ్ళు తన్నిపెట్టి మెడ మెల్లగా ప్రక్క పాసెంజరు భుజాలమీదవాల్చి కునికిపాట్లు పడుతూ మెడ మొయ్యలేక ఈవతల వీడు, పాదస్పర్శను భరింపలేక అవతలవాడు మధ్యమధ్య తట్టిలేపుతూ ఉండగా నిద్రానిష్ఠనుండి లేచినట్లేలేచి సవరించుకొనుచున్నట్లే కనిపించి ఉత్తరక్షణమునందే తిరిగి పాదాల్ని, శిరాన్ని యథాప్రదేశవినివేశితాలు చేస్తూఉండే కుంభకర్ణులు ఒకరకము. ఏ బల్లమీదో స్వేచ్ఛగా పక్క వేసుకుని కాళ్ళుచేతులు చాచుకొని కొందఱు కూర్చోడానికే చోటులేక అవస్థపడుతూండగా తాను సుఖంగాపడుకుని బాగా నిద్రపోతూ మధ్యమధ్య హఠాత్తుగా కళ్ళువిప్పి రైలు పోతూవున్నాసరే ఇది ఏవూరు అని నిలుచుని ఉన్నవాళ్ళని, కూర్చుని నిలువు గ్రుడ్లతో ఉన్నవారిని ఠీవిగా ప్రశ్నిస్తూ ఇది ఏవూరూ కాదు అనే సమాధానం పొందుతూ తిరిగి నిద్రాముద్రలో పడిపోయే కుంభకర్ణులు మఱియొకరకము. ఈ రెండురకాల కుంభకర్ణులలోను ఎవరు మంచివారంటే మొదటిరకపు వారికంటె రెండవరకపువారే మంచివారని చెప్పాలి. ఎంచేతంటారా? వీళ్ళ ప్రక్కమీదికి మనం జరిగితేకాని వీళ్ళ కాలితాపులు మనకు తగలవు. సాధారణంగా ఈ రకపు కుంభకర్ణులు పైన సామాను బల్లలమీదే పడుకుని సామానులలో ఒకరై క్రింది మనుష్యులతో విశేష సంబంధంలేకుండా ఉంటారు. వీరి పాదాలనుండి దుమ్ము రాలి, చెప్పులుజారి, ఖండువాలు పడి క్రిందిలోకంలో అప్పుడప్పుడు అలజడిని కలిగిస్తూ ఉండడం కలదు. అయితే ఈ ఉత్పాతాలు తఱుచుగా జరగనివి కాబట్టి వీటిని మనం అంతగా పాటింపకూడదు. పాటించినా పైవారికి నిద్రాభంగం, క్రిందివారికి కంఠశోష తప్ప ఏలాభంలేదు. కూర్చునే కుంభకర్ణుల వల్ల ప్రక్కవాళ్ళకి, ఎదటవాళ్ళకి ఎంతైనా బాధ ఉంది. కాబట్టి ఈ రెండురకాలలో పడుకునే కుంభకర్ణులే మంచివారని చెప్పాలి. మంచివారేగాక వీరు గొప్పవారనికూడా ఒప్పుకోవాలి. ఏమంటారా? రైలు కుంభకర్ణులలో ఈ కుంభకర్ణులకు రాజాంశ ఉంది. పూర్వం మన రాజులవద్ద సౌఖశాయనికులని ఒకతరగతి ఉద్యోగస్థులుండేవారు. వారిపని ఏమిటంటే రాజు లేచినతోటే వెళ్ళి రోజూ 'మంచినిద్రయా?' అని అడగడం. ఇందుకొఱకు వారికి ప్రత్యేకం జీతాలుండేవి. పైన సామానుబల్లమీద పడుకునే రైలు కుంభకర్ణులకు రాజాంశ ఉంది కాబట్టే సౌఖశాయనికులున్నారు. తెల్లవారి ఈ కుంభకర్ణులు మహారాజుబట్ట సవరించుకుంటూ క్రిందికి దిగడంతోటే ఆ పెట్టెలోని ఇతర ప్యాసెంజర్లు 'బాగా నిద్రపోయారు' అంటారు. జీతం బత్తెంలేకుండా ఇంతమంది సౌఖశాయనికులను కలిగిఉండడం మహారాజలక్షణం కాక మరేమి?

రామాయణంలో కుంభకర్ణుల్ని రామాయణ పాఠకులెవరూ ప్రేమించరు. ఈ రైలుకుంభకర్ణుల్ని కూడా రైలు ప్యాసెంజర్లు ఎవరూ ప్రేమించరు. పైగా ద్వేషిస్తారు. 'ఇంతమంది ఇల్లానుంచుంటే ఆయన పడుకోవడం ఏమిటి' అని కొందఱు, 'మనంమాత్రం ఆయనలా టిక్కెట్టుకొనలే' అని కొందరు, లేపండయ్యా ఆయన్ని లేపండి అని కొందరు ఇల్లా ఈ కుంభకర్ణులను గూర్చి ప్యాసెంజర్లు కేకలువేస్తుంటారు. ఇల్లాంటి సమయాలలో తానొక గొప్ప హాస్యగాణ్ణి అనిపించుకుండా మసలుకునే మా కామేశ్వరరావులాంటి ప్యాసెంజరొకడు 'నాది నంచుచేటికెట్టు, మీది కూర్చునే

టిక్కెట్టు, ఆయింది పడుకునేటి కెట్టు' అని చుట్టు పట్ల ఎవళ్ళైనా వచ్చ్యారున్నారేమోనని పరకాయిస్తాడు. సాధారణంగా ఇవి ఆ కుంభకర్ణులకు వినిపించవు, వినిపించినా వారి నిద్రాభైకమును విప్పగల ఓషధీగుణం ఈ మాటలకుఉండదు. మంత్రాలకు చింతకాయలు రాలనట్లే మాటలకు రైలుకుంభకర్ణులు లేవరు.

ఒక్కరైలు పాసెంజర్లేకాకుండా రైల్వే అధికారులుకూడా ఈ రైలుకుంభకర్ణులను ప్రోత్సహిస్తోన్నట్లు కనిపిస్తోంది. ఏమంటారా? రైల్వే అధికారులు ఈ మధ్య సామానుబల్లలు పెట్టేచోట ఇనపతీగెలతో బోదితో పెట్టెలు నిర్మిస్తున్నారు. రైలుకుంభకర్ణులకు కాలాదులగు సామానుబల్లలు కొన్ని పెట్టెలలో తీసివేసినంతమాత్రాన ఈ కుంభకర్ణులకు శిరచ్ఛేదము కాదు. వారు ఈ బల్లలులేని పెట్టెలను ఎక్కడమే మానేశారు. ఎక్కినా ఒకత్తుగా పక్క వేసుకుని ఆ ఇనుపతీగెల బోదితో పెట్టెలలోనే పడుకుంటున్నారు. వారికి చిన్నప్పుడు పెట్టెలలో పడుకునే అలవాటు ఉండనే ఉంది. 'ఒకచో నేలను బవ్వళించు' ఇత్యాదిగాఉన్న భర్తృహరి పద్యము ఈ తరగతి మహాశయులకు బాగా వర్తిస్తుంది. —ఎ. శేషాచలపతి, బి. ఏ.

---

# పూర్వభావలహరి

౧

వీరచరిత్రచేత పృథివీతలమెల్ల ప్రతిధ్వనించె, శృం
గారరసప్రధానముగ గానముచేసిరి, సత్కవీంద్రు, ల
వ్వారివరాక్రమంబు, ప్రతిభావిజయంబు ప్రపూత తేజ సం
స్కారత, జ్ఞానవర్ధనము, స్వాంతమువిన్న, పఠింపబొంగెడున్.

౨

ఎప్పుడు ధర్మదేవతను హింసల నొంచు నధర్మభూత; మిం
కెప్పుడు ధారుణీవలయ మెల్ల నవిద్య గలంచు విద్య: నిం
కెప్పుడు దుర్మతంబొలసి నీతు సుతాని జికాకు సేయు, నిం
కెప్పుడు శాంతసంచలన మెచ్చగు క్రౌర్యమహాసిలాహతిన్.
ధారుణి నప్పుడొందు నవతారమె తానవు వీరుడాతడే
వైరి రటింపజేయు నిల ఖండనమందునతండె ఆత్మలో
ఘోరరిపుస్వదల్చెడు నకుంఠిత భక్తినతండె నన్మతో
ద్ధారణసేయు బోద్ధకవి తానగు నజ్ఞతబాపు వేత్తయై.

౩

ధాత్రిరి రామకృష్ణు లవతారము ధర్మము నిల్పదాల్చిరా
రీతిని బుట్టె దుర్మతనికృంతనజేయగ శంకరుండు దు
ర్నీతి యవిద్యబాప ధరణీస్థలి బుట్టిరి పోతనాదు లా
లాలిమహాత్మ సంజనన లాభముగల్గెను నేడు శాంతికై.

౪

కానివిచిత్ర మీానసరణి గాంచ! బురాణములందు దేశ న
న్మాన చరిత్రలందు నసమానపరాక్రమ వీరకృత్యముల్

కావఁగ నాఁట, గాన మెటకన్గొన పృథ్విని, బాలవీరులీ
మానిత దేశగర్భమున మానికముల్బలె పుట్టువొందుటల్.

౫

వారిపవిత్ర జీవికలు స్వల్పము లేయగుఁగాక మాతృభూ
మీరమణీ చరిత్రమున మేలిమి శీర్షికవోచు సద్భృతా
గార విచిత్రదర్శనము గాఁగ మనోనయనాళికాపికీ
వార సుజాత గీతముల వై భరి మోహితులట్లజేయువే.

౬

కొందరు శాంతభక్తులటు కొందరు తీవ్రతపోధనాఖ్యలిం
కెందరొ త్యాగశీలురు మరెందరొ వీరులు దేశభక్తులా
నందముగాఁగ బాలుర సవర్ణ్యమణీనిలయంబుఁగేరి యే
చందము నొందె నొక్క టీతి చల్లని పిల్లల తల్లియుల్లమై.

౭

ఏదిలవామఖాశ్వము ? మరెక్కడ మీ కుశుడన్న జానకీ
శ్రీధవు వీరగానము కుశీలవులై యొనరింప నెంచగా
రాదె. విచిత్రమా చవుల రాజిల నాహృదయంబుపొంగ మా
కేదియు తోచదోయి, బెదిరించెదునోయి విదేశరాక్షసుం
డీదెస చూడుమోయి వినిపింపగదోయి తితీక్ష్ణ వేగ ప్ర
హ్లాదకుమార ! ఓ ధ్రువమహాశయ మాతృపగాథ వాలివి
చ్చేదన జేతుమన్న దయసేయుగదన్న తపప్రభావమీ
రాదె భవత్ప్రతాప మిడరాదె త్వదీయవిచిత్ర దీక్షనీ
రాదె కరావలంబ మరిరాజుల వ్యూహము జీల్చుమేము నీ
సోదరపాళికాదె యిటు స్రుక్కిన జిన్నతనంబు కాదె నీ
మాదిరికేది మాద్రి యభిమన్యకుమార తలంపధాత్రిలో.

౮

లేమి ఖదీ కుమారుడిట లేమినొకండును బాలచంద్రుడిం
తో మది మాటిమాటికిని దుఃఖమునొందగ బోలు దేశమే
మేమియు జేయలేక బలహీనులమై తిమి, ఐననేమి ఓ
భామరొ యెట్టులున్న ప్రియభాజనమే మతువల్కులమ్మకున్.

౯

వాసిగ నందు చేత నికబాడుచునుండెద బాలవీర సం
దేశము పద్యగీతముల తీయగనే నభిమానవీణపై
భాసిలు భావతంత్రులను బాగుగ మీటుచు దానవాత్మ వి
శ్వాసము దేశభక్తియును స్వాంతమునిండి వెలుంగజేయగా.

— పెమ్మరాజు రాజగోపాలము, బి.ఏ.

# వృక్షతైలములు

'నూనె' అనుదానికి పర్యాయపదము 'స్రొవ్వు' అని పలుతావుల వాడబడుచున్నది. అధికోష్ణోగ్రమునందు నూనె ఆకారమున (అనగా ద్రవరూపమున) నున్నదే, అల్పోష్ణోగ్రమునందు క్రొవ్వురూపమున (అనగా ఘన రూపమున) నుండుటచే, పై ప్రయోగము సమంజసము గనే యున్నది. నూనె ద్రావకగుణములుగాని, ఖింగలిక గుణములనుగాని వెలిబుచ్చక, రసాయనిక పరిభాషలో 'నిర్గుణ' మన దగియున్నది. నూనెలు నీటి యందు కరుగవు. సారా మొదలుగాగల కొన్ని 'స్పిరిటు'లందు కరుగును.

ఈ నూనెలను, వాని మూలాధారములబట్టి, మూడు ముఖ్యజాతులుగ విభాగించిరి.

1. జంతుక్రొవ్వులు:—కాడ్‌లివర్ తైలము, వెన్న, చేపచమురు, సీల్ తైలము. మొ...
2. వృక్షతైలములు:—కొబ్బరి, ఆలివ్, వేరుసెనగ మొ...తైలములు.
3. ఖనిజతైలములు:—కిరసనాయిల్, పెట్రోల్ మొ...

కిరసనాయిల్, పెట్రోల్ మొదలగునవి, భూమ్యంతర్గతములైన అనేకములగు జంతువృక్ష పదార్థములనుండి రసాయనిక పరిణామపరంపరల ఫలితముగ బుట్టినవే యను సిద్ధాంతముండినను, వానిని ఖనిజవర్గమునందే చేర్చియుండిరి. మనకు ప్రస్తుతములగు 'వృక్షతైలములు' సంఖ్యయందేమి, వ్యాప్తియందేమి, వినియోగమునందేమి, అతి ప్రాముఖ్యతనందిన వనుట నిశ్చయము.

## వృక్షతైలముల రసాయనిక నిర్మాణము.

ఇవన్నియు గ్లిజరైడ్స్, లేక గ్లిజరీయములు అయి యున్నవి. అనేక ద్రావకములు 'గ్లిజరీన్' అనబడు పదార్థముతో రసాయనిక సంయోగమువలన గలిగినవే యీతైలములు. ద్రావకములలో ముఖ్యములైనవి 'క్రొవ్వు ద్రావకము'లనదగిన పామిటిక్, స్టీరిక్ ద్రావకములును, ఓలీక్ ద్రావకము మొదలుగాగలవి. తైలములయొక్క గుణాగుణములు, తదంతర్భూతము లగు ద్రావకములబట్టి యుండుననుట విదితమే.

## వృక్షతైల వర్గీకరణము

వృక్షతైలములు ద్వివిధములు.

1. క్రొవ్వు (మందపు) నూనెలు.
2. ఆవిరి (ఎసెన్షల్) నూనెలు.

క్రొవ్వు నూనెలనునవి, కాగితము గుడ్డ మొదలగు వానికి మరకలు కలిగించు గుణముగలవి. ఆవిరినూనెలు హైడ్రోకార్బన్స్, లేక జలవాయుకర్బనము లనదగినవియు, కర్బనము యొక్కయు, జలవాయువు యొక్కయు, ప్రాణవాయువు యొక్కయు మిశ్రమ పదార్థముల సంపుటి, ఎక్కువగా గలిగియున్నవి. అందుచే నివి గాలిలో సులభముగ వ్యాపించి తమ వాసనలను వెదజల్లగలవు. వీనిని మందులయందును, పరిమళ ద్రవ్యములయందును వాడుచున్నారు. చేదు బాదం డొల్లలతైలము, వేరుసెనగతైలము, ఫ్ల్యాజిల్ తైలము (పిండి పులియబెట్టితీయు సోకతైలము) నిమ్మగడ్డి చమురు, ఆవాలతైలము, జాజితైలము, గులాబితైలము చందనతైలము మొదలుగాగలవి యీ రకమునకు జెందును. క్రొవ్వుతైలములను తిరిగి రెండుగా విభాగించిరి.

1. ఆరు నూనెలు.
2. ఆరని నూనెలు.

ఆరునట్టి నూనెలు, మెల్లమెల్లగ వాతావరణమునుండి ప్రాణవాయువును గ్రహించి, వార్నిషులవలె తయారగును. అందుచే నివి రంగులు బూయుటలో నుపయోగమును బడయుచున్నవి. ఆరని నూనెలు వాతావరణములో రసాయనిక వియోగమునుబొందును. వీనిని ఆహారపదార్థములగను, సబ్బులు క్రొవ్వువత్తులు చేయుటయందును వాడుదురు. దోసనూనె, ఆవిసె

నూనె జనపగింజల తైలము, పొగగింజల తైలము మొదలగునవి ఆరునూనెలు. కొబ్బరినూనె, ఆముదము, నువ్వులనూనె మొదలగునవి ఆరని రకమునకు చెందును.

## తైలములకు మూలములు

పారిశ్రామికముగ ప్రాముఖ్యతనందిన, వేరుసెనగ, నువ్వుల తైలములు, ఆవాల తైలము ఆముదము మొదలగునవి ముఖ్యముగ గింజలనుండియే లభించుచున్నవి. కొబ్బరి, పైగింజలవంటి గింజ కాకపోయినను, వానికంటె అత్యధిక ప్రాముఖ్యతనే పొందినది. ఆకులనుండి, పుష్పములనుండి, ఫలములనుండి, పట్టనుండి, బోదెనుండి, వేళ్ళనుండి, చెక్కలనుండి కూడ తైలములు తీయబడుచున్నవి. కొన్నిరకముల తృణముల నుండి, కలబంద మొదలగువానినుండి తైలములు తీయబడుచున్నవి.

నేటి నూనెల పరిశోధనలందు, నూనెగింజలకు ప్రాముఖ్యతగలదు. ఆయా పంటలను, లేని ప్రదేశములందు వ్యాపింపజేయుటయేగాక, నూనె పరిమితిని అభివృద్ధిలోనికి దెచ్చుటకును, నూనెను క్షుణ్ణముగ పిండుటకు తగిన సులభయంత్రముల నిర్మించుటయును, నూనెలను చిరకాలము నిల్వచేయు పద్ధతులును, అన్నిటికంటె ముఖ్యముగ నూనెలకు నూతనోపయోగముల గనిపెట్టుటకును పరిశ్రమలు సాగుచున్నవి. 'నువ్వులకు నూరుగోరా' లన్న సామెత ప్రతినూనె పంటకు సరిపోవును. అందు ముఖ్యముగ పెరటియింటి కల్పక మనదగిన, కొబ్బరిపంట పరిశ్రమపై నేడు విరివిగ పరిశోధనలు జరుగుచున్నవి.

## ఉపయోగములు

నూనెలు అనేకోపయోగముల బడయుచున్నవి. భోజన పదార్థముల తయారుచేయుటలోను, దీపముల వెలిగించుటకును, యంత్రముల నడుపుటకు, రాపిడి తగ్గించుటకు, ఉపయోగింపబడుచున్నవి. దేహమర్దనకు అభ్యంగనాను లేపనములకు వృక్షతైలములు ప్రతిదేశమందును వినియోగింపబడును. పరిమళవస్తువుల తయారుచేయుటకు, ఔషధములందు వీనికున్న యుపయోగ మింతంతకాదు. కల్తీలయందు నూనెను వినియోగింపబడును. పారిశ్రామికముగ, చర్మములు పదునుచేయుటయందు, గ్లిజరీన్ అనబడు పదార్థమును తయారుచేయుటకు, క్రొవ్వువత్తులు, సబ్బులు చేయుటకు చాల నూనె ఉపయోగింపబడును. నూనెలు కీటక విధ్వంసకరములుగగూడ వాడబడుచున్నవి.

తైలాధారములగు పరిశ్రమలలో ముఖ్యములగు క్రొవ్వువత్తుల పరిశ్రమ, సబ్బుల పరిశ్రమలలో, మొదటి దానినిచట క్లుప్తముగ వర్ణించుట అసమంజసముగాదు.

## క్రొవ్వువత్తులు

నూనెలనుండియే చేయబడుచున్నవి. ఈ వత్తుల పదార్థము, వృక్షతైలములలోని పాల్మిటిక్, స్టీరిక్ ద్రావకములే. నూనెలనుండి యీ ద్రావకముల దీయుటకు మూడుమార్గము లుపయోగింపబడుచున్నవి.

1. అత్యధికోష్ణముగల నీటియావిరి మూలమున.
2. గంధకద్రుతి మిశ్రమమువలన.
3. సున్నపునీరు, మొదలగు కొన్ని ఐంగలికముల వలన.

వీనిలో మొదటిపద్ధతి విరివిగ అవలంబింపబడును. అత్యధికోష్ణముగల నీటి యావిరితో కలసి నూనె రసాయనిక వియోగమునుబొంది, పాల్మిటిక్, స్టీరిక్ ద్రావకములు, ఓలిక్ ద్రావకము, గ్లిజరిన్ అనునదియును లభించును. గ్లిజరిన్, ఓలిక్ ద్రావకములు స్వేదనముతో కలసిపోవును. పాల్మిటిక్ స్టీరిక్ ద్రావకములు మొదటి పాత్రలోని నీటిపై నురుగువంటి ఆకారముతో తేలియాడుచుండును. ఆ నురుగును తెడ్డతోడ పైకితోడి, అది చల్లబడునపుడు దానితో కొంత మైనమును కలిపి, గట్టిపడినపిదప పలకల మధ్యనుంచి వత్తుదురు. గట్టిక్రొవ్వు తయారగును. స్వేదనముతో వచ్చిన ఓలిక్ ద్రావకము సబ్బులు చేయుటయందును, గ్లిజరాలును అనేకవిధములగు మారణప్రయోగ పదార్థముల చేయుట మొదలగువానియందును ఉపయోగింతురు.

—జాగు గోపాలరావు.

# పరామర్శ

వచ్చితిర ! మా యెడం దయవచ్చినదియె ?
నేటికంటియ చాలు ; ఈ పాటియేని
తలపు లోపల మెసలగాగల యదృష్ట
మున్నదని చెప్పుకోగల పెన్నడైన.

ఉదయమే బండి నెక్కిరా ? ఒక్క మొగిని
యింత పయనమ్ము విసుగు పుట్టించు ; పాడు
బండి ! త్రొక్కుడొక్కు ; వేగలెందు, స్నాన
మొనరిచి యిగ భోజనము సేయుదురు గాని.

ఎరుగని వారె మీర లనకే సెరజాణలు ! నేటి దనక మీ
దరిసెన మబ్బకుండిన విధ మ్మిపు డీ యనుకోని కూర్మి న
త్వరము కుదెంచు నా దశమి పండుగ చెప్పక తప్పదయ్యె ; ఈ
వరకిక కట్టిపెట్టుడు జవాబులు, నేర్చినయంత సెల్లునే !

పెరటిలో మొక్కల కరసి నిత్యము నీళ్లు పోయింతురా ? క్రొత్త పూలజాతు
లేమని తెచ్చి వేయించిరే ? మందార మొగ్గదొడిగినదె ? ముద్దబంతి
యెట్లుగా పెరిగిన దేమి ! పూల కనుచు తెల్లవారక ముందె పిల్లలెల్ల
దొడ్డి క్రిక్కిరిసి పోదురు 'నాకు నా' కంచు గడబిడ తోడ సంక్రాంతినాళ్ల ;
అడుగ మరచిపోయితి మాటలందునబడి, యీనినదె మనగేదె ? జున్నింతయైన
మిగుల నిత్తుర ! అంతయు మీకె చాలదయ్యె ; క్రిందటేడును నాకు ప్రాప్తి లేదు.

అదియటులుంచు డింట గల యందరకుం గుశలమ్మె ? కళ్లలో
కదలుచునుండె 'సుబ్బు' ; పలుకన్ విని నవ్వుదు రంత మాత్ర మా
నెద ననుకొందు రేమొ !—మిము నిక్కము తల్వని రోజు లేదు ; ము
ప్పదుల దినాలకుం గదలి వచ్చిరి దేవరవారు నేటికిన్.

సాగనీయను వెనుకట్టి జాడ నిప్డు
దశమి పండుగ పదినాళ్లు నిచట గడపి
పోవలె నుమండి ! యిక లేనిపోని పనులు
కలవు నాకను బెట్టుమాటలు విడువుడు.

కుడిచి కూర్చుంటి మాటల గడప గలను
లెందు లెండిక తీరి కూర్చుండ భోజ
నమ్మయిన వెన్క చాలకాలమ్ము గలదు
ప్రొద్దు పుత్తము తరుగని ముచ్చటలను

—బొడ్డు బాపిరాజు.



# ఏ ది సౌఖ్యం

౧

అది సాయంసమయం. అతిదీర్ఘ ప్రయాణంచేత అలసిసొలసి లోకబాంధవుడప్పటికప్పుడే విశ్రమస్థానం చేరుకున్నాడు. శశాంకుడు తన శీతలకిరణాలతో ప్రపంచాన్ని సంతోష పారవశ్యంలో ముంచటానికి బయలుదేరుతున్నాడు. తన శీతలకరస్పర్శచే పద్మాన్ని ప్రేమించబోయినాడు. కాని ఆ పతివ్రత, భీతిజెంది, ముకుళించుకున్నది. భర్తను గలిగిన పరాభవానికి కలువ కిలకిలానవ్వింది. ప్రొద్దుటినుండి కడుపార మేసిన పాడి గొడ్లు సంతానాన్ని చూచుకోవలననే అపేక్షచేత త్వరత్వరగా యింట్లకు చేరుకుంటున్నవి. పొద్దునగా గడ్డికోసుకరావడానికి పోయిన కాపుపడుచులు, గడ్డి మోపులు నెత్తినపెట్టుకొని, కిలకిలానవ్వుతూ, కులాసాగా కబుర్లుచెప్పుకుంటూ, వెన్నెలరాత్రిలలో వారనుభవించబోయే సుఖాన్ని ఆలోచించుకుంటూ, భర్తృముఖ సందర్శనాపేక్షచే చకచకా గ్రామం వైపు నడుస్తున్నారు. చీకటితోనే లేచి తండ్రి సేద్యానికితీసుకొన్న పొలంలో అరక దున్నటానికిపోయిన కాపుకుర్రోడు నాగలికర్రి భూమికిరాచుకొని చేసే ధ్వనితో మేళవించి, శ్రావ్యంగా, మనోహరంగా 'ఏపూరు యేదేశంపిల్లా నీదీ' అని పాడుతూ యింటికి బయలుదేరాడు. సరీగ్గా కాపుకుర్రాడితోనే మేతకు బయలుదేరిన కాకులు, మళ్ళీ వాడితోపాటే, కర్ణకఠోరంగా 'కావుకావు'మని అరుచుకుంటూ గూళ్ళకు చేరుకుంటున్నవి. అందరికి వూరుమీదనే, నివాసస్థలం మీదనే చూపు. కాని, ఆ చూపు, ఒక్కడికి— ఆ మనోహరమైన సాయంసమయంలో వూరిబయట నది ఒడ్డున మఱ్ఱిచెట్టుక్రింద కూర్చున్న బైరాగికి—మాత్రం లేదు. ప్రపంచాన్నంతా సంతోషాబ్ధిని వోలలాడించే ఆ శరత్ జ్యోత్స్న, అతనికిమాత్రం హృదయకంటకంగావున్నది. అతడు, కాళ్ళుమాత్రం నీళ్ళలోపెట్టి, ముఖం రెండుచేతులతో పట్టుకొని, తలకాయవంచి, నిట్టూర్పులు విడుస్తున్నాడు. అప్పు డతనిమనస్సును యేభావాలు కలతపెట్టుతున్నవో యెవరికితెలుసు! ఘడియగడిచింది. రెండోఘడియ ప్రవేశించింది. బైరాగి ఆలోచన తెగలేదు. నిట్టూర్పులకు అంతులేదు. అతని చక్షువులనుండి అప్రయత్నంగా రెండశ్రుబిందువులు రాలినై. వాటిని కృష్ణవేణమ్మ పుణ్యంగట్టుకున్నది. బైరాగికి తెలివివచ్చింది. చుట్టుప్రక్కల తేరిపారచూశాడు. అంగదుడు తనవైపు బిక్కమొహం వేసుకొని చూస్తున్నాడు. బైరాగి తానుచేసినపనికి పశ్చాత్తాపపడ్డాడు. కళ్ళుతుడుచుకుంటూ లేచి తన జోలెలోనుంచి బియ్యపుగింజలుతీసి 'అంగదుడా! రా, నాన్నా, రా. యివిగో, తిండువుగాని' అని పిలిచాడు. కోతిపిల్ల రాలేదు. బిక్కమొహంవేసికొని అట్లాగే నుంచున్నది. 'రా, అమ్మా, రా. నేను యింకెప్పుడూ యేడవనులే, రా' అన్నాడు మళ్ళీ. అంగదుడు రాలేదు. 'యేమ్మా, యింతమాత్రానికే బిక్కమొహంవేస్తారా? యెక్కడన్నా. నేనేదో ఆలోచనమీద ఉన్నా. అంతే' అంటూ లేనినవ్వు తెచ్చుకున్నాడు బిక్షువు.

అంగదుడు బైరాగి దగ్గరకు పరుగెత్తుకుంటూవచ్చి, చేతిలోబియ్యం తినేసింది. 'నా దుఃఖంతో నేను

దహించటమే కాకుండా, పాపం, మా అంగదుణ్ణి కూడా దహింపచేస్తున్నా, నేను ఏలోకానికి పోతానో కాని' అనుకున్నాడు బైరాగి. రెండుమూడు పిడికెలబియ్యంతో అంగదుడి భోజనం పూర్తిఅయింది. ఆ మధ్యాహ్నమే తోటకాపును అడిగి తెచ్చుకున్న జామపండ్లను తింటూ, మధ్యమధ్య గుజ్జును అంగదుడి నోటికి రాస్తూ, బైరాగికూడా రాత్రి భోజనం ముగించాడు. హుక్కాసామగ్రి సిద్ధంచేసుకుంటున్నాడు, అంగదుడు మామూలుప్రకారంగా, రొగురుతూ గంతులు వేస్తున్నది.

నిద్రపోవటానికి వేళఅయింది. బైరాగి పక్క సిద్ధం చేసి 'అంగదుడూ' అని పిలిచే పిలదంకోకే గంతు వేసి పక్కమీద పడుకొన్నది. బైరాగి తనకాళ్ళు ముడుచుకొని, అంగదుడి కాళ్ళుతుడిచి, జోలె తల కిందపెట్టుకొని, అంగదుడిమీద చెయ్యివేసి పడుకున్నాడు. అంగదుడికి నిద్రపట్టలేదు. ముందరి రెండు కాళ్ళతో బైరాగి పెదిమలులాగటం మొదలెట్టింది. బైరాగి గ్రహించాడు. 'ఇవ్వాళ చెప్పలేనమ్మా. ఓపిక లేదు కథచెప్పటానికి. రేపు చెప్తాలే' అన్నాడు. కాదు, ఇవ్వాళే చెప్పమన్నట్టుగా అంగదుడు కిచకిచ లాడుతూ పెదిమలు లాగటం మొదలెట్టింది. రోజూ బైరాగి కథలుచెప్తూఉంటే నిద్రపోవటం అంగదుడికి బాగా అలవాటయింది. పైగా బహుగట్టిపట్టు అంగదుడిది. అందుకని బైరాగి యింకా లాభంలేదనుకొని 'అట్లాగేలే, చంపకు' అని కథయేదో ఆలోచించ మొదలుపెట్టాడు.

౨

అయినాపురపు మారన్నగారిది పేరేచెర్లగ్రామం. గుంటూరుకు దాదాపు ఏడెనిమిదిమైళ్ళదూరం. ఆయనకు కొద్దిగా భూవసతి వున్నది. అన్నీ మెట్టభూములే. అందులోనే కొన్నిభూములను పాలికి, కొన్నింటిని మక్తాకు యిచ్చి, మొత్తంమీద గౌరవంగానే ఆయన కాలం జరుపుకుంటున్నాడు. ఆయనగారికి నారాయణ రావు ఒక్కడేకొడుకు, అటువంటివాడు ఒక్కడున్నా చాలు నిర్భాగ్యదామోదరుడు. పెద్దయిన తర్వాత ఎంత దుర్మార్గుడయినాడో నారాయణరావు చిన్నప్పుడంత సన్మార్గుడు. ఒకరిజోలి తనకక్కరలేదు. తన పాఠాలేమిటో తనేమిటో తప్ప. అప్పుళ్ళో తలిదండ్రులందరూకూడా 'చూడు! వాళ్ళ నారాయణరావు! ఎంత ముచ్చటగా పాఠాలు చదువుకుంటాడో. వాణ్ణిచూసైనా నేర్చుకోవచ్చునే' అని పిల్లలను కోప్పడుతూవుండేవాళ్ళు కూడాను.

నారాయణరావుకు పాఠశాలలో చదువు పూర్తి అయింది. కళాశాలలో ప్రవేశించాడు. బి. ఏ. లో చదువుతూండే రోజుల్లోనే, షెల్లీ, కీట్సు, రస్కిను, కార్లయిలు గ్రంథాలు అవగాహన చేసుకున్నాడు. షేక్స్పియరు, మిల్టనులను తిరగవేశాడు. తెలుగులో ప్రబంధకవులను, పెద్దన, భట్టుమూర్తి, సూరన్న మొదలయినవాళ్ళను చదివి ఆనందించాడు. శ్రీనాథుని సీసపద్యధోరణికి అబ్బురపడ్డాడు. తిక్కన కందపద్యాలకు ముగ్ధుడయినాడు. తెలుగులో ప్రవేశం యేర్పరుచుకున్నాడు. ఇరవయ్యో శతాబ్దంలో కలిగిన పరివర్తనా మహాప్రవాహంలో తానుకూడా కొంతవరకు కొట్టుకుపోయినాడు. భావగీతాలల్లటం నేర్చుకున్నాడు. గ్రామ్యభాషావాదాన్ని సమర్థిస్తూ వ్యాసాలు పత్రికలలో ప్రచురించాడు. అన్నిటికన్నా అతని మనస్సును యెక్కువగా ఆకర్షించిన విషయాలు, రజస్వలానంతర వివాహాలు, స్త్రీ విద్యాభివృద్ధి, విధవా వివాహాలు. వీటికొరకు తన జీవితమంతా ధారపోయాలనుకున్నాడు. వాటి ఆవశ్యకతను గురించి అనేకసార్లు పత్రికలలో రాశాడు. హిందూ మతాన్నిగురించి చదువకపోయినా, పండితులవల్ల విన్నాడు పైవిషయాలకు మతగ్రంథాలలో తావులేదని. వీటికితావు బ్రహ్మసమాజమతంలో వుండటం గ్రహించాడు. హిందూ మతానికన్న బ్రహ్మ సమాజమతాన్ని యెక్కువగా ఆదరించాడు. వాళ్ళకట్టు, జుట్టు అనుకరించటం మొదలెట్టాడు. హిందూమతం సంకుచితం చేయబడటానికి పూర్వపు స్వార్థపరులైన పండితులే కారణమని, పాపం అతనికేం తెలుసు!

౩

అతడు బి. ఎ. చదువుతున్నే రోజుల్లోనే, అతని చక్కదనమూ, బుద్ధికుశలతా, తెలివితేటలూ చూచి

చాలామంది పిల్లనిస్తామని వచ్చారు. తనకు అప్పుడే పెళ్ళి అవసరంలేదన్నాడు నారాయణరావు. సూరన్న గారికి భయంవేసింది. ఇప్పుడు పెళ్ళిచేయకుండా అట్టె పెటితే నారాయణరావు యే కిరస్తానీమతంలో కలసి, యే వర్ణాంతఃవివాహానికి తలపడతాడోనని సూరన్న గారికి భీతిగలిగింది. ఇదీగాక యిప్పుడు పెళ్ళిచేస్తే, వెయ్యన్న నూటపదహార్ల కట్నం కాశెయ్యొచ్చునని ధనాశగూడా పీడించటం మొదలెట్టింది. తల్లిచేత చెప్పించాడు. మేనమామలచేత చీవాట్లు పెట్టించాడు. బంధువులచేత అడిగించాడు. ఇరుగుపొరుగు వారందరూ 'సూరన్నకొడుకు పెళ్ళిచేసుకోట్ట ముద్దియీడికి ఇరవై యేళ్ళొచ్చి. వాడెట్లాగూ యే కిరస్తానీ పిల్లనో తురక పిల్లనో పెళ్ళిచేసుకుండేవాడే. వెధవ మాలచదువులు. యెక్కడ దాపరించినయో కాని' అని తిట్టిపోయడం మొదలెట్టారు నారాయణరావునూ, చదువునుగూడా. చుట్టపక్కాలంగా చూసిపోవడానికి వచ్చిన ముసలమ్మ లందరూ 'ఏమిట్రా. అబ్బాయ్! పెళ్ళిచేసుకోనంటు న్నావుటా' అని దీర్ఘాలుతీస్తూ ప్రశ్నలువెయ్యటం సాగించారు. వాళ్ళందరికి అప్పటికప్పుడు యేవో సమాధానాలు చెప్పినా, నారాయణరావుకు మనస్సుమాత్రం విసుగెత్తింది. ఇంట్లోపోరు, బయటపోరు, వూళ్ళో గుసగుసలు, ఇక తప్పిందిగాదు నారాయణరావుకు పెళ్ళిచేసుకోక.

జబర్దస్తీగా యూ వైబళ్ళతో తర్లిపోయినారు పెళ్లికి సూరన్నగారు. ముత్తైదుల కోలాహలం, పిల్లల యేడ్పులూ, తుర్రకారువాళ్ళ గ్రామఫోను పాటలూ, బండివాళ్ళ అదిలింపులూ, ఎద్దులు తమాషాగా వూగుతూ చేసే గంటలధ్వనీ, విచిత్రమైన బండ్ల యిరుసుల చప్పుడూ, మధ్యమధ్య పెద్దలుచేసే అజమాయిషీ, తుర్రకారు భార్యాభర్తలు ప్రత్యేకంగా ఒక్కొక్క బండిలోచేరి (ఆబండిలో ఇంకొకరు యెక్కడానికి వీల్లేదు) చేసే సరస సల్లాపాలూ, ఓః, అర్ధంలేని హంగామా కావలసినంత. సంతోషానికి మేరలేదు.

మనలోమాట. పెళ్ళివారిని తీసుకువెళ్ళేటప్పుడు, పెళ్ళికొడుకు వారికి యేమీ ఆలోచనవుండేదు. భోజనం పెట్టేది పెళ్ళికూతురు తండ్రేగా! యేమన్నా పొర పాటువస్తే దబాయించవచ్చు. అంతమందికి తను తిండి పెట్టవలసివస్తేగా పెళ్ళికొడుకు తండ్రికి తెలిసేది కష్ట సుఖాలు.

అందరూ యింత సంతోషంగావున్నా పెండ్లి కొడుకు మొహానమాత్రం నెత్తురుచుక్కలేదు. 'పెళ్ళి అయ్యినతరువాత వాళ్ళువాళ్ళు బాగానేవుంటారులే. అప్పుడు మనం చెప్పనే అక్కరలేదు' అనుకున్నాడు సూరన్నగారు. నారాయణరావు మనస్సులోవుండే దుఃఖం ఆయనకేం తెలుసు పాపం పూర్వకాలపుమనిషి!!

'బలవంతపు బ్రాహ్మణార్థం' అన్నట్లుగా పెండ్లి జరిగింది నారాయణరావుకు. పెళ్ళికూతురు మొహమే చూడలేదు నారాయణరావు. సావిత్రిమాత్రం చిరునవ్వు నవ్వుతూ తలంబ్రాలు పోసింది. నారాయణరావు తల కాయ పైకెత్తలేదు, చిరునవ్వు నవ్వలేదు సరిగదా, యేదో విధిలేనట్టు, తప్పనిసరిగా తలంబ్రాలుపోశాడు సావిత్రి నెత్తిమీద. కొన్నిసార్లు అవి ప్రక్కగాగూడా పడ్డాయి పెళ్ళివారు ఆశ్చర్యపడ్డారు. సావిత్రిమనస్సు చివుక్కుమన్నది.

౪

నారాయణరావు విశ్వవిద్యాలయములో మొదటి వాడుగా పట్టభద్ర పరీక్షలో వుత్తీర్ణుడయినాడు. పరీక్ష సంగతి తెలుసుకొని, సెలవులలో అక్కడ అక్కడా తిరిగి యింటికిరాగానే తల్లి 'మంచిసంగతి చెప్పూకో చూద్దాం' అన్నది. నారాయణరావు గ్రహించాడు సూచనగా. 'ఏదో చెప్పవదూ' అన్నాడు విసుగుతో. 'కోడలు పెద్దమనిషి అయిందట' అన్నది తల్లి చాటంత మొహంచేసుకొని. సూరన్నగారు యేదో రాసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. కాని నారాయణ రావుకు గుండెలలో రాయిపడినట్లయింది.

నాలుగు నుమర్తలు అయినై. కార్యంచేసుకొని పిల్లను తీసుకెళ్ళవచ్చునని వచ్చింది కబురు సూరన్న గారికి. మాంభిముహోర్తం పెట్టుకొని, చుట్టపక్కాలకు కార్డువ్రాసి పిలిపించుకొని. సూరన్నగారు బయలు దేరారు కార్యానికి. బళ్ళోకివెళ్ళే పిల్లాడిమొహంలా వుంది నారాయణరావు మొహం.

ఏవేవో మంత్రాలు చదివారు పండితులు. ఏవేవో క్రియలు చేయించారు భార్యా భర్తలచేత, చివరకు శాస్త్రుల్లగారు 'అబ్బాయ్, అమ్మాయ్‌మీద చెయ్యివేసి పల్లెంపుచ్చుకో' అన్నాడు. సావిత్రికి వళ్ళు గగుర్పొడిచింది. నారాయణరావుకు ఆపని మనస్కరించలేదు. సిగ్గుగాదు ఇష్టంలేక.

భార్యాభర్తలను గదిలోకి పంపించారు. పంపించబోయేముందు శాస్త్రుల్లగారు సూరన్నగారిని చాటుగా పిలిచి 'చాలామంచిముహూర్తం సుమండీ. అబ్బాయికి చెప్పారా సైముసంగతి' అన్నాడు. 'ఓ! అంతా సరి చేశానులెండి' అన్నాడు సూరన్నగారు. పాపం సావిత్రి యెన్నో కోర్కెలు మనస్సులో పెట్టుకొని పోయింది గదిలోకి. ఆకలన్నీ మాయమయిపోయినై. భర్త పడుకున్నవాడు పడుకున్నట్టే వున్నాడు. కదల్లేదు. మెదలలేదు. సావిత్రి గదితలుపువేసి గుమ్మందగ్గర నుంచున్నది నుంచునట్టే వున్నది. భర్తదగ్గరనుంచి యేమీ సంజ్ఞ లేదు. పాపం ఆముగ్ధురాలి ప్రాణం యెంత తల్లడిల్లి పోయిందో! అక్కడనే కొంగుపరుచుకొని నిద్ర పోయింది. తెల్లవారగనే తల్లి 'చిట్టీ! కోప్పడ్డాడా' అని అడిగింది సావిత్రిని. ముంగురులు సవరిస్తూ. సావిత్రి యేమీ జవాబుచెప్పలేదు. ఏమని చెపుతుంది గనక.

రోజులుగడిచినై. అసలుకేమీ భిన్నంలేదు. సావిత్రి యీసంగతి ఎవరితోనూ చెప్పలేదు. చెప్పిమాత్రం యేం చేస్తుంది గనక! రోజుకు రోజూ క్షీణించడం మాత్రం అవుపడుతున్నది సావిత్రిలో. అత్తమామల యెదుట మాత్రం లేని సంతోషం తెచ్చుకొనేది.

ఒకరోజున అత్తగారు 'సావిత్రీ' నీవు బాగా వీణ వాయిస్తావుట గదా! దానిమంపడెగ ఒక్కసారన్నా పాడి వినిపించగూడదా' అన్నది. 'నాబతుకుకతోడు వీణగూడనా' అనుకున్నది సావిత్రి. పైకిమాత్రం, తెచ్చి పెట్టుకున్న చిరునవ్వుతో 'యేదో తీరటంలేదు పని మూలాన' అని సమాధానం చెప్పింది.

'అయినా ఒక్కసారి వాయిస్తే వినాలనని వున్న'దని అత్తగారు బలవంతపెట్టటంచేత, వీణ మీటుతూ 'నిరుపమాన సామిని నా నిలయమునకు రమ్మనవే' అని మనోహరంగా పాడటం మొదలెట్టింది. ఇంతట్లోకే నారాయణరావు చడావులతో 'టక్‌టక్' అని కొట్టుకుంటూ వచ్చి బుర్రున గదిలోకి పోయినాడు. సావిత్రి సిగ్గుపడ్డది. ఆసిగ్గులో భయమే ఎక్కువస్థానం ఆక్రమించుకున్నది. పాడటంమానేసింది. అత్తగారు 'ఫరవాలేదమ్మా, బాగుంది, పాడు' అని నిర్బంధపెట్టడంచేత మళ్ళీ ఆలాపించింది ఆచరణం.

అందరిని తన్మయులనుచేసే ఆభువనమోహన కంఠస్వరం ఆదుర్మార్గుడిని, కఠినచిత్తుణ్ణి, నారాయణరావును మాత్రం ఆకర్షించలేదు. అన్నాడుగదా నాపాపుటాలు యెగరవేస్తూ 'వస్తాడు, వస్తాడు తొందరపడకు' అని

ఆరాత్రి నారాయణరావు సావిత్రిని దగ్గరకురమ్మని సంజ్ఞచేశాడు వ్రేలితో.

సావిత్రి దగ్గరకువచ్చింది.

'ఏమిటి, మధ్యాహ్నం పాడుతున్నావ్?'

కంఠంలో యేమీ క్రోధంకనుపించలేదు. సంతోషించాడనుకున్నది పాపం సావిత్రి.

'చిన్నప్పుడేదో కొద్దిగా వీణవాయించటం నేర్చుకున్నాను. అత్తగారు పాడమని బలవంతంచేస్తే కాసేపు పాడాను' అని చెప్పింది సావిత్రి చిరునవ్వు నవ్వుతూ.

'ఊహూ! ఇంకా యెప్పుడూ అటువంటి పిచ్చి పనులు చెయ్యకు తెలిసిందా?' అన్నాడు మూర్ఖుడు తీవ్రంగా.

'నాకు తెలియదు. ఇంకా యెప్పుడుచెయ్యను' అన్నది బిక్కమొహంతో సావిత్రి. దుఃఖం ఆగలేదు. మొహం పక్కకుతిప్పి, వెక్కివెక్కి యేడుస్తూ అన్నది గదా 'నేను యివ్వాళ చాల పుణ్యంచేసుకున్నాను. కనుకనే నాతో మీరు యివ్వాళమాట్లాడారు. కాని నామీద అంత విముఖత్వానికి కారణమేమిటో, నాకు తెలియటంలేదు. నే నేదైనా ఘోరమయిన తప్పు చేస్తే, సూచనగా చెప్పితే చాలు సవరించుకుంటాను. తలిదండ్రులను అన్నదమ్ములను, వదలివచ్చింది మీ పాదసేవ చెయ్యటానికేగదా! మీరు నాతో మాట్లాడకపోతే నాకిక ప్రపంచమేమున్నది? మీ విముఖత్వ

నికి కారణమేమిటో చెప్మమని ఆలోచించాను. కాని నాకేమీ తట్టలేదు. మిమ్మల్ని అనేకవిధాల సంతోష పెట్టటానికి ప్రయత్నించాను. కాని అన్నీ వ్యర్థమయినై మరుక: నాకు ఇంగ్లీషురాకపోవటమే మీ విముఖత్వానికి కారణమైతే, నాకు నేర్పండి. నేర్చుకుంటాను. నేర్చుకునేంతవరకు నిద్రాహారాలు విసర్జించమన్నా విసర్జిస్తాను.' అంటూ భర్త పాదాలమీద తన తల కాయపెట్టి కళ్ళుతుడుచుకుంటూ 'మొట్టమొదటనే చెప్పాను మా నాన్నగారితో ఇంగ్లీషుచదువు చెప్పించమని. కాని ఆయన 'చిట్టీ! ఆడదానికి ఇంగ్లీషుచదువు లెందుకమ్మా. సంస్కృతంలో పంచకావ్యాలు చదివావాయెను. భారత భాగవతాలుచదివి అర్థంచేసుకో గల్గుదువుగదా! చాల్లే అన్నారు' అని తన అశ్రుధారలతో భర్తపాదాలను తడిపింది.

[ఇంతచేసినా దయరాలేదా నిర్దయుడికి. పాపాణం మరింత గనీభవించింది]

యథాప్రకారంగా సావిత్రి తెల్లవారుఝామునే నిద్రలేచింది. భర్త పక్కదగ్గరకు వెళ్ళింది. ఆశ్చర్యం! భర్త పక్కమీదలేడు. రోజూ లాగా తెల్లవారిన తర్వాతగాని లేవని భర్త యివ్వాళ అప్పుడే లేచిపోయినాడు. తెల్లవారింది. పొద్దెక్కింది. భోజనానికి వేళ అయింది. నారాయణరావు జాడలేదు. సూరన్నగారూ, భార్యా దిగులుపడి కూర్చున్నారు. అన్నం ముట్టుకో లేదు. రోజులుగడచినై. ఊళ్ళో గందరగోళంపుట్టింది. సూరన్నగారికొడుకు బ్రహ్మసమాజంలో చేరాడని. తొందరలో తీసుకురాలేకవచ్చారు నారాయణరావు గుంటూరులో బ్రహ్మసమాజపు కార్యదర్శి గోవిందరావుగారింట్లో వుంటున్నాడని.

సూరన్నగారూ, భార్యా బయలుదేరారు కుషిక్కుంచినదేహాలతో గుంటూరుకు. గోవిందరావుగారి దగ్గరకు వెళ్ళి సూరన్నగారు వుత్తరీయపు చెరగుపట్టి, 'అయ్యా! నాకు పుత్రభిక్షపెట్టండి బాబూ! నాకు లేకలేక ఒక్కడేపుట్టాడు. నావంశం వాడితో తరించాలి. బాబూ! నా కొడుకును నాకియ్యండి. నేను పోతాను' అని హృదయంకరిగేటట్టు ప్రార్థించాడు. భార్య పెద్దపెట్టున యేడవడం సాగించింది. గోవిందరావు పంతులుగారు నారాయణరావును పిలిచాడు. నారాయణరావు మేడమీది వరండాలోకి వచ్చినుంచున్నాడు. చూచే మాత్రంలోనే తల్లి 'మా నాయనే, మా నాయనే, అని చేతులుచాపి యేడుపు ఎక్కువ చేసింది. సూరన్నగారు 'నాయనా! ఇంటికివెళ్ళుదాం, రా. నీకేంతక్కువ. రా! నాయనా! రా.' అని పిలిచాడు. వారి స్థితిచూచి నారాయణరావుకు జాలివేసింది. తలకాయ వంచుకున్నాడు, కళ్ళనీళ్ళు గిర్రున తిరిగినై, ఇంతలోనే మిస్ సుశీ 'ఏమిటి నారాయణరావు! ఆడదానిలాగా నువుగూడా యేడుస్తావు? అంత మెత్తమనస్సువాడివి మొట్టమొదటనే ఆలోచించుకోకపోయినావా?' అంటూ చెయ్యిపట్టుకొని తీసికెళ్ళింది.

తల్లిదండ్రులు యెంత రోదనధ్వనిచేసినా లాభం లేకపోయింది. మళ్ళీ నారాయణరావు బయటికిరాలేదు. అన్నాడుగదా సూరన్నగారు భార్యతో 'మనకు కొడుకు లేడు. మనకొడుకు చచ్చిపోయి చాలా రోజులయింది. వృథాగా యేడవకు. వెళ్ళుదాం. రా.' అని చెయ్యిపట్టుకొని లాక్కెళ్ళాడు.

—సశేషము.

—కసాంబమూర్తి.


## ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౨౫-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | ... | రు. ౩-౦-౦ |
| అర్థ సంవత్సరమునకు | ... | రు. ౧-౮-౦ |
| నాలుగు మాసములకు | ... | రు. ౧-౦-౦ |
| విడిసంచిక | ... | రు. ౦-౪-౦ |

# ఆంధ్రసాహిత్యము

'ఆంధ్రప్రజలు ఆంధ్రభాష యెడల నాదరము చూపుటలేదు; ఆంధ్రసాహిత్యము నెడల మమకారము గనబఱచుటలేదు.' అని పెద్దలు కటకటంపడుట నేడు కాంచుచున్నాము. ఆంధ్రసాహిత్యమన్న నాంధ్రులింత చిన్నచూపు చూడనేల? అది యాంధ్రుల లోపమా? ఆంధ్రసాహిత్యము లోపమా?

ఈ లోప మాంధ్రజనుల యందుకంటె నాంధ్ర సాహిత్యమునందే మెండుగనున్నట్లు గానగుచున్నది. దేశమాదరించినచో నున్నతసాహిత్యము, ఉత్తమ సాహిత్యము బయల్వెడలుట యథార్థము కాని దేశమానసము నాకర్షించుటకు నేటిసాహిత్యము నడచుచున్న మార్గమేది? ప్రణయమార్గము.

కామము పురుషార్థములలో నొకటి గాదా? రసములందు శృంగారము పరమోత్తమముగాదా? నేటిసాహిత్యము మానవుని కామలాలసునిగ—మనోహారిణీ కటాక్ష పాశబద్ధునిగ, నొనరించి శృంగారరసవాహిని యందు తెప్ప దేలించుటలేదా?

అవును; నిశ్చయమే. తేలించుచున్నది. అంతియకాదు; ఉత్తుంగ తరంగమాలికల యందు - ముంచుచు నెత్తుచు - నుక్కిరిబిక్కిరి యగునట్లు సేయుచున్నది. కాని ప్రయోజనమేమి? 'న పీయతే కావ్యరసం పిపాసితైః నభుజ్యతే వ్యాకరణం బుభుక్షితైః' అనునట్లు కావ్యమునందెంతరసము పొంగిపొరలి తెట్టలుగట్టుచు పాఱుచున్నను దప్పికచే నాలుక గుంజుకొనిపోవు వానికొక్క గ్రుక్కయైన రసము లభింపదుగదా! సమగ్ర వ్యాకరణశాస్త్రమును ఆకలిచే నకనకపడుచుండు వానికొక్క కబళమైన నన్నముగా లేదుగదా! కడుపునింపక ఆకటి చిచ్చున కృశించికృశించి యుండువారు ప్రణయగీతములవలన నేమి యానందము నొందగలరు?

'సాహిత్యము' సహితము యొక్క భావము. సహితమనగా హితముతో గూడినది, కాగా హితకరమైనది సాహిత్యమనియు కానిది కాదనియు ప్రకటమగుచున్నది. కనుకనే 'కాంతాసమ్మితయా యయా సరసతా మాపాద్య కావ్యశ్రియా కర్తవ్యేకుతుకీ బుధోవిరచితః తస్యైస్పృహాంకుర్మహే' అందురు. దీనింబట్టి కావ్యము సరసత్వమును గలిగించి మానవుని కర్తవ్యపరాయణుని జేయవలయును అనుట తెల్లము. కామము పురుషార్థమయినను అది ప్రథమముగానీ, చరమముగానీ కాదు. ఒక మానవుండు ప్రణయమువలని యానందము ననుభవింప వలయునన్న నుఱికొన్ని వస్తువులు—పరిస్థితులు ఆవశ్యకము.

ప్రొద్దు పొడిచినది మొదలు మఱల ప్రొద్దుపొడుచు నంతదాక—అఱువది గడియలు—ప్రణయ లాలసుండై—ప్రణయోన్మత్తుండై యదియే పరమార్థముగ భావించి యితర ప్రపంచమెఱుగక యుండువాడు ఎన్నడైన సౌఖ్యము నొందగలడా? బ్రదుకగలడా? అతని జీవితము గడియలమీద నుండుననుటలో నబ్బురముండునా?

మనుజునకు ఆహారముండవలయును. భోజనము చేయవలయును. పరిశ్రమమును, విశ్రాంతియు గావలయును. బలమును ఉత్సాహమును జీవగఱ్ఱలు. ధనము మఱవరానిది.

విలాసవస్తువులు అత్యావశ్యకములు. అప్పుడు సుఖము—ఆనందము. అనుభవ యోగ్యములు. ఇందేది లేకపోయినను తేనెలో జిక్కుపడ్డ యీగవలె—ఆనందము నొందుట యటుండ యవస్థలపాలుగాక తప్పదు. మానవుడు సుఖముగ జీవించుటకు-పరమానందము నొందుటకు - చేయవలయు కార్యములు పెక్కులు. వానిపైపు తొంగి యైన చూడక ప్రణయమునే—కేవల ముక్క ప్రణయమునే చేపట్టి యాలపించుచున్నచో సాహిత్యమప్పుడు కృశీభూత రక్తమాంసమై, కళావిహీనమై, యాదరపొట్టతోనో బోదకాలితోనో వికృతరూపము వహియింపదా? కనుకనే సాహిత్యదృష్టి మారవలయుననుట.

పనిపాటలనేవగించుచు ఇతరులు కష్టపడి యుత్పత్తిచేసిన పదార్థములను నిరర్థకముగ పాడుచేయుచు కాలమును నెట్టుటకు నిద్రాదేవినో, మఱియొక దేవినో లాలించుచు, చదరంగములలోనో చీట్లపేకలలోనో మునిగి, విజాతీయ క్రీడా విహారములలో దేలుచు నాగరకమనుష్యులై తగుదుమని సంచరించుచు సంఘగౌరవమును మాఱగొనుచు పెక్కురున్నారే: వీరిని కార్యక్షేత్రమునకు ద్రిప్పి, సంఘమునకు భారరూపులు గాకుండ జేయుటకు సాహిత్యము కంకణము పూనరాదా?

చదువు సంధ్యలకు స్వస్తిచెప్పి తెలివితేటలయెడ పగబూని తల్లిదండ్రుల మాటలను సంకెలలకు సేనములై రసికమానులై ఉపాహారశాలలందు చతుర్ముఖ రామాయణములందు, నిరంతరాగ్ని హోత్రాదులందు దొరకినంతమట్టు ధనము నాహుతిసేయుచు కంటబడినవారిని పరిహసించుటయే ధర్మముగ మెలంగుచుండు కుమారులను కర్తవ్యముల నుపదేశించి కార్యపరులుగ జేయుటకు సాహిత్యము రవంత తలంపరాదా?

రేయుంబవలు ప్రపంచము నెఱుంగక - నిద్రాహారము లెఱుంగక శ్రమంపడి పరీక్షలందు నెగ్గి, కుటుంబమును పోషించుకొను తెన్నుగానక—తాము చదువులకు వెచ్చించిన ధనమునైన గడించుకొనలేక, యెట్టులేని పొట్టపోసికొన బ్రాకులాడుచుండు యువకులకు పరిశ్రమలందు, నూత్నవస్తూత్పాదనము నందు, వ్యాపారము నందు గౌరవబుద్ధిని, అభిరుచిని, ఉత్సాహమును గలిగించి వారిని రక్షించి పుణ్యముగట్టుకొనుటకు సాహిత్యము నోచుకొనలేదా?

పగలనక రాత్రియనక-వురుగనక పుట్రయనక మున్నూటరువది దినాలు వంచిన నడుమెత్తక నెత్తు రిగిరిపోవునట్లు పాటువడుచు - 'అప్పప్పు' యని ప్రాకులాడుచు నెదురువచ్చు ముద్దుకుఱ్ఱని దెసకు మోమైన ద్రిప్పక—సానునయ దృష్టులతో గష్టమున పాల్గొను కాంతామణిని ముచ్చటకైన బలుకరింపజాలక - తిండి తినుటకేని తీఱిక-అవవరత కార్య నిర్వహణమున నసురుసు రగుచు నప్పటికిని గడుపు నిండీనిండని యాయమును దలంచుకొని, వేడి నిట్టూర్పులు వుచ్చుచు తన దుర్దయివమును దూఱి పోయుచు నుండు కర్షకునకు నింత సాంత్వనమైన జూపగూడదా సాహిత్యము?

రెండుమూడణాల నాసించి వేగుజాము మొదలు జాముకాత్రిదాక - యజమాని సేవకొఱకు బ్రదుకు పెంపుకుక్కవలె - ఆలుబిడ్డలతో గూడ - నదియిది యనక - అరమరలేక-చావడీఱక-పాటుపడుచు, ఆఱీ యాఱని యాకటిచిచ్చుచే నకనకపడుచు షావుకారుల లాభమే పరమార్థముగ భావించుచు కూలికి నిమముద్రావుచున్న

మానవుల నొక్క కడగంటిచూపుతోనైన కరుణింపరాదా సాహిత్యము?

ఆపదలందు దగుల్కొని చేయూతఁగోరి చెంతకు వచ్చినవారిని అదేయదనని, నియమ పాశములతో సాలీడువోలె బంధించి, మఱి తప్పించుకొనుటకు వీలుగాకుండ, మితిమీఱిన వడ్డీలు - వడ్డీలకువడ్డీలు - గట్టుచు, ఋణగ్రస్తుల రక్తమును, చల్లచల్లగ జలగలవలె - పీల్చుచుచు దనివిదీఱక, ఉన్న కొంప్రను గట్టుకొనియు విడిచిపెట్టక - వేపుకొనితినుచు, తాము ప్రకృతిమాత కనుగు బిడ్డలనియు, లోకమెల్ల దమ శుభమునకై పాటుపడుట పరమధర్మమనియు భావించుచుండు వడ్డీవ్యాపారుల మూలమున ఋణగ్రస్తులు పాల్పడు కడగండ్లనుగాంచి యొక్క కన్నీటి చుక్కనైనను గార్పరాదా సాహిత్యము ?

సాహిత్యము, తమ యిచ్చవచ్చిన మొత్తములకు కంట్రాక్టుల నొసగువారిని పురపాలన సంఘాధ్యక్షులుగ - స్థానికసంస్థాధిపతులుగ రప్పించుటకై పారిశ్రామికుల రక్తసారమగు ధనములు - మంచిచెడ్డలు లేక విచ్చలవిడిగ వెదజల్లుచుండు లక్ష్మీపుత్రుల కింత జ్ఞానాంజనము వేసి అనాథాలయములను, దేశహితకార్యములను జూపరాదా?

తోడి మానవులను జంతువులకంటె నీచాతినీచముగ జూచుచు, పేరైన నుచ్చరింప నొల్లక — వారి పొడగానరానీయక, దేవుని పేరిట ద్రోహముసేయుచు నవకతవక శాస్త్రములచాటున దాగుడుమూత లాడువారిని విశాలలోక రంగమునకు గొనితేఁటరాదా?

దురాచారములు, సంఘద్రోహములు, మూఢవిశ్వాసములు, స్వార్థపరత్వములు, బానిసతనములు మున్నగు నవెన్నియో సంఘమును క్రుళ్ళబెట్టుచుండగా వానిని బయటపడవైచి క్రుళ్లుదనమును పోగొట్టి సంఘమును సంస్కరింపక సాహిత్యము చేయునది మఱి ప్రణయగీతాలాపనమా? కొంప యంటుకొనిపోవుచుండగా కూనిరాగములా? 'గాలింబెట్టనదీపము పోలిక జీవంబు నమ్మబోలునె దీనిఁ దూలునిది రేపొ మాపో యేలాదీనికి నభీష్టమిచ్చుటలు శివా' అనెడు కలువాయి వేదాంతమునా సాహిత్యమిప్పు డుపదేశించునది? ఇప్పు డిట్టివైరాగ్యము లెంతశీఘ్రముగ నొడ్డుపట్టిన నంత మేలు సంఘము-ప్రజాభిప్రాయము-ఉద్యమములు అన్నియు సాహిత్యముచేతి కీలుబొమ్మలు. సాహిత్యము అట్టి తనధర్మము నుండి చేతాలు కడుగుకొని యొకమూల గొదుగుట విచారకరము.

ఉబుసుపోకకు పెనుగుచుండును గాని సాహిత్యమున కింతటిశక్తిగలదా యని శంకించుట సాహిత్యమహత్త్వమునకు కలంకాపాదకము. థామస్ పెయిన్ సృష్టించిన క్రైసిస్-కామన్ సెన్సులే గాదా పరాను దేశమునకు ప్రాణములొసంగినది?

భీకరశత్రు సైన్యముచే నాక్రాంతమగు మనుమసిద్ధి మహీనాథరాజ్యమును రక్షించినది తిక్కనామాత్యుని సాహిత్యము గాదా? గజపతిచే కబళింపబడిన విజయనగర సామ్రాజ్యమును అవలీలగా పాడగల్గినది పెద్దనామాత్యుని కవితానతి గాదా? అంత దూరమేల? నిన్నమొన్న సత్యాగ్రహ సమరమున వంగదేశము నుత్సాహావేశ పరవశము గావింప లేదా చిత్తరంజనుని లేఖని. ఇటులు లెక్కలేని యుదాహరణములు సాహిత్య మహత్త్వమును జాటుచుండఁగా నెవరు శంకింపగలరు? కనుక సాహిత్యనిర్మాతలు దేశౌన్నత్య ప్రధానమగు సాహిత్యమును వెలయింతురుగాత!

—వఝల మూడి వేంకటరత్నము,

## చంద్రగ్రహమున ప్రాణులు కనుగొనబడినవుడు

ప్రారంభింపబడిన రెండు సంవత్సరముల అనంతరము 1833-వ సంవత్సరమునందు న్యూయార్కు నందలి 'సన్' అను దినపత్రిక ప్రపంచమునందలి ఏ దినపత్రికకంటెను తన ప్రచారము విశేషమైనదని ప్రకటించెను. మంచి వార్తల త్వరసంగ్రహముచే నా పత్రిక పలువురు పాఠకుల నాకర్షించెను. కాని దాని విశేషప్రచారమునకు ముఖ్యకారణము వార్తా పత్రికలచరిత్రలో అద్భుతమైన ఒక తమాషాకథ ప్రచురించుట. రిచర్డుయాడమ్సు లాక్ అనునతడు సన్ పత్రికకు ప్రధానసంపాదకుడు. అతడు ఆ దినములలో దక్షిణ అఫ్రికాయందలి కేప్ టవున్‌లోని నక్షత్ర పరిశోధకశాలలో పెద్ద టెలిస్కోపుతో సర్ జాన్ హెర్‌షెల్ అను జ్యోతిష్యశాస్త్రవేత్త చంద్రగ్రహమును చూచుచుండుటను గూర్చి విదేశవార్తలలో చదువుచుండెను. ఈ వార్తల నుపలక్షించి అతడు ఊహాప్రపంచమున నిరాఘాట సంచారముగావించుచు వ్యాసపరంపర కురియించెను. సర్ జాన్ హెర్‌షెల్ చంద్రగ్రహమున ప్రాణులు నివశించుచుండుట కనుగొనెననియు, ఆ ప్రాణులలో బూడిదరంగు వాలుగుకాళ్ళ జంతువులు గుంపులుగుంపులుగా నివసించుచున్నవనియు, ఆ జంతువులు బైసన్ అనబడు అడవిగేదెల లక్షణములుకలిగి పరిమాణమున వానికంటె చిన్నవిగా నున్నవనియు ఇత్యాదిగా రిచర్డు వ్రాయదొడంగెను. న్యూయార్కు ప్రజలు రాజకీయములను పూర్తిగ విస్మరించి సన్ పత్రికసంచికలను కొని చదువనొడంగిరి. రిచర్డు ఈమాదిరిగా వ్రాయుచునే యుండెను. ఒక వ్యాసమున నాతడు మేకఅంత పరిమాణముకలిగి ముందుకువంగిన ఒకటే కొమ్ముకలిగి నీలివర్ణముకలిసిన సీసపురంగులో ఉన్న వికృతాకారపు జంతువులు చంద్రగ్రహమున నిండారియున్నవనియు, ఈ వికృతపు జంతువులలో ఆడవానికి కొమ్ముగాని గడ్డముగాని లేక మగవానికంటె మిక్కిలి పొడుగైన తోకమాత్ర ముండెననియు వ్రాసెను. చంద్రగ్రహమున నున్న ఈ వికృతాకారపు జంతువులనుగూర్చి న్యూయార్కు ప్రజలు పత్రికనుండియలు ప్రస్తావించుకొనుచుండిరి. కాని ఒకసారి ప్రమాదవశమున రిచర్డు చంద్రగ్రహమున అట్టిజంతువులు లేవని వ్రాసివైచెను. వ్రాసివైచినను సన్ పత్రిక ప్రచారము తగ్గలేదు. వచ్చిన ప్రచారము నిలబడెను. సన్ పత్రిక కొంతకాలమునకు చేతులు మారెను. అప్పటి దాని స్వామదారుడు మోశెస్ యేల్ బీచ్ అనువాడు ఎడ్గార్ యాలెన్‌పో అనువాడు బెలూన్‌లో మూడుదినములకు అట్లాంటిక్ మహాసముద్రమును దాటినట్లు ప్రచురించెను. ఇది 1844 లోని వృత్తాంతము. కాని ఇది ఒకనాటిముచ్చట యయ్యెను. రిచర్డు కథలు వారములకొలది యుండెను.

—న్యూస్ వీక్.

* * *

## ఉత్కృష్ట సిద్ధాంతము

సమస్త విశ్వముయొక్క అంతరార్థము తనకు వ్యక్తముగాకమునుపే మానవుడు స్వబుద్ధిచే కార్యకలాపమును వినియోగించుచున్నాడు. లోకమున ధర్మనిర్వహణ మెట్లు గావింపబడుచున్నదో పరిశీలన జేయుటకు బూర్వమే యాధ్యాత్మిక దృష్టిచే నది భగవత్సంకల్పితమని తెలిసికొనుచున్నాడు. ఎల్లరును ధర్మవిజయమునందే యాసక్తులై యుండుట స్వాభావికము గదా. ఈప్రపంచమునెల్ల శాసించు పరమ సూత్రము గూడ నట్టి ధర్మవిజయమునకే తావొసంగుచున్నది. మనుజానకును, మనుజానకునుగల లౌకిక వ్యవహారములయందేమి, మనుజానకును, ఈశ్వరునకును గల సంబంధ బాంధవ్యములయందేమి, న్యాయవిరుద్ధముగు కార్యము

సంఘటిల్లుట కెట్టి యవకాశమును లేదు. న్యాయమనగా
మనుజులు తమతమ యిష్టానుసారముగా తమకుగల్గు
భిన్నభావముల కనుగుణ్యముగా నేర్పఱచుకొను సిద్ధాం
తముఁగాదు. న్యాయఫలితము ననుభవింపగల వ్యక్తి
పురోభివృద్ధి నుద్దేశించి న్యాయమనగా నేమో నిర్వ
చించుటయే ముఖ్య కర్తవ్యము. కావున జగత్తులో సంభ
వించు ప్రతి కార్యమును ఈశ్వరేచ్ఛగా నెఱుంగునది.
ఒకానొకచో వ్యాధిగ్రస్తుఁడ వగుదువు మఱియొకచో
పెనుబాముల లోనగుదువు. అట్టియెడ దుఃఖితుఁడవై,
అయ్యయో! యెట్టి కష్టములపాలైతిని. ఇవన్నియు
లేకుండినచో నెంతయో బాగుండును గదా యని తలం
పకుము ధైర్యసాహసములతో గూడినవాడవై నీ శక్తి
కొలది యుత్సాహ పూర్వకముగా నెదుర్కొనుము.
ఎట్టి ప్రతీకారమునుఁ జేయుదలపకేని దోసిలియొగ్గుము.
ఎట్లయినను ముఖాముఖీ ప్రవర్తనమే యుచితమగును.
భగవంతుఁడేమి యొనర్చినను నీ మేలునకేనని విశ్వసించి
యట్టి దుర్ఘటనలకు నీవు లోనగుట యత్యావశ్యక
మేమో యోజింపుము. ఒకప్పుడు సకలైశ్వర్యములతో
తులదూగెదవుగాక. అట్టియెడ ముఖ్యముగా కడు జాగ
రూకుఁడవై మెలఁగుటయే శ్రేయస్కరము. సుఖదుఃఖ
ములయెడ సమానభావముగలిగినవాడే ధీరుఁడనిపించు
కొనును. వాని ఫలానుభవము స్థిరముగానుండక తాత్కా
లికముగా వచ్చి యది వెంటనే నశించునట్టిదిగాన
వానిని సహింపుము. క్రోధపరిత్యాగమే మోక్షసాధన
మునకు మూలసూత్రము. మనుజుఁడు క్రోధావేశ పూరి
తుఁడగుచో యాతని శీలమున కొక కళంకము తేబడు
చున్నది. ప్రశాంతమగు చిత్తమును వహించి, యెట్టి
యాందోళనయు పరిత్యజించి వర్తించుచో సర్వదా
శ్రేయమగును. సర్వజ్ఞుడైన నీశ్వరుని యాజ్ఞకు బద్ధుడై
దిరుగు నీ భూవలయమందు గర్భశత్రువే తుదకు ప్రాణ
మిత్రుఁడగుచున్నాడు. అట్టిచో తన గుణశీలముల
నుత్తమ మార్గముల పెంపొందింప సమకట్టు మానవునకు
ప్రకృతియందుగల సర్వభూతములనుఁ దోడ్పడుటలో
యాశ్చర్యమేమి గలదు? కాన ధర్మమునకే యఖండ
విజయమని విశ్వసించి, యాధ్యాత్మిక జీవనమే పరమా
వధిగా నెంచి, యీలోకముననే యట్టి జీవయాత్రను
కొనసాగింప బూనుకొనుము. పరనిందయు క్రోధమన
స్కుల కొక లక్షణమే యగును. ఒకానొకచో కొని
యాడుటకూడ తప్పిదమే యగుచున్నది. ఏలనన
న్యాయాన్యాయ విచక్షణాసామర్థ్యము నీ యందారో
పణము చేసికొనిన వాడ వగుచున్నావు. అట్టివర్తన
మాత్మస్తుతికి కారణమగుచున్నది. పరదూషణమన,
యాందోళనా వైపరీత్యము దానిలో యధికముగా
జొచ్చి మనోనైర్మల్యమును రూపుమాప యత్నించును.
కాన పరదూషణ మింకను పాపమేయగును. జ్ఞానపూ
రితమగు విమర్శ యొవ్యక్తికిని హానిచేయఁజాలదు గాని
యావేశపూరితమగుచో విమర్శకుని శక్తియంతయు
నిస్సారమే యగుచున్నది. వ్యక్తుల యోగ్యతాయో
గ్యత విమర్శలకు గడంగుచో యొండొరులు సమానదృష్టి
ప్రతిపాదించుటయే గౌరవనీయము. అట్టి విమర్శయే
పరస్పర భావస్వరూపణమునకు తావొసంగుచున్నది.
భారతేతిహాసమున యుధిష్ఠిరుని చరిత్రమే మనకీ
సిద్ధాంత నిరూపణమునకుఁ బ్రబల నిదర్శనము. మాయల
మారి శకుని ద్యూతమే యుధిష్ఠిరుని జీవితములో నొక
గొప్ప మార్పుఁగలుగఁజేసి యాతని శౌర్య ధైర్య
గాంభీర్యాది గుణములఁ బ్రజ్వలింపజేసినది. యుద్ధానంత
రము మనకులభించు యుధిష్ఠిరుఁడు తొలుత యుధిష్ఠి
రుఁడు కానేరఁడు. అశాశ్వతములగు కోరికలయందు
తౌల్యమునకై ప్రవర్తింపవలసిన కాల మాసన్నమైనది.
ఆత్మజ్ఞానముఁ గలిగి క్షేమస్వరూపుఁడవై విషయ పరి
శీలనమునకుఁ గడంగవలసిన రోజులివి. ఏనాడట్టి
పూనిక నెలవేర్తువో యానాడే సమస్త విశ్వము
నీ సందేశమునకై యెదురుచూచును. అప్పుడే నీవు
పునరావృత్తి రహితమైన మోక్షపదము లభించును.
మానవజన్మ యీపరమపద ప్రాకారమునకేగదా విశ్వ
ప్రయత్న మొనరించుచున్నది.

(ఎర్నెస్టువుడ్ గారి ఆంగ్లవ్యాసమున కనువాదము.)

—పిల్లలమఱ్ఱి జానకిరామయ్య. బి.ఎ.

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొన పత్రికాముఖమున జిజ్ఞాస నలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.



### 31. దయ్యములు

దయ్యాలు లేవని భావించటం ఈకాలపు మూఢనమ్మకాలలో ఒకటి. అటువంటి లమ్మకం కల వాళ్ళు తమ నమ్మకాన్ని దృఢపరుచుకు నేటందుకు తగిన ప్రయత్నంచేసినట్లు కనపడదు. సహజమైన చావు చావక బలవన్మరణం పొందినవాళ్ళు మాత్రమే దయ్యాలవుతారు. వాళ్ళలోకూడా అంతా అవుతారని చెప్పలేం. సహజమైన చావు చచ్చినవాళ్ళు ఇహవాసనను పొంతంగా వదిలించుకుని మహాత్మజీవులై వారి లోకానికిపోతారు. బలవన్మరణం సంభవించిన వాళ్ళు ఈ ప్రపంచానికీ ఆ ప్రపంచానికీకూడా కాకుండా తిరుగుతూంటారు. వారిదృష్టి యావత్తూ ఈ ప్రపంచంమీదే ఉంటుంది. మనం వారికి కనపడుతూంటాం. మనంచేసే పనులన్నీ వారికీ చెయ్యాలని ఉంటుంది. కాని వాళ్ళు మనకు కనపడనికారణంచేతా వారిని మనం గమనించాలని ప్రయత్నంచేయకపోవటంవల్లా వాళ్ళకు త్వరలోనే వెర్రెత్తుతుంది. ఇటువంటి అనుభవం ఆ పరిస్థితులలో మనకే వస్తుంది. అటువంటి దయ్యాలు కొన్ని కలిసి దాడివెడలుతై మనుష్యుల మీదికి.

కొంతమందికి (సామాన్యంగా స్త్రీలందరికీ) సైకిల్ పవర్ (రోగశక్తి) ఉంది. అటువంటి శక్తిగల వాళ్ళనీ దయ్యాలు సులభంగా ఆవేశించగలవు. ఆ విధంగా ఆవేశించినప్పుడు మనవాళ్ళచెప్పులూ చపురుకట్టలూ తీసుకుని దయ్యంపట్టిన మనిషిని కొట్టటంకద్దు. అనేక దయ్యాలకు తాము చచ్చినట్టుకూడా తెలీదు. కొన్నిటికి తెలిసినా ఇంకా చెప్పు దెబ్బ లభయం పోదు. అందుచేత కాని నిజంగా దెబ్బలు దయ్యానికితగిలే కాని దయ్యం తాత్కాలికంగా మనిషిని విడిచిపోయినా, మనదృష్టిని ఆకర్షించగలిగినందుకు తృప్తిపడి, పదేపదే తిరిగివస్తూ ఉండటం, ఆవేశించిన మనిషిచేత ఘోరమైన పనులుచేయించి ఆ మనిషిశరీరం హూనం చెయ్యటం అవుతూఉంటుంది. నా ఉద్దేశం దయ్యాలతో మృదువుగా సంభాషించటం మంచిదని. దయ్యాల విషయంలో సానుభూతిచూపిస్తే ఆవేశించిన మనిషికి బాధ తగ్గుతుంది. రంగుముగ్గులూ బిందెనాదాలూ దయ్యాలని భయపెట్టటానికే.

ఇక వాటిజీవితం చాలా హేయంగా నిరర్థకంగా ఉంటుందనటానికి సందేహంలేదు. వాటి ప్రపంచంలో చాలా కొద్దిసంఖ్య. ఒక దయ్యాన్నిచూస్తే ఒక దయ్యానికున్న ఆకర్షణకన్న అన్నిటికీ భూమిమీద జీవితాన్నిచూస్తే. ప్రేమజాస్తి. ఇందులో కొందరు నాయకులుగా ఉండి మిగిలినదయ్యాలకు దారితీస్తూండటంకూడా జరుగుతుంది. అందుచేతే ఒక్క దయ్యం 'నేను ఫలానావారి అన్నపూర్ణమ్మ శిష్యురాలిని!' అని గర్వంగా చెప్పుకుంటుంది. దయ్యాలు, పాపం. మధ్యమధ్య ఆత్మకథ ప్రారంభిస్తే చూసేవాళ్ళు ఎగతాళిచేసో, తిట్టో, కొట్టో దానికి వెర్రెత్తిస్తారు. మన సంఘంలో ఉండగా నాగరికతకు కట్టుబడిఉన్న మృగసంబంధమైన ఉద్రేకాలన్నీ దయ్యంకాగానే అంకుశం పోవటంవల్ల పైకొచ్చిరేగటం మొదలుపెడతై.

—కొడవటిగంటి కుటుంబరావు.

### 27 గాంధి: సర్వమతసమావేశము.

సాధారణముగ గాంధివాదము యిదివరకు ప్రఖ్యాతముగ లేక, మహాత్మునివలన ప్రశస్తము గుట చేత,

ఎచ్చట గాంధినామము కనుపించినను 'ఈ గాంధి మహాత్ముడే యతడని భ్రమకలుగుట సహజము. అదేరీతి 'శ్రీ వివేకానందస్వాముల వారితో 1893 సెప్టెంబరులో చికాగోనగరమున జరిగిన సర్వమత సమ్మేళనమునందు జైనమత ప్రతినిధియైన గాంధి మన మహాత్ముడైయుండునా' యను సందియము కలుగుట సహజము. కాని మహాత్ముని స్వీయచరిత్రప్రకారము 1893 ఏప్రిలు నెలలో వారి దక్షిణాఫ్రికాకు ప్రథమ ప్రయాణమునకు బయలుదేరిరి. అప్పుడే సంవత్సరాంతములోగా కొన్ని మతగ్రంథములతో వీరికి పరిచయము కలిగి సర్వమతగ్రంథముల పఠింపమొదలిడిరి. జైనమతమునుకూడ అప్పుడే కొంతవరకు చదివిరి. కాని ప్రతినిధిగ పోగల పాండిత్యమును సంపాదింపలేదు మరియును స్వీయచరిత్రమున తన మతమగు హిందూ గ్రంథములయందు శ్రద్ధ యధికమాయెనని చెప్పియుండిరి. 1893 సెప్టెంబరు 11 తారీఖునకు ఆఫ్రికాలో తనకేసులో మగ్నుడైయుండెను. అందుచేత అమెరికాలో యిట్టి సర్వమత సమ్మేళనమొండు జరుగుననిగూడ వారికి తెలిసియుండదని నా నమ్మిక.

—కె. వి. ముకుందరావు.

33 సంశయము

శ్రీ తటవర్తి సూర్యనారాయణమూర్తిగారిచ్చిన శ్లోకమునందలి స్త్రీ విరహపీడితయై విరహోద్రేక కారకులగు మన్మథ చంద్రులను మాటిమాటికి నిందించుచున్నది. శ్లోకములో శ్రీరాముడు, వానరపుంగవుడు, మధురిపుడు, మారస్య మౌర్వీరవం, కుంభోద్భూత మహాముని, పురహరుండు, రాహువు, రవేఃసారధి అను ఎనమండుగురను దూషించుచున్నది. ఈ ఎనమండుగురిలో అర్ధురను చంద్రసంబంధమునను, ఇరువురను మన్మథ సంబంధమునను ఆస్త్రీ దూషించుచున్నది. చంద్రసంబంధమున దూషణము పొందినవారు: 1. 'రామం': చంద్రుడు సముద్రపుత్రుడు. శ్రీరాముడు వారధికట్టినపుడు పర్వతము నొకదానిని సముద్ర పుత్రుడగు చంద్రునిమీద కూడ పడవైచినచో చంద్రుడు చచ్చియుండును. అట్లుగావింపకుండినందులకు ఆస్త్రీ రాముని నిందించుచున్నది. 2. 'వానరపుంగవం': హనుమంతుడు జన్మించిన వెంటనే క్షుత్పీడితుడై ఫలభ్రాంతిచే సూర్యుని మ్రింగబోయెను కాని చంద్రుని మ్రింగకూడదా అని ఆస్త్రీ అతనిని నిందించుచున్నది 3. 'కుంభోద్భూత మహాముని': అనగా అగస్త్యుడు. అగస్త్యమహాముని పూర్వము 'సముద్రమును' ఆచమనమొనరించినపుడు సముద్రపుత్రుడగు చంద్రుని జీర్ణము చేసికొనక తిరిగి సముద్రములోబాటు అతనిని వదలిపెట్టియుండెను. ఈకారణముచే ఆస్త్రీ అగస్త్యుని నిందించుచున్నది. 4. 'పురహరం': అనగా ఈశ్వరుడు దుర్మార్గుడగు చంద్రుని తలపైనెక్కించుకొనినందులకు ఆస్త్రీ ఈశ్వరుని దూషించుచున్నది. 5. 'రాహుం': దుర్మార్గుడగు చంద్రుని దిగమ్రింగక తిరిగి విడుచుట యెందులకని ఆస్త్రీ రాహువును నిందించుచున్నది. 6. 'రవేః సారధిం': రాత్రిరాకుండ సర్వకాలమును పగలే యుండునట్లుగ సూర్యునిరథమును తోలక చంద్రుని రాకకు వీలుకల్గించు రాత్రికి అవకాశముండునట్లు తోలు రవిసూతుని ఆమె నిందించుచున్నది. ఇక మన్మథ సంబంధమున దూషణము పొందినవారు. 7. 'మధురిపుం': దుర్మార్గుడగు మన్మథుని కుమారుని గాకనినందులకు ఆస్త్రీ విష్ణువును నిందించు చున్నది. 8. 'మారస్య మౌర్వీరవం': మన్మథునియొక్క ధనుష్టంకారమును నిందించుచున్నది.

—నేతి కామేశ్వరశాస్త్రి.

# ప్రోత్సాహబహుమానము —రూ. 10—

## "డు" పజ్‌ల్

ఇందు కనిపెట్టవలసిన పదములన్నియు మూడేసి అక్షరములవి. ప్రతి పదమునందును మధ్యను "డు" అను అక్షరము ఉండవలెను. మరియు ఆపదము యిచ్చిన సూచనకు సరిపోవలెను. ఉదాహరణము : 1. పాడుము.

ఇట్లే తక్కిన పదములను కనిపెట్టి, కాగితములో వ్రాసి నవంబరు 20-వ తేదీలోగున "ఆంధ్రభూమి"కి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకునివద్ద ఒక సీలు కవరులో ఉంచబడినవి. మైమాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు సమాధానముల నంపువారికి 10 రూపాయలు బహుమాన మీయబడును.

వగా :—సమాధానములు కాగితముమీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు కూడదు. ఒక్కొక్కరు ఎన్ని కాగితములయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చుకాగితమునకు 1 అణా చొప్పునను, వ్రాతకాగితమునకు 2 అణాల చొప్పునను (తపాలబిళ్ళలు) ప్రవేశరుసుముతో పంపవలెను.

### "డు" పజ్‌ల్

| | | | | |
|---|---|---|---|---|
| 1. | పా | డు | ము | వ్యసనము |
| 2. | — | డు | — | రాముని బంటు |
| 3. | — | డు | — | కోరకు కొందరు తపింతురు |
| 4. | — | డు | — | సిరి కలది |
| 5. | — | డు | — | ప్రాకును |
| 6. | — | డు | — | సినిమా కాంతల ప్రవీణత |
| 7. | — | డు | — | అంటుకొనును |
| 8. | — | డు | — | గ్రహణ సంబంధము |
| 9. | — | డు | — | స్త్రీ |
| 10. | — | డు | — | దేవునికి చెల్లించునది |
| 11. | — | డు | — | మీదపడినచో ప్రాణహాని |
| 12. | — | డు | — | కొలత |
| 13. | — | డు | — | విద్యాపీఠములు |
| 14. | — | డు | — | అడ్డె |
| 15. | — | డు | — | కంటచెరకు గా నుపయోగపడునది |
| 16. | — | డు | — | మనము ధరింతుము |

రచన

## కావను

### డు- పజ్ల్ సమాధానములు.

| | | | |
|---|---|---|---|
| 1 | పాదుము | 9 | ........ |
| 2 | ........ | 10 | ........ |
| 3 | ........ | 11 | ........ |
| 4 | ........ | 12 | ........ |
| 5 | ........ | 13 | ........ |
| 6 | ........ | 14 | ........ |
| 7 | ........ | 15 | ........ |
| 8 | ........ | 16 | ........ |

సంపాదకుని తీర్పును అంగీకరింతును.

పేరు........................................................

విలాసము........................................................

........................................................


ఆంధ్రకీర్తిగ్రంథమాల : ౧.

# ఆంధ్రరమణీమణులు

(మొదటిభాగము.)

ఇందు రుద్రమ్మ, గణపమ్మ, నాగమ్మ, మాంచాల, రాగమ్మ, మహాలక్ష్మమ్మ, సీతమ్మ, మల్లమ్మ, రమణమ్మ అను తొమ్మండుగురు తెనుగు తెఱవల జీవితములు నేటితెనుగున బాలికలకును, స్త్రీలకును ఉపయుక్తముగ నుండునట్లు వ్రాయబడినవి. స్త్రీవిద్యాభిమాను లాదరింపదగిన గ్రంథము. గ్లేసు కాగితములు, క్రౌనుసైజు. 96 పుటలు చక్కని అచ్చు. ప్రతి ఒక్కంటికి 0—9—0 అణాలు.

చిరునామా :—

ఆంధ్రభూమి కార్యాలయం : వేపేరి, మదరాసు.



| | |
|---|---|
| జీవితాలు<br>అన్నికొంటే ఖర్చులు లాభం. | డీవెలరా 0—5—0, దేపిబో౯ 0—3—0, గాంధీగారంటే 0—0—6, లెనిన్ 0—0—8, వినాయక్ 0—10—0, లక్ష్మి 0—12—0, కర్షకుడు 0—1—0, మనధనం 0—0—3.<br>గద్దె లింగయ్య. నాగవరప్పాడు రోడ్, గుడివాడ. |

# ఆరోగ్య విజ్ఞానము

## ౯. తువరకః - నీరుడుచెట్టు

తువరకవృక్షము కేసరములవంటి పత్రములను బత్తాయికాయలవంటి కాయలను గలిగి పశ్చిమసముద్రమునం దుత్పత్తియగును.

ఇది యొత్తుగాబెరుగు వృక్షజాతులలో నుత్పత్తిగలిగి కుష్ఠహార - రసాయన ద్రవ్యములందు శ్రేష్ఠమైనదిగా గణింపబడుచున్నది. వైవర్ణ్యమునుబట్టి దీనియాకులు కేసరములతో సమానముగా అనగా సన్నముగాను పొడవుగను నుండునని తెలియుగలదు. అయితే పశ్చిమ సముద్రభూములందు పొదుగచెట్టులో సమముగు ఆకృతిగలిగి వృద్ధిబొందుచుండునను డల్హణాచార్యనిరూపణమునుబట్టి దీనియాకు లోకవేళ పలాశపత్రములవలె (గుండ్రముగను కొంచెము విశాలముగను) ఉండునేమో యనిగూడ దెలియుచున్నది. శైలకోషి అను నామముచే యిది పర్వతములందుగూడ నుత్పత్తియగునని దెలియుగలదు. దీని కాయలు కలాయ సదృశములని వర్ణింపబడినవి. అయితే బజారులందు ఇవి వేరుశనగ కాయలనుబోలి విక్రయింపబడుచున్నవి. ఇవియే సర్వసాధారణముగా నుపయోగింపబడుచున్నవి. దీనివలన వైవర్ణ్యమునందలి కలాయశబ్దమునకు తక్సదమగు వేరుశనగయని యర్థమును గ్రహించుట యుక్తముగానుండును. ఈ వృక్షములనుండి బీజములే గ్రహింపబడి వైద్యమునందు రసాయనమునకు, కుష్ఠరోగమునకును విశేషముగా వాడబడుచున్నవి. ఈబీజములనుండి తైలము గ్రహించుదురు. ఇదిగూడ వైవిధముగనే వాడబడుచున్నది. ఈ వృక్షమునకు వ్యవహారమునందెట్టి ప్రయోగమున్నదియు గానరాదు.

గుణములు:—నీరుడుగింజలు లఘుతీక్ష్ణగుణములను ఉష్ణవీర్యమును గలిగియుండును. మలాదులను నిరోధించును, జాఠరాగ్నిని వృద్ధిబొందించును. కఫమును శమింపజేయును. విషము, రక్తదోషము, కండకుష్ఠము, కోష్ఠకృమి అను నీవ్యాధులను బోగొట్టును.

విశేషగుణములు: — కషాయరసమును తిక్తానురసమును కలిగియుండును. వ్రణమును, ప్రమేహమును, జ్వరమును, ఆనాహమును, అర్శస్సును శోఫను బోగొట్టును, బలమునుగలిగించును, రసాయనము.

పామ, విచర్చిక, సిధ్మము, దద్రువు, విపాదిక,ఆమవాతము, ఆమము వీనిని బోగొట్టును.

తువరకతైలము:—గింజల గుణములనేకలిగి మేదోవృద్ధిని, వ్రణమును, శోఫను బోగొట్టును, మధురరసమును కషాయతిక్తానురసములను, ఉష్ణవీర్యములను గలిగియుండును. దోషములను ఊర్ధ్వాధోముఖములుగ వెడలించును, వాతకఫములను శమింపజేయును.

తువరకకల్పము:—పశ్చిమసముద్రతీరములందు సముద్రతరంగములనుండి వచ్చు వాయువుయొక్క ప్రచారముచే నల్లలలాడు పల్లవములతోగూడిన తువరకవృక్షములనుండి బాగుగాపండిన పండ్లను వర్షాకాలమున గ్రహించి యందుండి మజ్జనుదీసి యెండబెట్టి చూర్ణించవలెను. పిమ్మట నువ్వులనుండివలెగాని కుసుంభబీజములనుండివలెగాని, పైచూర్ణించిన తువరకమజ్జనుండి తైలమును గ్రహించి యందుజలాంశముబోవునట్లు బొగ్గ నిప్పులపైనుంచి మెల్లగ పాకముజేసి యొకపక్షము దినములు జాగ్రత్తగ ఒకచో యునిచియుంచవలెను.

స్నేహస్వేదవమన విరేచన కర్మలచేసిన కుష్ఠరోగి యథాబలముగ మాత్రనుగల్పించి వైవిధముగ సిద్ధంజేయబడిన తువరకతైలమును ఆహారమునందలి నాల్గవకబళ

మునందు గలిపి శుభదివసమున నియ్యవలెను. దీనివలన దోషములు ఊర్ధ్వాధోముఖములుగ బలుమార్లు బయటకు వెడలును, సాయంకాలమున స్నేహలవణ వర్జితమగు యవాగును చల్లార్చి యాహారముగా నొసంగవలెను. ఈ విధముగ నైదుదినములు వరుసగానిచ్చి పక్షముదినములు పరిహారము ననుసరింపజేయవలెను. ఈ దినములందు కేవలము ముద్గయూషములతో (పెసరకట్టు) గూడిన యన్నమునుమాత్ర మాహారముగ నిచ్చుచుండవలెను. ఇటుల యథావిధిగ నైదుదినములు తువరక తైలమును సేవించినట్టివానికి సర్వకుష్ఠములును నశించును.

తువరక ఖదిరకల్పము:—

వైదిగముగ గ్రహించిన తువరక తైలము ఒకభాగము చంద్రసారకషాయము మూడు భాగములును గలిపి తైలపాకము జేసి వైవిధముగ పక్షముదినములు ఒకచో మూసియుంచి యథాబలముగనందుండి మాత్రనుగల్పించి సేవించుచు దీనితో శరీరమున కభ్యంగము జేసుకొనుచు నొకమాసము వరుసగా హితాహారము ననుసరించుచుండిన రొండల భిన్నస్వరము, రక్తనేత్రము, శీర్ణాంగము క్రిమిభక్షితాంగమునను కుష్ఠరోగి శీఘ్రముగ నట్టిరోగమునుండి విముక్తుడై సుఖవంతుడగును.

తువరక తైలమును, నేతిని, తేనెను ఒకటిగాకలిపి చంద్రకషాయముతో సేవించుచు పక్షుల మాంసరసముతో నాహారమును దీసుకొనుచుండిన రెండువందల సంవత్సరములు జీవింపగలుగును.

ప్రయోగములు:—

1. రసాయనమునకు:—విధిననుసరించి తువరక బీజములను సేవించుచుండిన జరావ్యాధిముక్తుడై చిరకాలము జీవింపగలుగును.
2. పక్ష్మకోపమను నేత్రవ్యాధియందు:—తువరక తైలముతో నేత్రములకు చుట్టును అభ్యంగము జేయుట మంచిది.

ఇది కుష్ఠరోగమునందేకాకుండ ఫిరంగిరోగమునందును క్షయరోగమునందును చర్మరోగములందునుకూడ వాడబడుచున్నది.

౬. దాడిమః: దానిమ్మచెట్టు

ఇది స్వాదు, స్వాద్వమ్లము, కేవలామ్లము అని రసభేదముచే మూడు విధములుగానుండి యెత్తుగా పెరుగు వృక్షజాతులలో నుత్పత్తిగలిగి యుత్తమఫలవర్గములో గణింపబడుచున్నది. ఇటుల భావమిశ్రుడు మూడువిధములుగ విభజించినను ఇతర నిఘంటుకారుల విభజనమునుబట్టి యిది స్వాదు, అమ్లము అని రెండు విధములుగనే విభజించుట యుక్తముగానుండును.

స్వాదుదాడిమ ఫలగుణములు:—

తియ్యని దానిమ్మపండు మధురరసమును, కషాయానురసమును లఘుస్నిగ్ధ గుణములను గలిగియుండును. తృప్తి గలిగించును. శుక్రమును వృద్ధిబొందించును, మలాదులను నిరోధించును, మేధాశక్తిని బలమును గలిగించును త్రిదోషములను శమింపజేయును. తృష్ణ, దాహము, జ్వరము, హృద్రోగము, కంఠరోగము, ముఖరోగము అను నీవ్యాధులను బోగొట్టును.

స్వాద్వమ్లదాడిమ ఫలగుణములు:—

తియ్యగను పుల్లగనుండు దానిమ్మపండు మధురరసమును అమ్లానురసమును లఘుగుణమును గలిగియుండును. జాఠరాగ్నిని వృద్ధిబొందించును. రుచిని బుట్టించును. కొద్దిగ పిత్తమును వృద్ధిబొందించును.

అమ్లదాడిమ ఫలగుణములు:—

పుల్లగనుండు దానిమ్మపండు అమ్లరసమును గలిగియుండును పిత్తమును వృద్ధిబొందించును. వాతకఫములను శమింపజేయును ఆమమును బోగొట్టును.

ఈ చెట్టు అంగములలో విశేషముగా ఫలమునకే ప్రయోగములున్నట్లు తెలియగలదు. బీజములు రుచికరముగను, తృష్ణాహరములుగను నుండుటంజేసి రోగులును భుజించుచుందురు. ఫలములత్వక్కు కషాయరసముగలదగుటచే గ్రహణ్యతీసారాది రోగములందు గాఢిగా నుపయోగింపబడుచున్నది. ఈ ఫలములు మొత్తమువీద జ్వర రక్తపిత్త గ్రహణ్యతీసారాదివ్యాధులందు విశేషముగా నుపయోగింపబడుచున్నది. దీని పుష్పరసము రక్తపిత్తమున నస్యముగా నుపయోగింపబడుచున్నది. ఇందు మధురరసముగలది శ్రేష్ఠమైనదిగా నెంచబడుచున్నది.

విశేషగుణములు:—

స్వాదుఫలము— ఉష్ణవీర్యమును గలిగియుండును. హృదయమునకు హితమైనది. కొద్దిగ కఫవాతములను విశేషముగ పిత్తమును శమింపజేయును.

ఆమ్లఫలం:— రూక్షగుణమును గలిగియుండును. వాతపిత్తములను వృద్ధిపొందించును.

ఫలత్వక్కు:— మలాదులను నిరోధించును. క్రిములను రక్తాతిసారమును పోగొట్టును.

ప్రయోగములు:—

1. రక్తార్శస్సునందు:— దానిమ్మకాయల బెరడు రసమును సేవించిన మంచిది.
2. రక్తాతిసారమున:— కొండిశ పాలచెట్టుయొక్క పట్ట ఒకపలము, దానిమ్మపిందెలపై బెరడు ఒకపలము ఇటుల గ్రహించి నలియగొట్టి రెని పదిభాగముల జలమునందుచేర్చి ఎనిమిదవ భాగము మిగులునరీతి గాచి వడబోసి అందుతేనె చేర్చి సేవించిన శమించును.
3. ఆమాజీర్ణమున:— దానిమ్మపండ్లరసమును నిత్యము సేవించుచుండిన ఆమాజీర్ణము అర్శస్సు మలబంధమును శమించును.
4. జ్వరమునందలి ఆస్యవైరస్యమునందు:— దానిమ్మగింజలను చక్కెరనుగాని; ద్రాక్షపండ్లను దానిమ్మగింజలనుగాని కల్కముగా నూరి ముఖమున ధరించి గండూషము చేయుట మంచిది.
5. అరుచియందు:— దానిమ్మపండ్ల రసమునందు విటూచూర్ణమును తేనెను గలిపి నోటియందు ధరించిన అసాధ్యమగు యరుచిగూడ శమించును.
6. ఉపదంశమునందు:— దానిమ్మపండ్ల బెరడును మెత్తగా చూర్ణించి చక్కెరలో చేర్చి అవచూర్ణముజేసిన ఉపదంశవ్రణము శమించును.
7. ముఖప్రవృత్తరక్తమునందు:— దానిమ్మపండ్ల బెరడును మెత్తగా చూర్ణించి చక్కెరలో చేర్చి సేవించిన నోటినుండి వెడలు రక్తము శమించును.
8. చలితగర్భమునందు:— దానిమ్మాకులచూర్ణమును, చందనచూర్ణమును, తేనెతో గలిపి పెరుగుతో సేవించిన ఐదవమాసమున చలించిన గర్భమునకు స్థిరత్వ మేర్పడును.
9. స్తన వృద్ధికి:— దానిమ్మత్వక్కల్కముతో నావనూనెను పాకముజేసి యభ్యంజనము జేసిన స్తనములును, కర్ణములును వృద్ధిపొందును.

—డాక్టరు ఐ. వి. శర్మ, ఎ.ఎం.ఎ.సి.



# “ఆంధ్రభూమి” పుస్తకపీఠము

## ౧౦౨. నేటిరష్యా

సనాతనమైన రాజకీయసిద్ధాంతాలన్నిటినీ త్రోసిరాజని, సర్వమానవ సమానత్వాన్ని సమకూర్చే సామ్యవాదానికి పుట్టిల్లయిన రష్యానుగురించి తెలుసుకోవాలనే అభిలాష మనదేశంలో బాగా కలిగింది. మనదేశమున్నమాటేమిటి! ప్రపంచం అంతాను. అందులో మా దాస్యభారంచేత బాధపడుతుండే దేశాల్లో ముఖ్యంగా. నిరక్షరకుక్షి, మూర్ఖఛాందసుడు, బద్ధకస్థుడు, త్రాగుబోతు అయిన రష్యనుకార్మికుడు, అద్భుతమైన పరివర్తనచెందేడు. కుటుంబవ్యవహారములలోనే అంటీముట్టనట్టుండే కూలివాడు నేడు విశాలమైన రష్యనురాజ్యమున కధికారిగానున్నాడు. విద్యావంతుడైనాడు, ఛాందసత్వమును వదలినాడు. బద్ధకమును విడిచి పారిశ్రామికుడైనాడు. త్రాగుబోతుతనమును, అవినీతికరమగు జీవితమును వదలేశాడు. ఇంతెందుకు! రష్యాలో నేడొక నూతనమైన జీవితపద్ధతి సృష్టింపబడింది. ఈ నూతనసృష్టిలో ధనికుడు దరిద్రుడు అనే భేదంలేదు. ఒకడు చెమటూడ్చి చాకిరీచేస్తూకూడా మడతకడుపుతో లేస్తుంటే, వేరొకడు కాలు కదపకుండా కూచుని విలాసజీవనంచేసే అస్వాభావిక స్థితిగతులంతరించాయి, నిన్నమొన్నటివరకు నల్లమందు భాయిలాపడున్న రష్యా నేడు నాగరికదేశాలని విర్రవీగే దేశాలన్నిటికీ ఆదర్శమయింది. ప్రజలలో అధికసంఖ్యాకులికి అధికసౌఖ్యం కలిగించడమే ఉత్తమప్రభుత్వం యొక్క లక్ష్యమని అంగీకరిస్తే నేటి రష్యాప్రభుత్వం ఉత్తమోత్తమమైనదని ఒప్పుకోకతప్పదు.

కాని సామ్రాజ్యవాదుల కిది భరింపరాని విషయం. ధనికుల సౌఖ్యంకోసం ఏర్పాటైఉన్న సామ్రాజ్యాలు రష్యాపేరు చెపితే గడగడలాడతాయి. అసహ్యించుకుంటాయి. అంబోతు ఎఱ్ఱగుడ్డను చూచినట్లే బెదురుతాయి. సామ్రాజ్యాధికారంపేరిట, సామ్రాజ్యవాదులు ఎటువంటి అత్యాచారాలనైనా సమర్థిస్తారు కాని రష్యాలోని సామ్యవాదప్రభుత్వం ధనికుల అవినీతిని తొలగించడానికీ, కూలివానిక్షేమం కోసమూ కట్టి ప్రయత్నాలు చేస్తే వాటినెంతో నీచంగానూ దారుణంగానూ అవినీతికరంగాను ప్రపంచానికి అరచిపెడతారు. ధనికులకు దాసులైన పత్రికావిశేషకులు రష్యానుగురించి ఎంత అధ్వాన్నంగానైనా వ్రాసి ప్రకటిస్తారు. ఇరువై శతాబ్దంలో ఇంత అన్యాయంగా రొష్టుపడ్డదేశం ఇంకొకటి లేదు. ఏదేశాన్నిగురించీ ఇన్ని అబద్ధాలు ప్రకటింపబడి ఉండవు. నిజం నిలకడమీద గాని తేలదుకదా!

ఇల్లాంటప్పుడు రష్యానుగూర్చి షా, వెబ్బు, కోల్ మొదలైన నిష్పక్షపాతులు వ్రాసిన గ్రంథములన్నిటిని పరిశీలించి అందులోఉండే విషయాలన్నీ టూకీగా క్రోడీకరించి, రష్యాయొక్క నిజస్థితిని తెలియపరచే వార్లవారి ‘నేటి రష్యా’ను తెలుగువారు ఆనందంతో ఆహ్వానించకమానరు. ఒక్కగంట విశేషంశ్రమ లేకుండా ఈ చిన్నపుస్తకం చదివితే రష్యాలోని నూతనజీవితం సమగ్రంగా అర్థమవుతోంది. పుస్తకంవ్రాసిన ఫక్కీ, విషయవిభాగం చాలా బాగున్నాయని చెప్పాలి. ఏ ప్రభుత్వంయొక్క మంచిచెడ్డలనైనా నిర్ణయించడానికి వేసుకోనే ప్రశ్నలకి వరుసగా వార్లవారు సమాధానం ఇచ్చారు ‘నేటి రష్యా’లో 1917 సం॥లో విప్లవానికి అనుకూలించిన స్థితిగతులు, సామ్యవాదతత్త్వం, కార్మికుని పరివర్తనం, స్త్రీస్వాతంత్ర్యం, సంసారికజీవనం, వ్యవసాయవృద్ధి పారిశ్రామికాభివృద్ధి, విద్యావ్యాపనం మొదలైన విషయాలన్నీ చక్కగా చర్చింపబడ్డాయి. రష్యా రాజ్యాంగవిధానంకూడా చివర చేర్చబడింది.

వార్లవారిదివరలో ‘స్వదేశ సంస్థానాలు’ ప్రచురించి ఆంధ్రలో కాని కంఠకుముందు తెలియని ఘోరవిషయా

లెన్నిటినో తెలిపి ఉలికిపడేటట్లు చేశారు. ఈపుస్తకం మూలంగా అనేకవిధాలైన అపోహాలకుపాలైన రష్యా నిజస్థితి చాలా సుకరంగా తెలియచెప్పి తెలుగువారికి మహోపకారంచేశారు. వార్లవారు తెలుగు పత్రికా పాఠకులకు చిరపరిచితులే. భారతి మొదలైన పత్రికలలో ముసోలినీ, మిలిటరీ వ్యవహారములు మొదలైన అమూల్యవ్యాసాలను వ్రాస్తున్నారు. ఆంగ్లభాషలో విదేశవిషయాలనుగూర్చి సుప్రసిద్ధులైన రచయితలు ప్రకటిస్తున్న గ్రంథాలన్నిటినీ చదివి, వాటి సారాంశములను చక్కని శైలిలో సుబోధకంగా ఉండేటట్లు మాతృభాషలో వ్రాసి ధన్యులగుచున్న యువకులలో వార్లవారు ముఖ్యులు. వీరిభాషలో ఒకవిధమైన శక్తి ఉంది. 'నేటి రష్యా'లోమాత్రము వీరిశైలిలో మధ్యమధ్య పెద్దపెద్ద ప్రయోగాలు కొంచెం హెచ్చుతగ్గులుగా పడ్డాయి. జనసామాన్యంకోసం వ్రాయబడే ఈ పుస్తకాలలో పూర్వకాలపు నవలల భాషకు స్థానంలేదని నా అభిప్రాయం.

వార్లవారింకా ఇల్లాంటి చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించి తెలుగువాళ్ళకి సేవచేస్తారని నమ్ముతున్నా, పుస్తకాలు అందంగా ఉంటేకాని చదువడానికి హెచ్చు రుచిగా ఉండదు. ఈ పుస్తకం తయారువిషయంలో దివ్యంగాఉంది. పుస్తకాలన్నీకొని చదివి వార్లవారిని ప్రోత్సహించడం ఆంధ్రులధర్మం.

పుస్తకాలు కావలసినవాళ్ళు, వార్లవారు, కాతరం, కృష్ణాజిల్లా, అని వ్రాసుకోవాలి. వెల 0—8—0 లు.

—క్రొవిడి లింగరాజు.

## ౧౦౩. పూలమాల

ఆధునికాంధ్ర కళా కుముద్వతికి సమర్పించిన సువర్ణ పుష్పమాలలలో నీ 'పూలమాల' యొకటి. చిరంజీవి సౌభాగ్యవతి స్థానాపతి రుక్మిణమ్మగారి పద్యములు భారతీదేవి ముంజేతి పలుకుచిలుకయగు 'భారతి'యందును, ఆంధ్రనారీమణుల కాదర్శగృహిణియగు 'గృహలక్ష్మి' యందును, కళోపాసకుల నివాసభూమియగు 'ఆంధ్రభూమి'యందును ప్రకటింపబడియుండుట విదితము. కుమారులందుకంటె కుమార్తెలందే భాషామతల్లికిని యనురాగము మెండుగానుండుట సహజము. అట్టిచో తన యనుంగు పుత్త్రి తొక్కుపల్కులు పలుకుచున్ననే కవితామాల తనకర్పింప భాషాదేవి సంతసింపకుండునా! వయసున పిన్నయయ్యును నీమెకు "కమ్రకవితామృతాస్వాదన" యందు పిపాస మెండు. నీరసములగు గృహకృత్యములు నిర్వర్తించుచు తీరిక సమయములలో చక్కప్రియములగు మాటలతో కాలము వ్యర్థముచేయు నారీమణులలోగూడ నిట్టి కవితా పిపాస యంకురించుట ముదావహము. కావ్యాధ్యయన మూలములను కళాశాలల దరికేగక, గృహముచే గురుకులముగా భావించి, ఆచార్యపీఠమును భర్తృసాన్నిధ్యమున స్వయంకృషిచే నిట్టికావ్యమాల నేర్చి కూర్చుట మతియు ప్రశంసనీయము. ఈ మాల చిన్నదయ్యును నిండలి పుష్పములు సౌరభము విడని మేలుజాతి కుసుమములగుటచే నిది చిరస్థాయిగా నెగడగలదు.

ఈకావ్య గుచ్ఛమునందు ప్రప్రథమమున గన్పట్టునది స్త్రీఅభిమానము. స్త్రీపురుషులకు తమతమ సంఘములపై నభిమానముండుట సహజమేకదా? ఈ చిన్నిపొత్తమున అంకితము మొదలు భరతవాక్యము వరకును గృహలక్ష్మికి సంబంధించిన విషయములే యెక్కువగా నున్నవి. 'కవిత' అను శీర్షిక క్రిందనైతము మొల్ల, తరిగొండ వెంగమ్మ, ముద్దుపళని, అచ్యుతాంబ, లే యీమె దృష్టికి గోచరించిరి. కాని కవిబ్రహ్మలు, కవిసార్వభౌములు,యీమె తలపునకైన రారైరి.ఇంతకంటె స్త్రీ అభిమానము యేమికావలయును? దేవతాస్తోత్రము విశ్వరూపిణియు, ఆదిశక్తియు, స్త్రీ ప్రతినిధియునగు కాత్యాయనిది. శబలిత బ్రహ్మలగు త్రిమూర్తుల ప్రశంసయే లేదు. 'గుమ్మడు' అనుశీర్షికగల కునుక తల్లి యొక్క అమాయకపు ప్రేమను, పిల్లల బాల్యచేష్టలను విశదీకరించును.

కావ్యకర్తయొక్క ప్రకృతి ననుసరించియే కావ్యవస్తువుండుటయే సహజము. కాళిదాసునకు శృంగారము, భవభూతికి కరుణ, తిక్కనకు వీరము, ప్రియమని చెప్పవచ్చును.అట్లునే యీ కవయిత్రికిని వీరమునందు ప్రీతి యున్నట్లు యీ కావ్యగుచ్ఛము లోని విషయములనుబట్టి తెలియనగును. నిశుంభ సంహారిణియైన సింహవాహినివలె శత్రుసైన్యమును చించి

చెండాడిన లక్ష్మీబాయిచరిత్రయు, శత్రువుల దౌష్ట్యముచే పుత్త్రులకు గల్గిన కష్టములకు సంక్షుభితహృదయయైన కుంతీ సందేశమును, సంధికొరకు కౌరవసభకు బోవుచున్న కృష్ణునితో రోషావేశము బ్రజ్వరిల్ల బ్రతిహింసకై కాలు దువ్వుచున్న ద్రౌపది పల్కిన వాక్యములు మిక్కిలి సమయోచితము లనక తప్పదు. ఇట్టి విషయమునందు బ్రీతి యుండుటచేతనే యీమె వీనిని కావ్యవస్తువులుగా గైకొనెను.

'సుమన - కాండిక'యను శీర్షికగల ఖండమునందును పరిశుద్ధదృశ్యము కనుకయందును బ్రధానవిషయము పాతివ్రత్యమయ్యును మొదటిది కేవలము ధర్మప్రసంగము. రెండవది పతిభక్తిని సూచించు కథ. తండ్రికి శ్రేష్ఠుని యందును, తల్లికి కనిష్ఠునియందును బ్రేమయెట్టిదో యిందు వ్యక్తమగుచున్నది.

ఈమె కవితారాధనలో సమర్పించిన దిదియే మొదటి 'పూలమాల'యని దీనిపాటయే చెప్పుచున్నది. అందుచే దోషములుండుట వింతకాదు. ఈ విషయమామె తొలుత నే 'మనవి'లో జెప్పెను. అదియెట్లనగా,

"తెలుపగారాని యానంద జలధిమునిగి
పొందుగా గ్రుచ్చి చేకుంతి పూలమాల
కాంక్షతో డుత భవదీయ గళము జేర్ప
దిరుగునంతలో ముఖమటు త్రిప్పినావు
సర్వము సమానముగద! విశాలమతికి
దేవి! కోపకారణమేమొ? తెలియరాదు"

అనుదానిలో కావ్యసరస్వతియొక్క కృపాకటాక్షము నీమె పాత్రురాలగాకపోయినను వాంఛిత వ్యంగ్యముగా తెలియుచున్నది.

జ్ఞానార్జనము చేయుటయందును కవిత చెప్పుటయందును పూనిక, శ్రద్ధ యీమెకు మెండని ఆంధ్రీకరణములే చెప్పును. ఈమె యాంధ్రీకరణము సాధ్యమైనంతవరకు మూలము ననుసరించియేయుండును. దీని కుదాహరణము.

శ్లో॥ "ఆశయాబద్ధతేలోకః । కర్మణాబహుచింతయా
ఆయుఃక్షీణం నజానాతి। తస్మాజ్జాగ్రత్త! జాగ్రత!"

'ఆశచే బద్ధమయిపోయె నఖిలజగము
వింతగా కర్మలన్ బహుచింతలొదవు
తరుగువిషము, నాయుఃక్షీణ మెరుగదహహ!
కానజాగర్తి! జాగర్తి! కాచుకొనుడు'
(ఈమె ఆంధ్రీకరణము)

'బ్రతుకు తెరువెన్నముండ్లతో బలిసియుండు
చావు పుట్టుక లెన్నగా జాలగలవు
వసుధపై సతీసుతులతో బ్రతుకు టెన్న
గాలివానల మునుగుచు దేలుచుంట
గాన జాగ్రత! జాగ్రత గాంచవలయు'
(మరియొకరు)

శ్లో॥ 'క్షణంచిత్తం, క్షణంవిత్తం, క్షణంజీవితమావయోః
యమస్యకరుణంనాస్తి తస్మాజ్జాగ్రత! జాగ్రత!'

'క్షణముచిత్తము విత్తము క్షణమెనున్న
క్షణము జీవితమెల్లను క్షణము నటన
ఎటుకతెలియుడు యమునకు గరుణలేదు
కానజాగర్తి! జాగర్తి కాచుకొనుడు'
(ఈమె ఆంధ్రీకరణము)

'జనము ధనముకెవుడు దాస్యంబుసేయు
పిల్లగాలులు సుడిగాలి బెంచుచుండు
ప్రతిపదంబును గమనించి పలుకవలయు
ప్రాణవాయువు వడివడి పరువులిడును
గానజాగ్రత! జాగ్రత గాంచవలయు'
(మరియొకరు)

ఈరెంటియందలి సారస్యమును గుణగ్రహణ పారీణులగు పాఠకులే నిర్ణయింతురు గాక!

నారీమణులు సంసారయాత్రను సంతోషముతో గడుపుటయే గాక తామిట్టి కావ్యానందమును బొందితమ జీవితసహచరులగు భర్తలకు జవిజూపుట మొదలిడినచో

'కష్టభరితంబు బహుళ దుఃఖప్రదంబు
సారరహితంబునైన సంసారమందు
భార్యయను స్వర్గమొకటి కల్పనముజేసె
పురుషులనిమిత్తము పురాణ పూరుషుండు'

అనువానుడి సార్థకమగును. జ్ఞానార్జన, సహృదయ ప్రోత్సాహము అను సకోమదోహదముచే నీకవయిత్రీమణియొక్క కవితాలత పెరిగి పెద్దదై సర్వజనామోదముగ ఫలించుగాక! ఇట్టి నారీమణుల కాంధ్రకవిలోకము చేయూత నిచ్చుగాక!

--గొ. సూర్యనారాయణరావు, బి.ఏ ఆనర్సు.

## • సంపాదకీయ సమాలోచన •

**ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి:—**

గోదావరి ఆనకట్ట తలపున బాగుటతోడనే దాని నిర్మాత కాటన్ దొరకూడ తలపున తట్టును. అట్లే మదరాసునందలి ప్రభుత్వమువారి ఆయుర్వేదపాఠశాలను తలచుకొనినతోడనే దాని అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి తలపునతట్టును. పదిఏండ్లకు పూర్వము ఆపాఠశాల శాసనసభలో సభ్యుల ఉపన్యాసములలో మాత్రముండెను నాలుగేండ్ల క్రితమువఱకును తాటియాకుపాకలు. ఇపుడచట ఇటుక, సున్నములతో బ్రహ్మాండభవనములు వెలసి అధ్యక్షుని ప్రజ్ఞకు, దీక్షకు మానదండములై యున్నవి. ఈ ప్రాంతమున ఆయుర్వేదము నుద్ధరించిన మహనీయులు వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులవారు. ఈపాఠశాలకు మూలబీజమువారు నాటినదే. వారి అనంతరము భిషగ్రత్న ఆచంట లక్ష్మీపతిగా రాబీజము చావకుండ కాపాడి స్తవనీయులైరి. ప్రభుత్వమువారి ప్రాపున శ్రీనివాసమూర్తిగారు ఆబీజమును మొలకలెత్తించి ఏపుగ పెంచి దానినిపుడు ప్రత్యేక మొక పెద్ద సంస్థగావించి యున్నారు. శ్రీనివాసమూర్తిగారికి షష్టిగడియలు ఈపాఠశాల అభివృద్ధిని గూర్చిన తలపోతలే. ఏపులేని ఎత్తరితనము, ఉన్న తేజస్సు ముందుర మఱింత లొక్కుగా కనిపించు బక్క పలుచటి శరీరము-ఆయనను చూచినవారికి ఆయనకడ ఇంతటిప్రజ్ఞ, ఇంతటి దీక్ష ఉన్నట్లు పొడగట్టదు కాని ఆయన ప్రజ్ఞవలనను, దీక్షవలనను తాటియాకుపాకలు బ్రహ్మాండభవనములైనవి; మెడికలు సర్టిఫికెట్టులు ఇచ్చుటకుకూడ అర్హత లేకుండిన ఆయుర్వేదపట్టభద్రులు ఇపుడు ఇతరపట్టభద్రులతో సమానమైన అధికారమును పొందగలిగియున్నారు. ఇట్టి వీరిమూలమున కలిగిన మేళ్ళను ఎన్నని పేర్కొనగలము? ఆ పాఠశాలకు ఆకారము దిద్దినది వారు, దానిని అభివృద్ధినందించినదివారు. ప్రజాలోకమును ప్రభుత్వమును ఈవిషయమును గుర్తించియే యున్నది. ప్రభుత్వమువారు శ్రీనివాసమూర్తిగారికి వైద్యరత్నబిరుదము నిచ్చియున్నారు. ప్రజాలోకమున కదియొక సంతోషకరవిషయమైనది. వీరు దివ్యజ్ఞానసమాజమునకు చెందినవారు. తాను నేర్చిన ఉన్నతవిద్యను, తనకుగల అనుభవమును, దివ్యజ్ఞానసమాజసభ్యుడుగా తనకు ఉండుకున్న పలుకుబడిని పూర్తిగ వినియోగించి మదరాసు ఆయుర్వేదపాఠశాలను దివ్యతరముగ అభివృద్ధికి తెచ్చిన ఈ మహనీయుడు ప్రజాలోకమున లోకపూజ్యలింగమై వెలయుచున్నాడు.

**భారతీయ గ్రంథాలయములు:—**

ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము ప్రారంభమై మూడు పుష్కరములు దాటినది. కాని ఇంతవఱకు మన గ్రంథాలయముల చరిత్రను - వేదకాలమునుండి ఇప్పటివఱకుగల వృత్తాంతమును - ప్రస్తరించిన గ్రంథమొకటియు ఆంధ్రమున లేదు. గ్రంథాలయముల వార్షికోత్సవ సమయములందు గావింపబడు ఉపన్యాసములలో దిఙ్మాత్రముగ అట్టి చరిత్ర ప్రస్తావింపబడుటయేగాని విపులచరిత్రరచనకు ఇంతవఱకు గట్టిప్రయత్నము చేయబడలేదు. ఈలోపమును గుర్తించి శ్రీమాకేమంద రామారావుగారు అట్టి చరిత్రరచనకు గడంగి పూర్తిగావించిరి. దానిని ఆంధ్రభూమిలో క్రమప్రచురణముగావింప ఏర్పాట్లు చేసియున్నారము. రామారావుగారు ఆంధ్రభూమి పాఠకులకు క్రొత్తవారు గావున

వారినిగూర్చి ఒక్కింత తెలుపుట ఇచ్చట అప్రస్తుతముకాదు. వారు ఆంగ్లమున ఎం.ఏ పరీక్షనిచ్చిన విద్యార్థికులు. వారి అధికవిద్య సేవకావృత్తికి చొఱబాఱు సాధారణమార్గము నవలంబింపక చరిత్రకు, సారస్వతమునకు అక్కఱకువచ్చు మార్గమును బట్టినది. ఆంధ్రచరిత్రకు సంబంధించిన విషయములను ఆంగ్లమున వ్యాసరూపమున వెల్వరించుచు ఇతర దేశపు పరిశోధకులదృష్టికి వానిని తెచ్చుచున్నారు. భారతి, గృహలక్ష్మి, త్రిలింగ మొదలగు తెలుగుపత్రికలు రావుగారి పరిశోధక వ్యాసములతో పరిపుష్టి నొందుచున్నవి. కాకతీయసంచిక సంపాదకత్వము, గద్వాల సంస్థాన చరిత్రరచనము ఈ యువక పరిశోధకునకు ప్రతిష్ఠ గూర్చజాలియున్నవి. పలుగ్రంథములు పరిశోధించి పరిశ్రమించి శ్రీరామారావుగారు రచియించిన 'భారతీయగ్రంథాలయములు' అను విషయమును గూర్చిన వ్యాసపరంపరను ఆంధ్రభూమియందు గ్రంథాలయోద్యమము అనుశీర్షిక క్రింద మాసక్రమమున ప్రచురింపగలము. గ్రంథాలయ పాలకులు ఈప్రచురణమునకు ఉచితోపయోగ్యవృత్తిని కల్గింతురుగాక అని కోరెదము.

**చదువుకున్నవారిలో నిరుద్యోగము :**


**వ్యవసాయము:—**

---

హిందూదేశమున ప్రస్తుతము చదువుకున్నవారిలో నిరుద్యోగము ప్రబలియున్నది. ప్రభుత్వమువారి పక్షమున దీనిని నివారించు ప్రయత్నములు కానము. ఇక ప్రజానాయకులు. వారు ఎంతసేపునుపోయి పల్లెలలో వ్యవసాయము జేయుడని చెప్పెదురు. చదువులకు వీరిభూములు చాలభాగము పోయినవి. ఉన్నవారలు వారిభూములను కవుళ్ళకిచ్చియున్నారు. ఆకవుళ్ళను రద్దుచేసి వీరు సొంతముగ వ్యవసాయమునకు కడంగినచో ఇదివఱకు ఆచేనుచేయుచున్న రైతుగతియేమి? కవులుకొండ్ర పోవుటతో ఆరైతు ఉదరపోషణార్థము పాలికాపో, కూలివాడో కాక తీరదు వ్యవసాయానుభవముగల రైతు ఇల్లు తలక్రిందులై పాలికాపుగా, కూలివాడుగా దిగిపోవుట దేశమునకు క్షేమము గూర్చువిషయముకాదు. ఈనాందారుడే సేద్యదారుడైనచో ఎందరో రైతులు ఈశోచనీయపరిస్థితులలో పడుదురు. ఉన్న సమస్యలకు ఇది యొక క్రొత్త సమస్య తోడగును. పైగా ధరలుతగ్గియున్న ఈదినములలో వ్యవసాయవృత్తి ఆకర్షణీయముగ లేదు. రైతుఋణములలోనున్నాడు. ఈ స్థితిలో అతనికి కవులుకొండ్రలు లేకుండపోవుచో, అతనిస్థితి మఱింత దుర్భరమగును. కవులుకొండ్రలు పోవును. అప్పులవాండ్ర బాధ అధికమగును—రైతు త్వరగ చితికిపోవుట కింతకంటె కావలసినదియేమి? ఇక క్రొత్తగ కమతముకట్టిన ఇనాందారుడు. ఇతడు ప్రాయికముగా చదువుకొనినవాడై యుండును. చదువుకొనినవాడు కావున కాయకష్టపడుటకు ఒడబడజాలడు. ఒడబడినను కాయకష్టమునకు ఓర్పులేదు. అన్నిపనులకు కూలివానిపై ఆధారపడవలసియుండును. పైగా వ్యవసాయమున కాతడు క్రొత్త. అనుభవములేకుండుట అను దోషమునకు పెట్టుబడి ఎక్కువగ కావలసియుండుట అను విషయముతోడై అతని బాధ్యతలను పెంచును. ధరలు మందములో కిట్టుబాటులో ఏమాత్రము దిగలాగినను ఆతడు తట్టుకొనలేక నిరుత్సాహమునకు లోనగును. కావున చదువుకున్నవారిలో నిరుద్యోగులను వ్యవసాయముచేయుమని ప్రోత్సహించుట ఉచితమైనదికాదని ప్రజానాయకులు ఎంతత్వరగ గ్రహించిన అంతమంచిది.



1 హకీమ్‌నగర స్థాపనసమయమున




2 దర్భంగ భవనము

## ఆవడి ఆరోగ్యాశ్రమ దృశ్యములు



3.



4.